ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
శుక్రవారం 20, డిసెంబరు 2024

## ఉత్సాహంగా క్రీడా సంరంభం

ఒంగోలులో క్రీడా సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 27వ అంతర్ పాలిటెక్నిక్ క్రీడాపోటీలు గురువారం మొదలయ్యాయి.



వాలీబాల్ పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు

7


జ్వరంతో మంచం పట్టిన వృద్ధురాలు

## రామాయపాలేనికి జ్వరమొచ్చింది

- ఇంటింటా పెరుగుతున్న బాధితులు

7


దరిమడుగులో ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

'చేతిలో అధికారం ఉంది. వెనుక రాజకీయ బలముంది. అధికార యంత్రాంగం చెప్పుచేతల్లో ఉంది. ఇంకేముంది.. ఏం చేసినా అడిగే దిక్కులేదు. ఎంత దోచుకున్నా ఆపే ధైర్యం లేరు. ఏది ఆక్రమించినా అడ్డుకునేవారు లేరు'.. గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల తీరిదీ.. ప్రభుత్వ భూములనూ, చెరువులనూ ఆక్రమించి పట్టాలు సృష్టించి అమ్మి రూ.కోట్లు కూడబెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో తాజాగా జరుగుతున్న రెవెన్యూ గ్రామసభల్లో ఈ అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. మార్కాపురానికి సమీపంలోని దరిమడుగులోనూ, పక్కనున్న పెద్దనాగులవరంలోనూ రూ.కోట్ల విలువైన భూముల అక్రమం బయటపడింది. ఇదంతా దరిమడుగుకు చెందిన వైసీపీ నేత, మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధి నేతృత్వంలో కొనసాగింది.




# భూచోళ్లు!

## గత ప్రభుత్వంలో యథేచ్ఛగా ఆక్రమణలు

- ప్రభుత్వ భూములకు పట్టాలు సృష్టించి అమ్మకం
- మార్కాపురం సమీప గ్రామాల్లో రూ.కోట్ల విలువైన భూములు విచ్చలవిడిగా విక్రయం
- రెవెన్యూ సదస్సుల్లో భారీగా ఫిర్యాదులు
- కొరడా ఝుళిపిస్తున్న అధికారులు
- ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు

మార్కాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దరిమడుగు గ్రామంలో భూఅక్రమాలు రోజుకొకటి వెలుగులోకొస్తున్నాయి. గురువారం ఇడుపూరు రెవెన్యూ గ్రామసభలో ఓ వైసీపీ నేత జాతీయ రహదారిని అనుకుని ఉన్న రూ.కోట్ల విలువైన ఆర్అండ్‌బీ స్థలాన్ని కొట్టేశాడని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే సబ్ కలెక్టర్, తహసీల్దార్ వెళ్లి పరిశీలించి సిబ్బందితో అక్కడ ఆక్రమణలు తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారం అండతో దరిమడుగులో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి మిగతా 6లో...


ఆర్అండ్‌బీ స్థలంలో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి

### ఇవిగో మరిన్ని అక్రమాలు



- గ్రామానికి చెందిన మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధి అక్రమాలు లెక్కలేనన్ని ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ శాఖకు చెందిన 0.70 సెంట్ల భూమిని కూడా ఇదే తరహాలో కొట్టేశాడు.
- కూటమి అధికారంలోకి రావడంతోనే వెనుకన ఉన్న పట్టా భూమిని ఒంగోలుకు చెందిన ఓ ట్రాక్టర్ షోరూమ్ వారికి అమ్మేశాడు.
- ఓ మాజీ మంత్రి ఇంజనీరింగ్ కళాశాల పక్కనే ఉన్న మరో చిన్నపాటి చెరువుకు సంబంధించిన భూమిని కూడా ఇదేవిధంగా పక్కనే వెంచర్ వేసి ఆక్రమించుకున్నారు.
- గ్రామంలోని ఆటోనగర్ ప్రాంతంలో అసైన్‌మెంట్ భూములను బినామీ పేర్లతో సుమారు 20 ఎకరాల మేర గత ప్రభుత్వ హయాంలో కొట్టేసినట్లు తెలిసింది.
- ఆటోనగర్ ప్రాంతంలోని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన 2 ఎకరాల ప్రభుత్వ భూమిని మరో సర్వే నెంబర్ వేసి అమ్మి రూ.కోట్లలో దండుకున్నారు.
- ఇవేకాక గ్రామంలో ఎలాంటి భూసమస్యలున్నా ఆయన ప్రమేయం తప్పక ఉంటుందని గ్రామస్థులు బహిరంగంగానే చెబుతున్నారు. ఇంతటి స్థాయిలో అక్రమాలు చేస్తున్నా ఎక్కడా అతని పేరున కానీ, కుటుంబ సభ్యుల పేరున కానీ ఒక్క పత్రం కూడా ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అంతా అతని అనుయాయులైన బినామీల పేరుతోనే అక్రమాలను కొనసాగించాడు.
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రామంలో అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి సమగ్రంగా విచారించి ఆ వైసీపీ నేత కబంధ హస్తాల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో గురువారం డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఏపీవోలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడంతోపాటు క్లోరినేషన్ ప్రక్రియను పటిష్ఠంగా అమలు చేసే విధంగా చూడాలన్నారు. ప్రతిరోజూ పారిశుధ్య ఏర్పాట్లపై వచ్చే ఫిర్యాదులను అదేరోజు పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పటిష్ఠంగా అమలు జరిగేలా కంట్రోలు రూమును ఏర్పాటు చేసి రోజూ మానిటరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సంక్రాంతి నాటికి జిల్లాలో అన్ని మండలాల్లో మంజూరైన క్యాటిల్ షెడ్స్‌ను పూర్తిచేయాలన్నారు. అమృత్ సరోవర్ పథకం కింద చెరువులను అభివృద్ధి చేసేందుకు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఒక చెరువును గుర్తించాలన్నారు. జిల్లాలో 729 గ్రామపంచాయతీల్లో 358 గ్రామాల్లో మిగతా 6లో...


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన అధికారులు

## రేపు ప్రాజెక్టుల కమిటీ ఎన్నికలు

- రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో నిర్వహణ
- జిల్లాలో మూడు మధ్యతరహా ప్రాజెక్టులు
- సాగర్ ప్రాజెక్టు కమిటీలో భాగస్వామ్యం
- నర్సరావుపేట కలెక్టరేట్‌లో పోలింగ్

ఒంగోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఈనెల 21న జరగనున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో సాగునీటి రంగం మూడు విభాగాలుగా నడుస్తుంది. చెరువుల పర్యవేక్షణ మైనర్ ఇరిగేషన్‌లో ఉండగా మధ్యతరహా నీటి వనరుల పర్యవేక్షణ మీడియం ఇరిగేషన్‌లోనూ, భారీ ప్రాజెక్టుల పర్యవేక్షణ మేజర్ ఇరిగేషన్ విభాగంలో ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్‌లో మూడు స్థాయిల్లో సాగునీటి సంఘాలు ఉండగా మీడియంలో రెండు, మైనర్ విభాగంలో ఒక స్థాయిలో ఉన్నాయి. మూడు విభాగాల్లోనూ క్షేత్రస్థాయిలో డబ్ల్యూయూఏలు ఉండగా వాటికి ఈనెల 14న ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో 88 మేజర్, 14 మీడియం, 240 మైనర్ ఇరిగేషన్‌లో డబ్ల్యూయూఏలు ఉండగా అన్నింటికీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రెండవస్థాయిలో మేజర్ విభాగంలో సాగర్ ప్రాజెక్టు పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లు ఉండగా జిల్లాలోని 10 డీసీలకు ఈనెల 17న ఎన్నికలు జరగ్గా అన్నీ ఏకగ్రీవంగా జరిగాయి. ఇక చివరి అంకమైన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఈనెల 21న జరగనున్నాయి. మిగతా 6లో...

## కొండభూమికి పట్టాలు ఇవ్వలేదు

- కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాళ్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం కొండ భూమికి సంబం ధించి ఎవరికీ పట్టాలు మంజూరు చేయలేదని తహసీల్దార్ సంజీవ రావు... కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నివేదిక పంపారు. 'కొండభూమికి టెండర్' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు తహసీల్దార్ పూర్తి విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదించారు. గ్రామంలోని సర్వే నంబర్ 489లో 663.23 కొండ భూమిగా ఉందని, ఇందులో పట్టాలు పంపిణీ జరగలేదని, కొండ భూమిలో ఎన్ఎస్‌పీ కాలువ పోతుందని నివేదికలో పేర్కొన్నారు. ఆ సర్వే నంబర్ 5 సబ్‌డివిజన్లుగా మారి వెట్‌ల్యాండ్, 22-1బి489/1ఏ, 489/1బి, 489/2, 489/3, 489/4గా నమోదయిందని, ఇటీవల టీకేపీ హైవే రోడ్డు నిర్మాణ సంస్థ గ్రావెల్ కోసం దరఖాస్తు చేసుకుందని తెలిపారు. ఈ క్రమంలో 1.5 హెక్టార్లకు తాత్కాలిక అనుమతి ఇచ్చినట్టు, కొండ భూమికి డీకే పట్టాలు మంజూరు చేసినట్టు రికార్డులు లేవని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి ధ్రువీకరించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, 1ఏ,1బీలో మాత్రం ఆరుగురు పేర్లు నమోదుచేసినట్టు రికార్డులు తారుమారు చేసినట్టు గుర్తించామని, ఆ పట్టాదారుల పేర్లు నకిలీవిగా గుర్తించామని తెలిపారు. పట్టాదారులను నోటీసులు ద్వారా పిలిపించి విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని నివేదికలో తహసీల్దార్ తెలిపారు.

## నెలాఖరుదాకా..

- పంటల బీమా నమోదుకు గడువు పెంపు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాన్ని ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సీజన్‌లో వరి, శనగ, జొన్న, మినుము, మొక్కజొన్న, ఎర్రమిరప పంటలు సాగు మిగతా 6లో...

## పీఐసీల పదవీ కాలం పొడిగింపు

ఒంగోలు విద్య, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 176 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా ల అధికార పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ)ల పదవీ కాలాన్ని పొడిగి స్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21 నుంచి ఆరు నెలల పాటు వీరి పదవీ కాలాన్ని పొడిగించారు. ఆరునెలలు లేదా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరిం చేంత వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఈ అధికార పీఐసీలు కొనసాగుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పెరల్ డిస్టిలరీలో తనిఖీలు

7

# పెయ్యలతిప్పను తవ్వేస్తున్నారు!

- గ్రావెల్ తవ్వకంతో ప్రాజెక్టుకు ముప్పు
- ఎఫ్ఆర్ఎల్ లోపు తవ్వుకోవడానికి మాత్రమే అనుమతించిన ఎస్ఈ


పెయ్యలతిప్పలో గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్లు

మద్దిపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన జలవనరు కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ జలాశయానికి భారీ ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో విజయవాడ నుంచి బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపడుతున్న క్రమంలో సదరు కాంట్రాక్టు సంస్థ మండల పరిధిలో ఉన్న గార్లపాడు గ్రావెల్ కొండలో అనుమతులు లేకుండా తవ్వకాలు ప్రారంభించడంతో బుధవారం దొడ్డవరం గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గుండ్లకమ్మ జలాశయం కుడి కరకట్టకు దన్నుగా నిలిచిన పెయ్యలతిప్పను ఆనుకొని జలాశయం లోపల వైపు ఉన్న గ్రావెల్‌ను తవ్వుకోవడానికి సిద్ధమయ్యారు. ఆ మేరకు ప్రాజెక్టుల ఎస్ఈ అనుమతి ఇవ్వడంతో ఆ సంస్థ గురువారం పెయ్యాలతిప్పకు వెళ్లడానికి దేనువకొండ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఎన్నెస్పీ కెనాల్ మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఎన్నెస్పీ కెనాల్‌ను కొంతమేర పూడ్చివేశారు. సదరు కంపెనీ పెయ్యాలతిప్ప నుంచి గ్రావెల్ తరలిస్తే రిజర్వాయర్‌కి కుడివైపున ఉన్న కరకట్టకు బలం తగ్గి నీరు బయటకు వస్తే గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. గతంలోనే పెయ్యలతిప్ప నుంచి చుట్టుపక్కల గ్రామాల వారు గ్రావెల్‌ను తరలించుకుపోయారు. ప్రస్తుతం కన్‌స్ట్రక్షన్ కంపెనీకి వేల టన్నుల గ్రావెల్ అవసరం ఉంది. దీంతో వారు ఎఫ్ఆర్ఎల్ బయట కాకుండా గ్రావెల్ తరలించడానికి గతంలో పాతి ఉన్న రాళ్లను సైతం పెకిలించి వేసి గ్రావెల్ తవ్వుతున్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌ను వివరణ కోరగా హద్దులు నిర్ణయించకుండా జలాశయం అధికారులు అనుమతులు ఇవ్వడంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తానన్నారు. గుండ్లకమ్మ జలాశయంలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడానికి జలాశయ ఎఫ్ఆర్ఎల్ సామర్థ్యాన్ని పెంచడానికి అనుమతులు ఇచ్చామని చెబుతుండగా ఇరిగేషన్, రెవెన్యూ వారు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ రిజర్వాయర్‌ను నిలువునా ముంచే స్థితికి తీసుకొస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి ధ్వజం

6


రామయ్యకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న బోదనంపాడు గ్రామస్థులు

## అందరి బంధువయా.. బోదనంపాడు రామయ్య..!

- గ్రామమే అతడి గృహం.. గ్రామస్థులే కుటుంబ సభ్యులు
- యాచకుడిగా వచ్చి అందరికీ ఆత్మీయుడిగా మారిన వైనం
- అతడి మృతితో మూడు గ్రామాలు ఏకమై అంత్యక్రియలు

7

## మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల తారుమారు.. అధికారులపై చర్యలకు ఆదేశం

గిద్దలూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఎన్నికలలో వార్డుల రిజర్వేషన్ తారుమారు చేశారన్న ఫిర్యాదులపై విచారించిన ఉన్నతాధికారులు అప్పటి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి కె.కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 2000 సంవత్సరంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో చైర్మన్‌తోపాటు పలు వార్డుల రిజర్వేషన్లను అప్పటి అధికార వైసీపీ నాయకుల అండదండలతో అధికారులు తారుమారు చేశారని, ఇష్టారాజ్యంగా రిజర్వేషన్లు చేశారని మాజీ వార్డుమెంబర్ బొంతా పూర్ణచంద్రారెడ్డి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు విచారణ చేసి రిజర్వేషన్ల తారుమారుపై స్థానిక సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించారని నిర్ధారించారు. అయితే వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు స్థానిక సిబ్బందిపై చర్యలు తీసుకోలేదు. ఈవిషయంపై పూర్ణచంద్రరెడ్డి మళ్లీ ఫిర్యాదు చేయడంతో రిజర్వేషన్ల తారుమారుకు పాల్పడిన అప్పటి మున్సిపల్ కమిషనర్ కె.హైమావతి, టౌన్ ప్లానింగ్ అధికారి షేక్ మహబూబ్‌బాషా, మేనేజర్ షేక్ నూరుల్లాహుస్సేన్, జూనియర్ సహాయకులు ఆనీస్‌కుమార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కె.కన్నబాబు తాజాగా మున్సిపల్ డైరెక్టర్‌కు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఘర్షణ కేసులో నిందితులకు జైలు

సంతనూతలపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఘర్షణ కేసులో నిందితులకు స్పెషల్ మేజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. ఎస్ఐ వి.అజయ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మైనంపాడుకు చెందిన కుంచాల జయలక్ష్మి అనే మహిళ అనారోగ్యం రీత్య సంతనూతలపాడు వడ్డెరపాలెంలో నివాసముంటున్న చిన్న కూతురి వద్దకు వచ్చి ఉంటోంది. ఈక్రమంలో అక్కడే సమీపంలో నివాస ఉండే పెద్దకూతురు తన్నీరు తిరుపతమ్మ, ఏడుకొండలు, శివయ్యలు కుటుంబ కలహాల నేపథ్యంలో కుంచాల జయలక్ష్మిపై కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో ఆమెకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. అనంతరం రిమ్స్ నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ మేరకు సంతనూతలపాడు పోలీసులు కేసునమోదు చేశారు. ఈక్రమంలో గురువారం స్పెషల్ మేజిస్ట్రేట్ ఎక్సైజ్‌కోర్టు న్యాయాధికారి ఎస్.కోమలవల్లి తీర్పువెలువరించారు. నిందితులకు ఒక సంవత్సరం జైలు, జరిమానా విధించారు. నిందితులకు సకాలంలో శిక్షపడటంలో కోర్టు కానిస్టేబుల్ కె.వెంకట్రావు, ఎస్ఐ వి.అజయ్‌బాబును ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

చెరువులను గుర్తించామని, మిగిలిన గ్రామాల్లో అభివృద్ధి చేయాల్సినవి గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫాంపాండ్ నిర్మాణాల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద 2055.2 ఎకరాల విస్తీర్ణంలో 968 పనులు మంజూరుచేయగా 365 పనులు చేపట్టి 782.84 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తిచేశారన్నారు. మిగిలిన 603 పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డుల వెరిఫికేషన్‌ను కూడా త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి డిమాండ్ సర్వేను పక్కాగా నిర్వహించి ప్రతిపాదనలు పంపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నెలాఖరుదాకా..

(5వపేజీ తరువాయి)

చేసిన రైతులు మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. వరి పంటకు సంబంధించి బీమా నమోదు ఈనెలాఖరు వరకు ఉండగా మిగిలిన ఐదు రకాల పంటలకు ఈనెల 15వ తేదీతో గడువు ముగిసిందన్నారు. అయితే రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదనలకు అనుగుణంగా కేంద్రప్రభుత్వం మిగిలిన పంటలకు కూడా ఈనెల 31వతేదీ వరకు బీమా నమోదు గడువును పొడిగించిందని తెలిపారు. జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విరిసి.. మురిసి...!

ఆకాశాన్ని తారల తళుకులతో సింగారించినట్లు.. భూమాతను బంతి పూలతో అలంకరించినట్లుగా ఉంది కదూ పక్క చిత్రాలు... మద్దిపాడు మండలం దొడ్డవరం శివారు ప్రాంతంలో రెండు ఎకరాల్లో సాగు చేసిన బంతి తోట విరగబూసింది. ఇలపావులూరుకు చెందిన రైతు పి.శ్రీనివాసరావు తన పొలంలో బంతి సాగు చేపట్టారు. దారిన వెళ్లే వారు ఆ బంతితోటను చూసి ముగ్ధులవుతున్నారు.






# కొత్తపట్నం బీచ్‌లో పర్యాటకులకు కట్టుదిట్టమైన భద్రత

● జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం బీచ్‌లో పర్యాటకులకు, మత్స్యకారులకు భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం సాయంత్రం కోస్టల్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, మైరన్, మత్స్యశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. బీచ్‌లో స్నానాలు చేసే వారికి కట్టుదిట్టమైన భద్రత చర్యలు ఉండాలన్నారు. గజ ఈతగాళ్ల ఏర్పాటు, బోట్లతో



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

పహారా, ప్రమాద హెచ్చరికల బోర్డులు వంటివి ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇస్రో రూపొందించిన పరికరాలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీతో అందజేస్తామన్నారు. సముద్రంలో వేటకు వెళ్ళే ఫిషింగ్ బోట్లకు ట్రాన్స్‌పాండర్స్ పరికరాలను బిగించుకోవడం వల్ల తుఫాన్ సమయాల్లో బోట్లు ఏ ప్రాంతంలో ఉన్నది సులువుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో కొత్తపట్నం మెరైన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబశివరావు, రామాయపట్నం ఇన్‌స్పెక్టర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

● మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి ధ్వజం

ఒంగోలు నగరం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. గురువారం సాయంత్రం ఒంగోలులోని ప్రగతిభవన్‌లో గల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి జగన్ ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుంచకుండా దళితులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఎస్సీల నిధులను దారి మళ్లించి దళితద్రోహిగా మిగిలి పోయాయరని మండిపడ్డారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఎస్సీ కార్పొరేషన్‌కు సీఎం చంద్రబాబు రూ.300కోట్లు కేటాయించారన్నారు. ఈ నిధులతో అర్హులైన ఎస్సీలకు త్వరలోనే యూనిట్‌లను అందజేస్తామని చెప్పారు. గతంలో రుణాలు తీసుకున్న లబ్ధిదారులు నుంచి బకాయిలు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈడీ అర్జున్‌నాయక్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

# 'భూ'చోళ్లు!

(5వ పేజీ తరువాయి)

అమ్మేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడంతో భూ ఆక్రమణలు బయటికొస్తున్నాయి. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆధారాలతో సహా గ్రామస్థులు అక్రమాలపై ఫిర్యాదులు చేస్తుండటంతో అధికారులు కూడా క్షణం ఆలస్యం చేయకుండా వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా బినామీలను అడ్డుపెట్టుకుని భూబాగోతాలను నడిపించిన మాజీ మండలస్థాయి ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### చెరువును చెరబట్టిన వైసీపీ నేత

మండలంలోని దరిమడుగు గ్రామం 959 సర్వే నెంబర్‌లోని పలు సబ్ డివిజన్‌లలో సుమారు 40 ఎకరాల మేర మహమ్మద్ సాహేబ్ కుంట (చెరువు) ఉంది. గతంలో ఈ చిన్నపాటి చెరువు నిండితే చుట్టుపక్కల పొలాల్లోని బోర్లకు సమృద్ధిగా నీళ్లు వస్తాయి. అంతేకాక గ్రామానికి చెందిన పశువుల దాహార్తి తీరేది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే గ్రామానికి చెందిన మాజీ మండలస్థాయి ప్రజాప్రతినిధి తొలుత చెరువులోని గ్రావెల్‌పై కన్నేశాడు. పట్టణానికి సమీపంలో ఉండటం రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి తోలేందుకు అనువైన వ్యాపారంగా మలుచుకున్నాడు. ట్రిప్పుకు ఇంతని లెక్కగట్టి అక్రమంగా మట్టి తరలింపునకు తెరలేపి గత ఐదేళ్లు యథేచ్ఛగా గ్రావెల్ వ్యాపారం సాగించాడు. ఇంతటితో ఆగక జాతీయ రహదారి పక్కనే 959/2బిలో ఉన్న 2 ఎకరాల చెరువు స్థలంపై కూడా కన్నేశాడు. దానిని కొట్టేసేందుకు వెనుక వైపు ఉన్న 2 ఎకరాల పట్టా భూమిని అతని బినామీ పేరున తక్కువ ధరకు కొన్నాడు. తొలుత పట్టాభూమిలో వెంచర్ వేసి అమ్మకాలు చేపట్టాడు. కొన్నాళ్లకు చెరువు భూమికి విలువ పెరిగింది. వెనుక సర్వే నెంబర్ వేసి సుమారు 1.20 ఎకరాల మేర చెరువు భూమిని కూడా అమ్మేశాడు. కరోనా సమయంలో ఈ తంతు మొత్తం జరిగింది. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం ఆ భూమి మొత్తం విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుంది. అప్పట్లో అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదులు చేసినా నియోజకవర్గ స్థాయిలో రాజకీయ అండదండలు ఉండటంతో రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగాలు మిన్నకుండిపోయాయి.

# రేపు ప్రాజెక్టుల కమిటీ ఎన్నికలు

(5వ పేజీ తరువాయి)

### ఉన్నతాధికారుల నేతృత్వంలో..

● జిల్లాలో మీడియం ఇరిగేషన్ విభాగంలో పీబీ అనకట్ట, మోపాడు రిజర్వాయర్, కంభం చెరువులు ఉండగా వాటికి ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాలి. ఆ పరిధిలో ఇప్పటికే ఎన్నికైన డబ్ల్యూయూఏల అధ్యక్షులు ఓటర్లుగా ఈ కమిటీల ఎన్నికలు జరుగుతాయి.

● పీబీ ఆనకట్ట కమిటీ ఎన్నిక ఒంగోలు ఆర్డీవో నేతృత్వంలో మూలగుంటపాడులోనూ, మోపాడు రిజర్వాయర్ కమిటీ ఎన్నిక కనిగిరి ఆర్డీవో పర్యవేక్షణలో మోపాడులోనూ, కంభం చెరువు ఎన్నిక మార్కాపురం సబ్ కలెక్టర్ నేతృత్వంలోని కంభంలోనూ 21న జరగనుంది.

● జిల్లాలో భారీ నీటి వనరుగా ఉన్న సాగర్ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ఈనెల 21వ తేదీన నర్సరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుంది.

● సాగర్ కుడికాలువ పరిధిలో ప్రస్తుతం ఉన్న పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా పరిధిలో ఉన్న 48 డీసీ అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోవాలి. అందులో 17 డీసీలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. ఈ కమిటీ కోసం పల్నాడు జిల్లా నేతలు పోటీపడుతుండటంతో టీడీపీ అధినేత చంద్రబాబు సూచనలకు అనుగుణంగా ఎంపిక జరగనుంది.

## చీరాలలో గోవా మద్యం

వేటపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో కొంత కాలంగా గోవా మద్యం పరవళ్ల తొక్కుతోంది. సమాచారం అందుకున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ కేపాల్‌కాలనీకి చెందిన ఇట్టా శ్రావణి కొంతకాలంగా గోవాకు చెందిన మద్యాన్ని రైలు మార్గాన కాలనీకు తరలించి విక్రయాలు చేస్తోంది. సమాచారం అందుకున్న సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు.. ఎస్సై శ్రీహరి సిబ్బందితో దాడులు నిర్వహించారు. దీంతో ఆమె ఇంట్లో ఉన్న 9 ఫుల్ బాటిల్స్, 157 క్వార్టర్ గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సరుకును సీజ్ చేశారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

# పారిపోయిన విద్యార్థి.. చివరకు ఇంటికి

» పాఠశాలకు బయలుదేరి మధ్యలో సైకిల్, స్కూల్ బ్యాగ్ పడవేసి ఒంగోలు వెళ్లిన విద్యార్థి
» ఆర్టీసీ ఉద్యోగి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం.. వెళ్లి తీసుకువచ్చిన వైనం

అద్దంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు బయలుదేరి వెళ్లిన విద్యార్థి గొట్టిపాటి ఓంకార్ అదృశ్యమైన సంఘటన కథ కాసేపటికి సుఖాంతమైంది. ముండ్లమూరు మండలం వేంపాడుకు చెందిన గొట్టిపాటి శ్రీధర్‌బాబు మరి కొంతమందితో కలసి అద్దంకిలో తౌడు వ్యాపారం చేస్తూ నాగులపాడు రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. శ్రీధర్‌బాబు కుమారుడు ఓంకార్ అద్దంకిలోని గ్యాస్ గోడౌన్ రోడ్డులో ఉన్న బెల్ అండ్ బెనెట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరిన ఓంకార్ సైకిల్, స్కూల్ బ్యాగ్‌లను మార్గమధ్యంలో పడేసి వెళ్లిపోయాడు. పాఠశాలకు వెళ్లని విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనతో పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు సైకిల్, స్కూల్ బ్యాగ్ పడవేసి ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. వ్యాపారంలో మిగిలిన భాగస్తులతో విభేదాలు ఉన్నాయని, ఆ క్రమంలో కిడ్నాప్ జరిగి ఉంటుందని తండ్రి శ్రీధర్‌బాబు తొలుత అనుమానం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగికి కూడా ఈ విషయాన్ని చెప్పడంతో విద్యార్థి ఫొటోను ఆర్టీసీ ఉద్యోగుల సోషల్ మీడియా గ్రూప్ లో పోస్ట్ చేశారు. ఆర్టీసీ బస్‌లో అద్దంకి నుంచి ఒంగోలు వెళ్లినట్లు ఓ కండక్టర్ స్పందించి సమాచారం ఇచ్చారు. దీంతో బంధువులు ఒంగోలు వెళ్లి వెతికారు. సాయంత్రం 6-30 సమయంలో ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తించి ఇంటికి తీసుకొచ్చారు. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.



ఓంకార్



రామ్‌నగర్ గ్యాస్ గోడౌన్ రోడ్డులో సైకిల్, బ్యాగు

# రాష్ట్ర స్థాయి ఖోఖోలో బంగారు పతకం సాధించాలి

ఆర్ఐవో సైమన్ విక్టర్

పంగులూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలలో ప్రకాశం జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాలని ఆర్ఐవో సైమన్ విక్టర్, డీఆర్ఐవో ఎర్రయ్య ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి అండర్ - 19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు శిక్షణ గురువారం పంగులూరులో ముగిసింది. ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 20 రోజులు ఈ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ఈ జట్టు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగే అండర్ - 19 ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వ నిధులతో క్రీడాకారులకు సమకూర్చిన క్రీడా దుస్తులను కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి క్రీడాకారులకు అందచేశారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం బాలుర జట్టు

### జట్టులో పాల్గొనే క్రీడాకారులు

ఈ జట్టు తరఫున ఎన్.భరత్‌కుమార్, జి.సాయి, ఎస్.లక్ష్మణరావు, ఐ.ప్రవీణ్‌రెడ్డి, ఎల్.రవీంద్ర, ఎస్.మహేష్‌బాబు, సీహెచ్ గణేష్, సి.లక్ష్మీనరసింహ, సీహెచ్ బాజీబాబు, షేక్ బాషా, దినేష్, కిషన్‌రెడ్డి ఆడనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి చింపారెడ్డి గురువారం ప్రకటించారు. కోచ్‌గా ఎం.సీతారామిరెడ్డి, మేనేజర్లుగా షేక్ ఆలీనవాజ్, ఎన్.అజయ్ వ్యవహరిస్తారని చింపారెడ్డి తెలిపారు.



## అవీఇవీ

### నిరుద్యోగులకు స్వయంఉపాధి కల్పించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించి సమాజంలో పేదరికాన్ని నిర్మూలించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని జిల్లాలో సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్వర్ణాంధ్ర-47 ప్రణాళికలో భాగంగా 10 ప్రత్యేక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలు ఇందులో భాగమని పేర్కొన్నారు. జిల్లాలోని పరిస్థితులను పరిగణలోకి తీసకొని ఆయా అంశాలలో అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ పెన్షన్ల పంపిణీ తీరు, గృహ నిర్మాణాల పురోగతి, సచివాలయ ఉద్యోగుల విధులు తదితర అంశాలపై సమీక్షించి సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు శ్రీనివాసప్రసాద్, చిరంజీవి, వసుంధర, రవికుమార్, వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి, శ్రీనివాసరావు, భరద్వాజ్, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలో గురువారం రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం అయ్యాయి. పోటీలను టీడీపీ నేత ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక సెయింట్ జాకబ్ పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభమైన క్రీడలలో పాల్గొనే క్రీడాకారులను కృష్ణకిశోర్‌రెడ్డి పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల వలన స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. మంచి క్రీడా ప్రతిభను ప్రదర్శించి మహిళలు రాణించాలన్నారు. కమిటీ అధ్యక్షులు కడియం శేషగిరి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. 40వేలు, రెండవ బహుమతిగా రూ. 30వేలు, మూడవ బహుమతిగా రూ. 20వేలు, నాల్గవ బహుమతిగా రూ. 10వేలు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ బహుమతులను పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు పాలుగుళ్ళ చిన్నశ్రీనివాసరెడ్డి, దిలీప్‌కుమార్ అందచేయనున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి బొమ్మినేని వెంకటేశ్వర్లు, జాషువా, దానియేలు, వినుకొండ చిన్న, కొమ్మునూరి ఓబయ్య, మండ్ల రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 'ఎన్టీఆర్ భరోసా' దరఖాస్తుదారులకు వైద్య పరీక్షలు

● సూపరింటెండెంట్ డాక్టర్ జమున

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల స్కీమ్‌లో అర్హత కోసం ఒంగోలులోని జీజీహెచ్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పక్షవాతం, తీవ్రమైన కండరాల క్షీణతతో బాధపడేవారు సదరం సర్టిఫికెట్‌ల కోసం ప్రతి సోమవారం, గురువారం(పనివేళల్లో) వైద్యులను సంప్రదించాలన్నారు. పక్షవాతంతో బాధపడుతూ మంచంలో ఉండేవారు, వీల్‌ఛైర్‌లో ఉంటూ నడవలేని స్థితిలో ఉన్నవారు మాత్రమే సోమ, గురువారాలలో ఓపీ నెం.10లో వైద్యపరీక్షలకు హాజరుకావాలని, అలాగే వెన్నుపూస సమస్యతో మంచానికే పరిమితం అయిన వారు ఓపీ నెం.112లో సంప్రదించాలని సూచించారు. సదరమ్ స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డు తమ వెంట తీసుకుని రావాలని తెలిపారు. అలాగే సదరమ్ సర్టిఫికెట్లను పారదర్శకంగా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అందువల్ల ఎటువంటి ప్రలోభాలకు గురి కావద్దని, నేరుగా ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూపరింటెండెంట్ కోరారు.

### అతి తక్కువ ధరకే ఏపీ ఫైబర్ సేవలు

● చైర్మన్ జీవీ రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ జీవీ రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్, ల్యాండ్ ఫోన్‌లను తక్కువ ధరకే ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర ఫైబర్ నెట్‌వర్క్ చైర్మన్ జీవీరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్‌రూము ఆవరణలో ఏపీఎస్ఎఫ్ఎల్ కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏపీ ఫైబర్ నెట్ ద్వారా రానున్న రోజుల్లో 50 లక్షల కనెక్షన్లు ఇచ్చేలా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ల కంటే కూడా ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా నాణ్యమైన సేవలను వినియోగదారులకు అందిస్తామని చెప్పారు. నెట్‌వర్క్ సమస్యలు, సెటప్ బాక్సుల సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేలా సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసి కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆఫీసును సందర్శించి సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### రెచ్చిపోతున్న సెల్‌ఫోన్ల దొంగలు

10 రోజుల వ్యవధిలో 4 చోరీ.. బైక్‌పై ఇద్దరు యువకుల హల్‌చల్

మార్టూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు మక్కెన సాంబశివరావు అనే గ్రానైట్ యజమానిని మోసగించి దాదాపుగా రూ.60వేల విలువైన సెల్ ఫోన్‌ను ఎత్తుకుపోయారు. ఈ ఘటన గురువారం మార్టూరులోని రవీంద్రస్వీట్ బ్యాకరీ ఎదురుగా జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఎవరైనా రోడ్డుపై పడిపోతే మానవతా దృక్పథంతో వారికి సహాయం చేస్తాం. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని ఇద్దరు యువకులు సెల్‌ఫోన్‌ల చోరీకి సిద్ధపడుతున్నారు. సాంబశివరావు రవీంద్ర స్వీట్ బ్యాకరీ నుంచి బయటకు వస్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన యువకులు రోడ్డుపై పడిపోయినట్లు నటించారు. దీనిని చూసిన అతను వారిని పైకిలేపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారిలో ఒక యువకుడు సాంబశివరావు జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకోవడం అదే వేగంతో బైకుపై ఇద్దరు యువకులు పరారయ్యారు. వారిని సాంబశివరావు తనబైకుపై వెళ్లి వెంబడించినా పట్టుకోలేకపోయారు. ఇదే తరహాలో బుధవారం కూడా కొణిదెన రోడ్‌లో ఒక చెప్పులషాపు యజమానిని రోడ్డుపై మోసం చేసి సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. అదేరోజు గన్నవరం రోడ్డులో రాయల్ స్కూల్‌కు వెళ్లే టర్నింగ్ వద్ద ఒక సెలూన్ షాపు వద్ద కూర్చుని ఉన్న రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీను సెల్ ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. వారం రోజులు కిందట సెంటర్లో మధు టీ షాపు వద్ద ఆటోమొబైల్ షాపు యజమాని ముందు రూ.10 నోటు వేసి దానిని అతను తీసుకుంటుండగా, అతని జేబులోని సెల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. దాదాపుగా 10 రోజుల వ్యవధిలో సెల్‌ఫోన్లు లాక్కొని పారిపోయే యువకులపై చర్చ సాగింది. కాగా సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# అందరి బంధువయా.. బోదనంపాడు రామయ్య..!




ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు..
ఎక్కడి వాడో తెలియదు..!
ఏ వర్గం వాడో అంతకంటే తెలియదు..!
కాసేపు కనిపించకపోతే రామయ్య ఎక్కడా అనే వెదికేంత ఆత్మీయుడయ్యాడు..!
మూడు గ్రామాల ప్రజలందరికీ తలలో నాలుకయ్యాడు..!
అతను మృతి చెందితే ఆ గ్రామాల ప్రజలందరూ ఏకమై అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

**గ్రామమే అతడి గృహం.. గ్రామస్థులే కుటుంబ సభ్యులు**

**యాచకునిగా వచ్చి అందరికీ ఆత్మీయుడిగా మారిన వైనం**

**అతను మృతి చెందితే మూడు గ్రామాల ప్రజలు ఏకమై అంత్యక్రియలు**


సాదురామయ్య మృతదేహం


నివాళి అర్పిస్తున్న గ్రామస్థులు

కురిచేడు, డిసెంబరు 19(ఆంధ్ర జ్యోతి) : కురిచేడు మండలం బోదనంపాడు గ్రామానికి 30 ఏళ్ల క్రితం సాదు రామయ్య(70) ఎక్కడి నుంచో వచ్చాడు. మొదట్లో గ్రామంలో యాచన చేస్తూ జీవించేవాడు. ఆ తర్వాత గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడిలో స్వామి సేవతోపాటు తదితర పనులు చేస్తూ అక్కడే కాలం గడుపుతున్నాడు. గుడికి వచ్చిన వారి యోగక్షేమాలు అడుగుతూ పిల్లలతో సరదాగా గడిపేవాడు. అతడి మాటతీరు, మంచితనంతో అందరికీ సొంత మనిషిలా తయారయ్యాడు. ఈ క్రమంలో బోదనంపాడు, ఆ పక్కనే ఉన్న అలవలపాడు, అబ్బాయపాలెం గ్రామస్థులకు తలలో నాలుకలా మారాడు. అందరూ అతడిని గౌరవిస్తూ తినడానికి ఏదో ఒకటి తెచ్చిపెడుతుండేవారు. ఒకవేళ అతను గుడిలో కనిపించకపోతే వెదికేవారు. అలా అందరితో కలివిడిగా ఉండే అతను గురువారం ఉదయం మృతి చెందాడు.

**20 వేలు చందాలు వేసుకుని...**

ఆయన మృతిని మూడు గ్రామాల ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. అందరూ ఏకమై అప్పటికప్పుడు రూ.20 వేలు చందాలు వేసుకుని రామయ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. ముందుగా ఆయన మృతదేహం ఉన్న పాడెను మోయడానికి పోటీపడ్డారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రస్తుత కాలంలో పట్టుమని పది మందితో కలివిడిగా ఉండలేని పరిస్థితులు నెలకొన్నకాలం ఇది. ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తి కోసం మూడు గ్రామాల ప్రజలు ఏకమై అంత్యక్రియలు చేశారంటే అతడి మంచితనం ఏ పాటిదో అర్థమవుతోంది.

# రామాయపాలేనికి జ్వరమొచ్చింది




**● ఇంటింటా జ్వరపీడితులు**

మద్దిపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాయపాలెంలో రెండు నెలలుగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఇంటింటా జ్వరపీడితులుంటున్నారు. ప్రభుత్వ వైద్యం అందక ప్రవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. రెండు రోజుల్లో 10 మందికిపైగా ఒంగోలులోని పలు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు గ్రామంలోనే ఉండి గ్రామీణ వైద్యులతో చికిత్స చేయించుకుంటున్నారు. గురువారం జ్వరలక్షణాల కారణంగా మాజీ సర్పంచ్ మలసాని నాగేశ్వరావు ఉన్నట్టుండి కుప్పకూలి కింద పడపోగా స్థానికులు హుటాహుటిన ఒంగోలులోని ప్రవేటు వైద్యశాలలో చేర్చారు. ఆయనతో పాటు ఆయన సతీమణి ప్రస్తుత సర్పంచ్ రాధ కూడా జ్వర లక్షణాలతో ఆసుపత్రిలో చేరింది. గ్రామానికి చెందిన మరికొందరు ఒంగోలులోని సుందరయ్య భవన్ రోడ్డులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. గతనెలలో ఇదేవిధంగా జ్వర లక్షణాలతో బాధపడిన ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక పేదలు, ఎస్సీకాలనీ వాసులు ఇళ్ల వద్దే మందుబిళ్లలతో సరిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.






మంచంపట్టిన జ్వర పీడితులు

## 23న శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం

**నేటి నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు**

**ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు**

**విద్యుత్ దీపాలతో ముస్తాబు**

**కొండమంజులూరుకు పండుగ కళ**


శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం


ఆలయం సిద్ధమైన యాగశాల

పంగులూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండమంజులూరు గ్రామంలో ఈ నెల 23న శ్రీ రుక్మిణీ సత్యభా మా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రూ.2కోట్ల40లక్షల వ్యయంతో అత్యంత సుందరంగా పునర్ నిర్మితమైన ఈ ఆలయంలో దేవతామూర్తులు కొలువు దీరనున్నారు. 23వ తేదీ తెల్లవారుజామున 4 గంటల 50 నిముషాల నుంచి 5 గంటల 45 నిముషాల మధ్య వేద పండితులు నిర్ణయించిన దివ్య ముహూర్తంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారు, ద్వార పాలకులు, విమాణ కలశ, జీవధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమాలు శతాధిక ప్రతిష్ఠాపనాచార్య రొంపిచర్ల వెకటసత్యనారాయణాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గం టల నుంచి వేద పండితులు శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించేందుకు వీలుగా యాగశాలను నిర్మించారు. ఆలయంతో పాటు ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆలయ పరిసరాలు శోభను సంతరించుకున్నాయి.



# క్రీడా సంరంభం

**ఉత్సాహంగా ఒంగోలులో అంతర్ పాలిటెక్నిక్ కాలేజీల ఆటల పోటీలు ప్రారంభం**


పాయింట్ కొట్టేస్తున్నా...




పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం 27వ అంతర్ పాలిటెక్నిక్ క్రీడాపోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కాలేజిల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. అలాగే బాలికల క్రీడాపోటీలు ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు త్వరలో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు.మొదటిరోజు అథ్లెటిక్స్‌లో డిస్కస్ త్రో, పరుగుపందెం, లాంగ్ జంప్, హైజంప్ పోటీలలో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు.

\- ఒంగోలు కార్పొరేషన్


కట్.. కట్... పాయింట్ ఎవరికో...


ఎలాగైనా తప్పించుకుంటా...


నేనే.. కాదు నేనే ఫస్ట్..


ఉత్పత్తి చేసిన మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న రాహుల్‌దేవ్ శర్మ

## పెరల్ డిస్టిలరీలో తనిఖీలు

సింగరాయకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పెరల్స్ డిస్టలరీలో ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ గురువారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మద్యం తయారీ ప్లాంట్, ఐఎంఎల్ లైన్లు, బ్లెడింగ్, లోడింగ్ పాయింట్‌లను, ఈఎన్ఏ ప్రొడక్షన్‌ను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, ఏసీ విద్య, డిస్టిలరి ఏఈఎస్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు అసభ్యప్రవర్తనపై ఎంఈవో విచారణ

**గ్రామస్థుల ఫిర్యాదు**

కురిచేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించిన వార్తల నేపథ్యంలో గురువారం ఆ పాఠశాలలో అధికారులు విచారణ చేపట్టారు. విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశాలతో విచారణకు వచ్చిన ఎంఈవోకు గ్రామస్థులు, విద్యాకమిటీ, విద్యార్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. సదరు ఉపాధ్యాయుడు చేసిన అసభ్యకర చాటింగ్‌లను ఎంఈవోకు సైతం చూపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంఈవో తెలిపారు. వివరాల్లోకెళ్తే... పడమరనాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పఠాన్ కరిముల్లా అనే ఉపాధ్యాయుడు ఫిజికల్ సైన్స్ బోధిస్తుంటారు. గతంలోనే విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు అతనిపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు అతడిని మందలించారు. రాత్రిపూట తరగతుల నిర్వహణ అనంతరం ఇళ్లకెళ్లాక విద్యార్థినులతో సెల్‌ఫోన్ సంభాషణలు చేస్తుండేవాడు. అప్పటికీ పలుమార్లు హెచ్చరించినా అతనిలో మార్పులేదు. ఇలా సాగిపోతున్న క్రమంలో గత నెలలో గ్రామంలోని యువకులు ఉపాధ్యాయుడితో వాదనకు దిగడంతో వివాదం రచ్చ అయ్యింది. ఈ నేపథ్యంలో గత నెల 22వ తేదీ నుంచి కరిముల్లా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. గత వారంలో జరిగిన మెగా పేరెంట్స్‌డే రోజున ఆ ఉపాధ్యాయుడు వస్తాడు.. గట్టిగా నిలదీయాలని గ్రామస్థులు అందరూ నిర్ణయించుకున్నారు. ఏమైందో తెలియదుగానీ.. ఆ రోజు కూడా అతను రాలేదు. దీంతో గ్రామస్థులు ప్రధానోపాధ్యాయునికి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆర్జేడీ రామలింగేశ్వర రెడ్డి ఎంఈవోను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గురువారం ఎంఈవో వస్రాం నాయక్ పాఠశాలకు వెళ్లి విచారణకు చేశారు. ఉపాధ్యాయులను విడివిడిగా విచారించి వారి వద్ద లిఖితపూర్వక సమాధానాలు తీసుకున్నారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గోసుల వెంకటేశ్వర్లు గ్రామస్థులతో కలసి ఎంఈవోకి మళ్లీ ఫిర్యాదు చేశారు.


ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

**ఉన్నతాధికారులకు నివేదిస్తా**

ఉపాధ్యాయుడు కరిముల్లాపై ప్రాథమికంగా విచారణ చేసినట్టు ఎంఈవో ఆర్.వస్రాంనాయక్ చెప్పారు. ఉపాధ్యాయులను విడివిడిగా విచారించినట్టు చెప్పారు. గ్రామస్థులు కూడా ఫిర్యాదు చేశారని తెలిపారు. పూర్తి విచారణ రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

## మంత్రి స్వామికి సత్కారం



మంత్రి స్వామిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు విద్య, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిని జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మకుమారి, జిల్లా అధ్యక్షురాలు వి.శివలీల ఆధ్వర్యంలో మంత్రి స్వామిని సత్కరించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. కార్యక్రమంలో సాయిచైతన్య, పేరయ్య, ఎంవీ.రమణయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ధనుర్మాసవ్రత వేడుకలు



పూజల్లో పాల్గొన్న శిద్దా సుధీర్‌కుమార్, భక్తులు

చీమకుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని హరిహర క్షేత్రంలో ధనుర్మాసవ్రత వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యువపారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్, శిద్దా లక్ష్మీపద్మావతిలు విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో ఎం.శివరాం దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## వీరవసంతరావు సేవలు ఆదర్శనీయం : బీఎన్



విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి అభివృద్ధికి దివంగత మాజీ సర్పంచ్ వీరవసంతరావు అందించిన సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి పట్టణం నెహ్రూనగర్ వద్ద ఏర్పాటు చేసిన వసంతరావు విగ్రహాన్ని గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావిపాటి రాంబాబు, రావిపాటి శ్రీనివాసరావు, మన్నం ప్రసాద్,గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, కొత్రపు రాఘవరావు, సూరంపల్లి హనుమంతరావు, పూనాటి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, అవనిగడ్డ శేషారావు తదితరులు పాల్గొన్నారు.

## జమ్ములపాలెం హైస్కూల్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

టంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని మండల విద్యాశాఖ కార్యాలయం, జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్, 100 రోజుల ప్రణాళిక గురించి చర్చించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సీఆర్‌పీలతో ఆయన మాట్లాడుతూ ఎస్‌ఏ 1 పరీక్షల నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్ నుంచి రెండు పూటలా క్వశ్చన్ పేపర్లు పంపడం గుర్తించి పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట సెక్రటరీ శ్రీనివాస్, ఎంఈఓ చెంచుపున్నయ్య, తన్నీరు బాలాజీ, ప్రధానోపాధ్యాయులు కొండపి శ్రీనివాస్ ఉన్నారు.

## తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ



క్రాంతిప్రీతమ్

ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి): తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో ఒంగోలులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూలు 9వ తరగతి విద్యార్థి దారా క్రాంతిప్రీతమ్ ప్రతిభ చాటారు. ఈనెల 14, 15 తేదీలలో ఢిల్లీలో జరిగిన పోటీలలో క్రాంతిప్రీతమ్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక స్కూలులో ప్రిన్సిపాల్ ఆలా పద్మావతి విద్యార్థిని అభినందించారు. చదువులతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్న క్రాంతిప్రీతమ్‌ను అదేవిధంగా కోచ్ గాలి శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ సెంటరులోని పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులు గాజులపాలెంలోని ఆక్వా పరిశ్రమలో పని చేస్తున్నారు. వారు ద్విచక్రవాహనంపై వెళుతుండగా మేదరమెట్ల వైపు నుంచి సింగరాయకొండ ఫ్యాక్టరీకి వెళ్తున్న స్పిరిట్ లారీ వారిని వెనుకవైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంధప్ప బెహరాకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మద్దిపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## కళ్లజోళ్ల పంపిణీ

కొండపి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రావూరి వినీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కె.ఉప్పలపాడు, ముప్పవరం జడ్పీ హైస్కూల్, కొండపిలోని గురుకుల పాఠశాలలో గురువారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 20 వేల మందికి కళ్లజోళ్లు అందించామని రాజశేఖర్ తెలిపారు.



# ప్రమాదం అంచున ప్రయాణం

**కొద్దిపాటి వర్షానికే జారిపడిపోతున్న వాహనాలు**

**పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు**





మట్టిలో కూరుకుపోయిన కర్రల ట్రాక్టర్, బురదలో జారిపడిన ద్విచక్ర వాహనదారుడు

మర్రిపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి చెరువు కట్ట కింద ఆర్‌అండ్‌బీ రహదారిపై గురువారం రెండు ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొద్దిపాటి వర్షానికే రహదారి ఛిద్రమై బురదమయం అవుతోంది. ఇటీవల ఓ ప్రవేటు కేబుల్ సంస్థ కేబుల్ లైన్ వేయడానికి తీసిన కాలువను పూర్తిస్థాయిలో పూడ్చి పటిష్ట పరచకపోవడంతో రోడ్డు మార్జిన్ దిగగానే వాహనాలు జారిపడిపోతున్నాయి. గతనెలలో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ప్రమాదానికి గురయ్యాయి. బుధవారం రాత్రి నుంచి ఆడపాదడపా కురుస్తున్న జల్లులకు రోడ్డు మార్జిన్ ప్రమాదభరితంగా మారింది. గురువారం ఉదయం ద్విచక్రవాహన చోదకుడు అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలపాలయ్యాడు. కర్రల లోడుతో వస్తున్న ట్రాక్టర్ కూరుకుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్పందించిన ఎస్‌ఐ రమేషబాబు, ఏఎస్‌ఐ రవికుమార్ హుటాహుటిన ఎక్స్‌కవేటర్ తీసుకెళ్లి ట్రాక్టర్ పక్కకు తీసి రాపోకలను పునరుద్ధరించారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరామ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# బాలిరెడ్డినగర్‌లో కార్డెన్ సెర్చ్

● పత్రాలులేని 31 బైక్‌లు, ఆటో స్వాధీనం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డినగర్‌లో గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరాయకొండకు దగ్గరగా ఉండే బాలిరెడ్డినగర్ వివిధ ప్రాంతాలకు చెందినవారు పనుల నిమిత్తం వచ్చి కాలనీలో స్థిరపడ్డారని తెలిపారు. ఇక్కడ గంజాయి, సరైన పత్రాలు లేని బైక్‌లు ఉన్నాయనే సమాచారంతోనే తనిఖీలు నిర్వహించామన్నారు. సోదాల్లో సరైన ధ్రువీకరణ పత్రాలులేని 31 బైక్‌లు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సరైన పత్రాలు చూయిస్తే వాటిని తిరిగి ఇస్తామన్నారు. గంజాయిని పట్టుకోవడానికి డాగ్ స్క్వాడ్‌ను కూడా వినియోగించామని ఎక్కడా గంజాయి పట్టుబడలేదని చెప్పారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సీఐ హజరత్తయ్య, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, మహేంద, ఒంగోలు సబ్ డివిజన్‌లో ఎస్సైలు, 70 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీక్రిస్మస్

**హాజరైన మాదిగ కార్పొరేషన్ చైర్మన్ శ్రీదేవి, లీడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యరావు**



ప్రసంగిస్తున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాదిగ సంక్షేమ పోరాట సమితి (ఎంఎస్‌పీఎస్) ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ కలయిక, సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ అధ్యక్షత వహించగా, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కార్పొరేషన్లు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. నిధులు లేకపోవడంతో మాదిగలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. మాదిగ జాతి అభివృద్ధి సాధించాలంటే టీడీపీ కూటమితోనే సాధ్యమన్నారు. అందుకోసం అవసరమైన నిధులు కేటాయించి, మాదిగ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చారని తెలిపారు. అనతరం పలువురు పాస్టర్లు క్రిస్మస్ సందేశం అందించగా కేక్ కట్ చేశారు. మాదిగ ఆత్మీయులకు ప్రేమ విందులను అందించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, మెప్మా పీడీ తేళ్ళ రవి, గురుకులపాఠశాలల జిల్లా కోర్డిఆర్డినేటర్ దుడ్డు జయశ్రీ, సీఐ రాజేష్, ఎస్‌ఐ పూర్ణ, టీడీపీ నాయకులు తేళ్ళ మనోజ్, కొమ్మూరి రవిచంద్ర, కార్పొరేటర్ తేళ్ళ చంద్రశేఖర్, సమితి ప్రతినిధులు అంగలకుర్తి ప్రసాద్, గద్దె త్యాగరాజు, బాలాజీ, రాజశేఖర్, జయరాజు, జయకుమార్ పాల్గొన్నారు.

**ఉప్పుగుండూరులో..**

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌రోడ్డులోని తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్ద సంఘకాపరి తెలగపూడి సుధాకర్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చ్ కౌన్సిల్ రెవరెండ్ భాగ్యానంద్, శిఖామణి, ప్రసాద్, శేఖర్‌బాబు, చంద్ర, దైవాదీనం దైవ సందేశాన్ని వినిపించారు. కేక్ కట్ చేసి పంచారు.

# మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● సఖీ సెంటర్ ఏవో జ్యోతిసుప్రియ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఒంగోలు(క్రైం), డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ రక్షణ కోసం ఏర్పరచిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేట్ అధికారి ఎన్.జ్యోతిసుప్రియ కోరారు. గురువారం ఒంగోలులోని శ్రీసరస్వతి జూనియర్ కాలేజీలో విద్యార్థినులకు శిశుసక్షేమశాఖ, సఖీ వన్‌స్టాప్ సెంటర్, స్టెప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిసుప్రియ మాట్లాడుతూ విద్యార్థినులు సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, షీబాక్స్ గురించి వివరించారు. యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెప్పారు. ఏదైన సమస్యలు ఉంటే సఖీ సెంటర్‌ను సంప్రదించాలని, దీని ద్వారా మహిళలకు తాత్కాలిక ఆశ్రయం కల్పించడంతో పాటు పోలీసు, న్యాయచ వైద్య సహాయం అందజేస్తామని తెలిపారు. సఖీ సెంటర్ పోలీస్ ఫెసిలిటేషన్ ఆఫీసర్ వి.గౌతమి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ఏదైన సమస్య ఎదురయినప్పుడు 112, 181, 1098, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే తక్షణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ మాధవాచారి, ప్రిన్సిపాల్ అనిత, ఏవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారుల తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్టీసిబస్టాండ్ ఆవరణంలోని దుకాణాలను ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ షాపులో గడువు తీరిన కూల్‌డ్రింక్స్ అమ్మకాలు ఉండటంతో గుర్తించిన ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి ప్రభాకర్‌రావు నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అతనిపై కేసు నమోదు చేశారు. మరో మూడు దుకాణాలకు లైసెన్సులు లేకపోవడాన్ని గుర్తించి నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో అధికారులు నరసింహుడు, వినియోగదారుల ఫోరం సభ్యులు మాగులూరి నాగేశ్వరరావు, సురేష్, డిపో మేనేజరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాసరావు

ఒంగోలు(రూరల్), డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీటీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు మండల మండవవారిపాలెంలో జరిగిన రెవెన్యూసదస్సులో 29 అర్జీలను గ్రామస్థులు సమర్పించుకున్నారు.

## ఎమ్మెల్యే బీఎన్‌కు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసిన నేతలు

సంతనూతలపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుమ్మళంపాడు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను గురువారం సాయంత్రం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. పలువురు నీటి సంఘాల అధ్యక్షులుగా ఎంపికైన నేపథ్యంలో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌పీ కాలువ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నెప్పలి కనకయ్య, చెరువు ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, చంద్రశేఖర్, వెంకటరమణయ్య, రమణారావు పాల్గొన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

ఒంగోలు(క్రైం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రకాశంభవన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్యరంలో నిరసన తెలిపారు. నాయకులు పాలపర్తి విజేష్‌రాజ్, కైపు వెంకట కృష్ణారెడ్డి, చందునాయక్, విజేంద్ర బహుజన్ పాల్గొన్నారు.

**టంగుటూరు:** అమిత్‌షా వ్యాఖ్యలపై మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు ఆధ్వర్యంలో టంగుటూరు లో నిరసన వ్యక్తం చేశారు. జైభీమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ. కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ నేత బొడ్డు సతీష్ పాల్గొన్నారు.

**ఒంగోలు కలెక్టరేట్:** అమిత్‌షా వ్యాఖ్యలపై దళిత నాయకులు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులో హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం స్థానిక గాంధీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శులు బి.రఘురాం, కంకణాల ఆంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**సంతనూతలపాడు:** అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై గురువారం చంద్రపాలెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వ్యవసాయకార్మికసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎన్.వెంకటేశ్వర్లు, శేషారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## 22న జిల్లాస్థాయి మోడల్ పరీక్ష

చీమకుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలోని గౌతమ్ డిగ్రీకళాశాలలో పదోతరగతి మోడల్ పరీక్షను ఈనెల 22వ తేదీన ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను గురువారం సాథనిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవరాజు, అక్బర్, చలువాది శ్రీను, వాసుబాబు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, వీరారెడ్డి పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి : స్టెప్ సీఈవో



మాట్లాడుతున్న సీఈవో శ్రీమన్నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని మెడికల్ కాలేజీలో వ్యక్తిత్వ వికాసం, మాదక ద్రవ్యాల నిర్మూలనపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి శారీరక, మానసిక, భావవ్యక్తీకరణ అంశాలలో చాలా దృఢత్వం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం యువత మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడుతూ తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చదువు ద్వారానే మంచి ఉన్నత స్థానానికి చేరతారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ.రావు మాట్లాడుతూ యువజన సంక్షేమశాఖ ద్వారా ఏర్పాటు చేసిన సదస్సు యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలపై హైకోర్టు స్టే

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీలో ఈనెల 22న జరగాల్సిన కార్యవర్గ ఎన్నికలను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్, సభ్యులు రాజీనామా చేశారు. దీంతో కలెక్టర్ ఈనెల 22న ఎన్నికలు జరపాలని ప్రకటించారు. కానీ రెడ్‌క్రాస్‌లో ఇంకా ఐదుగురు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేయలేదు. చైర్మన్ పదవికి ఆ సంస్థ వైస్‌చైర్మన్ డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి రెడ్‌క్రాస్ బైలా ప్రకారం చైర్మన్ అయ్యారు. అలాగే మిగిలిన మేనేజింగ్ కమిటీ సభ్యులు మిగతా కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. కానీ బైలా ప్రకారం కానీ అలా జరగకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎన్నికలను ప్రకటించారు. దీంతో స్టేట్ రెడ్ క్రాస్, జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు బైలాకు విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు దీనిని పరిశీలించి తప్పుగా పరిగణించి ఈనెల 22న జరగాల్సిన ఎన్నికలను నిలుపుదల చేశారు. ఇప్పటి వరకు ఉన్న కమిటీనే కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చారు. కమిటి నిర్ణయం ప్రకారం నియమ, నిబంధనలు పాటించాలని హైకోర్టు స్టే ఇచ్చింది.

## రేపు రక్తదాన శిబిరం

సంతనూతలపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈనెల 21న సంతనూతలపాడు జడ్పీహైస్కూలులో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ డి.చెంచిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

## రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న బాలవెంకటేశ్వరరావు

నాగులుప్పలపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని బినిడమానూరు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం అబ్దుల్‌కరీమ్‌సాహెబ్ పేర్కొన్నారు. చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ప్రచురించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చందలూరి బాలవెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పేద, అనాథలకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ద్వారా సేవలందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రైతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరై అక్కడ రైతులకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీ మహేష్‌యాదవ్, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్, ఫైఫా అధ్యక్షుడు జవరేగౌడ్, జనరల్ సెక్రటరీ పీఎస్.మురళీబాబు, మాజీ శాస్త్రవేత్తలు టండన్, త్రివేది పాల్గొన్నారు.

## బాల్య వివాహం నిలుపుదల

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం దక్షిణబజారులో 16 ఏళ్ళ బాలికకు వివాహం చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో అధికారులు గురువారం అడ్డుకున్నారు. బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్, స్థానిక పోలీస్, రెవెన్యూ, మహిళా పోలీస్ సిబ్బందికి సమాచారం అందించి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఈ బాల్యా వివాహాన్ని ఆపివేయించారు. బాల్య వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను బాలిక తల్లిదండ్రులకు వివరించారు.

## విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి




నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం నేత ఎస్‌డీ.హుస్సేన్ అధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీనగర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2022-23లో వాడుకున్న కరెంటుకు విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో ఇప్పుడు వసూలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.15,600కోట్లు ప్రజలపై భారం మోపడం అన్యాయమని విమర్శించారు. సెకి ఒప్పందం రద్దు చేయడంతో పాటు గృహాలకు బిగించే స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, బీవీ. రావు, షేక్ పీరు, దాసు, టి.సురేష్, రావూరి శ్రీనివాస్, గురవయ్య, షేక్ అబ్దుల్లా, జబ్బార్, చాట్ల సురేష్, సుకుమార్ పాల్గొన్నారు.

## 22 నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు(రూరల్), డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది క్రిష్టియన్‌పాలెంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రస్థాయి చెడుగుడుపోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతి రూ.8వేలు, మూడవ బహుమతి రూ.6వేలు అందజేస్తామన్నారు. క్రీడాకారులు 9390897106, 9848056735, 7095863125 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

## రేపటి నుంచి రైల్వే ట్రాక్ మూసివేత

టంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టంగుటూరులో ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు రైల్వేట్రాక్ మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం వెల్లడించారు. రైల్వేట్రాక్ ప్రాంతంలో 3వ లైన్ కలిపే నిమిత్తం మూసివేస్తున్నామన్నారు. గ్రామస్థులు ఈ 6 రోజులు పాటిమీద గేటుమార్గం, రైల్వే ట్రాక్ కింద రోడ్డును వినియోగించుకోవాలని కోరారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. కొండపి గ్రామ పంచాయతీలోని దాసరెడ్డిపాలెం హెచ్‌పీఎం చర్చ్ ఆధ్వర్యంలో 500 పేదలకు, అనాథలకు దుప్పట్లు, చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చర్చి తరుపున చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

## రైలులో నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఒంగోలు(క్రైం), డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారి పడి గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందాడని గురువారం రైల్వే ఎస్‌ఐ అరుణకుమారి తెలిపారు. కరవది-ఒంగోలు మధ్య గల రైల్వేట్రాక్‌పై ఈ ఘటన జరిగిందని చెప్పారు. సుమారు 40 ఏళ్ళ వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఎరుపు, నీలి రంగు టీషర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. వివరాలు తెలిసిన వారు 9440627647 సెల్ నంబరకు సమాచారం అందజేయాలని ఎస్‌ఐ కోరారు.

## అవీ..ఇవీ


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

### భావిభారత పౌరులను తయారు చేయాలి
**- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి**

గిద్దలూరు టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అన్ని రంగాలలో ముందంజలో ఉంచి భావిభారత పౌరులను తయారు చేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలదేనని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సెయింట్‌పాల్స్ విద్యాసంస్థల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వెనుకబడిన గిద్దలూరు, రాచర్ల మండలాలలో 5 దశాబ్దాల క్రితం సెయింట్‌పాల్స్ విద్యాసంస్థలను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసి వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పించిన కరస్పాండెంట్‌ను అభినందించారు. ఈకార్యక్రమానికి సెయింట్ పాల్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోన ఆశీర్వాదం అధ్యక్షత వహించగా మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మాజీ జడ్పీటీసీ కుప్పా రంగనాయకులు, విద్యాశాఖలోని వివిధ విభాగాల అధికారులు, విద్యాసంస్థల కరస్పాండెంట్లు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


గంగాపాలెంలో రోడ్డుపై ఉన్న 9 అడుగుల కొండ చిలువ

### జనావాసాల్లోకి కొండచిలువ

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపాలెం గ్రామంలో బుధవారం రాత్రి భారీ కొండ చిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన చంద్రయ్య నివాసం పక్కన పెద్ద రాయిని అనుకొని ఉంది. దానిని చూసిన చంద్రయ్య భయంతో కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు అక్కడికి చేరుకున్నారు. కొండచిలువను చూసి స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫారెస్టు స్నేక్ క్యాచర్ మల్లికార్జున చాకచక్యంగా గోనిసంచిలో బంధించాడు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న కొండ చిలువ 9 అడుగులు ఉందని, సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు మల్లికార్జున తెలిపారు.


గృహహింసపై అవగాహనలో పాల్గొన్న విద్యార్థులు

### గృహహింస ఎవరు చేసినా తప్పిదమే
● ప్రిన్సిపాల్ ఎస్ సావిత్రి

పెద్దదోర్నాల, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గృహ హింస ఎవరు చేసినా తప్పిదమేనని అందుకు చట్టపరమైన చర్యలు ఉన్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సావిత్రి అన్నారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీసీఈ ఆదేశాల మేరకు వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న గృహహింసపై అవగాహన కార్యక్రమం గురువారం ముగిసింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సావిత్రి మాట్లాడుతూ స్త్రీ,పురుష సంబంధాల్లో అసమానతలు ఏర్పడి గృహహింసకు దారి తీస్తాయన్నారు. గృహహింసకు పాల్పడిన వారికి తగిన శిక్షలు విధించే క్రమంలో 2007వ సంవత్సరంలో గృహహింస చట్టం రాష్ట్రంలో అమలులోకి వచ్చిందన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఓరియంటేషన్, డిబేట్, రంగోలి, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయబాబు, శ్రీనివాసాచార్యులు, రమేష్, అతిథి అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మంగు వాతావరణంతో అన్నదాతల దిగాలు

● తెగుళ్ల ఉధృతిపై ఆందోళన

పొదిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో అన్నదాతల ఆనందానికి హద్దులు లేవు. దీంతో ఉత్సాహంగా పైర్లు సాగు చేశారు. అయితే కొన్నిరోజులు పంటలు బాగానే కనిపించాయి. తీరా పూత, పిందే దశకు వచ్చే సమయానికి వాతావరణం మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అన్నిపంటలు పూత, పిందే దశలో ఉన్నాయి. మూడురోజులుగా మంగువాతావరణం ఉండటంతో కంది, బొబ్బర, మిర్చి, వరి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 23 వేలకుపైగా ఎకరాల్లో కందిపైరును సాగుచేశారు. ఏపుగా పెరిగి పూత, పిందెతో కళకళలాడుతోంది. ఈ తరుణంలో మంగువాతావరణం నెలకొనడంతో పూత, పిందె రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికే కందిలో మారుకమచ్చ, ఎండు తెగులు తీవ్రరూపం దాల్చాయి. వాటి నివారణకోసం రైతులు రసాయనమందులు పిచికారీ చేస్తున్నారు. అదే విధంగా మండలంలో పొగాకు 9వేలహెక్టార్లలో సాగుచేశారు. ముదురు పొగాకు అశాజనకంగా ఉంది. లేత పొగాకు మాత్రం ఆకులపైన గుళ్లతెగులు విజృంభిస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ తెగులు సోకడంతో మొక్కలు చనిపోతున్నాయని, ఆప్రదేశంలో మళ్లీ నాట్లు వేయాల్సి ఉండటంతో ఖర్చులు కూడా పెరిగిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. మిర్చి పంటకు కుచ్చు ముడత, నల్లి వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఆశించినట్లు రైతులు తెలిపారు. గత సంవత్సరం కూడా దిగుబడి తగ్గడంతోపాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి పరిస్థితి ఏర్పడిందంటున్నారు.



మిర్చిపంటపై పురుగుమందు పిచికారీ చేస్తున్నరైతు (ఇన్‌సెట్లో) కాయదశలో ఉన్న మినుము


పూత, పిందె దశలో ఉన్న కంది పంట

# గ్రామాల్లో అభివృద్ధి 'బాట'లు
- 15 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు


పందివానిపల్లి గ్రామంలో వేసిన రోడ్డు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధికారం చేపట్టిన 6 నెలల కాలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గానికి రూ.15 కోట్ల నిధులతో గ్రామాలకు అభివృద్ధి బాటలు వేస్తున్నారు. అందులో భాగంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు పూర్తి కావొచ్చాయి. ఎర్రగొండపాలెం మండలంలో మొత్తం 31 వర్క్‌లకు రూ.3.7 కోట్లు, త్రిపురాంతకం మండలంలో 28 వర్క్‌లను గాను 3 కోట్లు, పెద్దారవీడు మండలంలో 28 వర్క్‌లను గాను రూ. 3 కోట్లు, పెద్దారవీడు మండలంలో 28 వర్క్‌లను గాను రూ. 3 కోట్లు, దోర్నాల మండలంలో 21 వర్క్‌లను గాను రూ. 2.25 కోట్లు, పుల్లలచెరువు మండలంలో 28వర్క్‌లను గాను రూ. 3 కోట్లు చెప్పున మొత్తం రూ. 15కోట్లతో 27.71 కిలోమీటర్ల దూరం వేయనున్నట్లు పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. 27.71 కి.మీ గాను 20 కిలో మీటర్ల దూరం పనులు పూర్తి అయ్యాయని అన్నారు. మిగిలినవి వివిధ దశ లో ఉన్నాయని తెలిపారు. 2025 సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు.


వై.పాలెంలోని సాయిబాబా గుడికి వెళ్లే రోడ్డు

# గ్రామ సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి
● వెలుగు ఏపీఎం పిచ్చయ్య

మార్కాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి). గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని వెలుగు ఏపీఎం పిచ్చయ్య సచివాలయ అధికారులకు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో గ్రామాల సుస్థిరాభివృద్ధి అంశంపై గురువారం మండలంలోని సచివాలయ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామాల సుస్థిరాభివృద్ధి కోసం గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని విధాలా గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. ఎంఈవో రాందాస్ నాయక్ మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు వ్యాయామం, మెళకువలను నేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల అభివృద్ధికి తోడ్పడాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థకు పునాది అయిన అంగన్‌వాడీల అభివృద్ధిలో తోడ్పడాలని ఎంఈవో రామ్‌దాస్ నాయక్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజుల ఎఫ్ఎల్ఎన్ రిఫ్రెష్‌మెంట్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ రామ్‌దాస్ నాయక్ మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ఐదు విషయాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన భారతదేశం తయారుకావటానికి ఉపాధ్యాయులు, ఐసీడీఎస్‌లు ఉత్సాహంగా పనిచేయాలన్నారు.

# ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

మార్కాపురం వన్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లోని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిలో గురువారం యూత్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా విజయవాడకు చెందిన రెవరెండ్ డాక్టర్ పాల్ ఇమ్మానియేల్ హాజరై క్రిస్మస్ పర్వదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారని, యువత సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్యాండ్ లైట్ సర్వీస్ నిర్వహించారు. అనంతరం యువత నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యూత్ డైరెక్టర్ దేవరకొండ సౌమ్య, చర్చి అధ్యక్షులు సామ్యూల్, కార్యదర్శి జయరావు, కోశాధికారి రామస్వామి, ఉపాధ్యక్షులు ఆర్థర్, పాస్టర్ అమృతా తేజ్, యూత్ సభ్యులు శ్యామ్ ప్రకాశ్, విజయ్‌కుమార్, దారివేముల శరణ్‌కుమార్ బాబీ, హర్షిత, స్రవంతి, లీనాగ్రేస్, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.


క్యాండిల్స్ వెలిగిస్తున్న యూత్ సభ్యులు



ప్రార్థనా గీతాలు ఆలపిస్తున్న యువతులు

# ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠినచర్యలు
**సబ్ కలెక్టర్ త్రివినాగ్**

మార్కాపురం రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి). ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరించారు. మండలంలోని ఇడుపూరు గ్రామంలో తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు సబ్ కలెక్టర్ త్రివినాగ్ హాజరయ్యారు. ఈ సదస్సులో గ్రామస్థుల నుంచి ఇడుపూరు ఇలాకాలో 856 సర్వే నెంబర్‌లో 0.70 సెంట్ల ప్రభుత్వ భూమి దరిమడుగు గ్రామ వైసీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ జవ్వాజి రంగారెడ్డి ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. వెంటనే సర్వే నెంబర్ 856 లో ఆర్అండ్‌బీ ప్రభుత్వ భూమి రికార్డులు పరిశీలించి 0.70 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైనట్లుగా గుర్తించి ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఆక్రమణకు గురైన భూమి విలువ సుమారు మూడున్న కోట్ల రూపాయలు ఉంటుందని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. ఇడుపూరు గ్రామంలో భూ సమస్యలపై గ్రామస్థులు పిల్లి అంకయ్య పిల్లి మూగయ్యలు ఇచ్చిన వినతిని పరిశీలించి వారి భూ సమస్యను వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సంజీవయ్య, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పుల్లలచెరువు మండలం మర్రివేముల రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దారు బాలకిషోర్

### ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి

పుల్లలచెరువు: గ్రామ సభల్లో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పుల్లలచెరువు ఇన్‌చార్జి తహసీల్దారు బాలకిషోర్ అన్నారు.బుధవారం మండలంలోని మర్రివేములలో జరిగిన గ్రామ సభకు హాజరై ప్రజలఎ అందజేసిన అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో ఎక్కువగా అగ్రిమెంటులపై ఆన్‌లైన్ చేయయని అర్జీలు వస్తున్నాయని అన్నారు. వచ్చిన ప్రతి అర్జీ పరిశీలించి తగు న్యాయం చేస్తానని అన్నారు.గ్రామ సభలో 19 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

### దోర్నాల గ్రామసభలో 14 అర్జీలు

పెద్ద దోర్నాల :స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 14 అర్జీలు అందినట్లు తహసీల్దారు కిన్నెర శాంతి తెలిపారు. ఈ కార్యకమంలో వీఆర్వో సునీత, ఆయా శాఖల అధికారులు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి, ఒంగోలు పార్లమెంటు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ బాష తదితరులు పాల్గొన్నారు.

# బీసీ భవనం మంజూరు చేయండి
● మంత్రికి బీసీ సెల్ అధికార ప్రతినిధి వినతి

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతమైన ఎర్రగొండపాలెంలో బీసీ భవనం మంజూరు చేసి బీసీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితను బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జున నాయుడు కోరారు. గురువారం సచివాలయంలో అమెను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ కేంద్రంలో బీసీ భవనం , బీసీల అభ్యున్నతికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. వాటికి మంత్రి సవిత సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.


మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున నాయుడు

### వనితా క్లబ్‌కు బెస్ట్ అవార్డు

గిద్దలూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు వాసవీవనిత క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు లభించింది. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు కందగట్ల వెంకటరమణ, మాగులూరి శ్రీకాంత్‌లు వనితాక్లబ్ అధ్యక్షురాలు కటకం లక్ష్మీప్రియకు బెస్ట్‌క్లబ్ అవార్డు కింద మెమెంటోను అందజేశారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన వనితక్లబ్ ప్రతినిధులను అభినందించారు. ఈకార్యక్రమంలో వాసవిక్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి ముప్పూరి రాజేశ్వరి, జోన్ చైర్మన్లు శేగు పద్మావతి, ఆరవీటి చంద్రశేఖర్, సూరె నాగేశ్వరరావు, సాహితి, తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకరరావు అన్నారు. త్రిపురాంతకం రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో గురువారం ఎస్ఐ పి.చౌడయ్య, కానిస్టేబుల్‌లతో కలసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు రోడ్డును ఆక్రమించి ముందుకు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నదని గుర్తించారు. వాటిని తొలగించి ఆ దుకాణదారులకు చలానా విధించారు.

### హెల్మెట్‌తోనే రక్షణ

పుల్లలచెరువు,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిత్యం హెల్మెట్‌తోనే ద్విచక్ర వాహనాలను నడపాలని, హెల్మెటే మన కుటుంబానికి రక్షణ ఇస్తుందని పుల్లలచెరువు ఎస్ఐ సంపత్ కుమార్ అన్నారు.గురువారం స్థానిక బస్టాండ్ సెంటరులో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

### సారా తయారీ కేంద్రంపై దాడి
● 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పెద్దదోర్నాల,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీ కేంద్రాలపై పోలీసులు గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని నల్లగుంట్ల గ్రామం సమీప అటవీ ప్రాంతంలో దాడులు చేసి అక్రమంగా నాటు సారా తయారీ చేసేందుకు సిద్ధంగా ఉన్న 600 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అందు కోసం వినియోగించిన వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఎస్ఐ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైం సమాచారం

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పులి ఉమామహేశ్వరరెడ్డి (60) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని రామ్‌నివాస్ అపార్ట్‌మెంట్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు పట్టణంలో కోకాకోల డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారం నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరెడ్డికి భార్య శివపార్వతి, కుమారుడు తరుణ్‌సంకీర్త్‌రెడ్డి, కుమార్తె హర్షసంహిత ఉన్నారు. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు అయ్యి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నారు. భార్యతో కలిసి రామ్‌నివాస్ అపార్ట్‌మెంట్‌లోని 201వ నెంబర్ ప్లాట్‌లో నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం భార్య శివపార్వతి మనవడి పుట్టిన రోజు వేడుకలకు హైదరాబాద్ వెళ్లింది. నిన్నటి నుంచి ఆమె ఫోన్ చేస్తున్నా ఉమామహేశ్వరరెడ్డి స్పందించడంలేదు. దీంతో కార్పెంటర్‌కు ఫోన్ చేసిన ఆమె తలుపులు తియ్యమని చెప్పింది. చుట్టుపక్కల వాళ్లతో కలిసి గురువారం మధ్యాహ్నం కార్పెంటర్ తలుపులు పగులకొట్టి తెరిచిచూడగా ఉమామహేశ్వరరెడ్డి బెడ్‌రూమ్‌లో ఫ్యాన్ ఉరివేసుకుని ఉన్నాడు. చుట్టుపక్కల ప్లాట్‌ల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పట్టణ ఎస్సై సైదుబాబు మృతదేహాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారించారు. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, ఇద్దరు పిల్లలు కూడా బాగానే స్థిరపడ్డారని తెలిసింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమానంతో భార్యపై భర్త గొడ్డలితో దాడి

మార్కాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త విచక్షణారహితంగా గొడ్డలితో ముఖంపై దాడిచేసిన సంఘటన గురువారం వేకువజామున చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు స్థానిక ఏకలవ్య కాలనీలో బలుసుపాటి చిన్నకొండయ్య, మరియమ్మ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడి దగ్గర ఉంటున్నారు. చిన్నకొండయ్య దోర్నాల మండలం చిన్నగుడిపాడులో వీఆర్వోగా పనిచేస్తున్నాడు. తొలినుంచి కొండయ్యకు భార్యపై అనుమానం ఉండటంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ మధ్యనే పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇద్దరికి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో నిద్రిస్తున్న మరియమ్మను గొడ్డలితో తలపై దాడి చేశాడు. కానీ అదృష్టవశాత్తు ముఖంపై వేటు పడటంతో ప్రాణాపాయం తప్పింది. వెంటనే క్షతగాత్రురాలిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పేకాట శిబిరంపై దాడి
● మూడు బైకులు, రూ. 3,05 లక్షల నగదు స్వాధీనం

మార్కాపురం రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి). మండలంలోని బొడిచెర్ల గ్రామంలోని పొలాలలో పేకాట శిబిరంపై మార్కాపురం సీఐ సుబ్బారావు, రూరల్, టుటౌన్, తర్లుపాడు ఎస్ఐలు గురువారం ఆకస్మిక దాడి చేశారు. 8 మంది పేకాడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు లక్షల ఐదువేల ఎనిమిది వందల రూపాయలు నగదుతో పాటు మూడు బైకులను, పేకలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### మేకపోతుల అపహరణ

తర్లుపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొలంలో మేస్తున్న మేకపోతులను ముగ్గురు దుండగులు అపహరించుకుపోయారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అంకయ్య మేకలను పొలంలో మేపుకుంటుండగా ముగ్గురు దుండగులు వచ్చి అంకయ్యను బెదిరించి ఆటోలో 2 మేక పోతులను తీసుకెళ్లారు. అంకయ్య తాడివారిపల్లెలో బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వటంతో తాడివారిపల్లె రోడ్డులో కాపు కాసి ఆటో, ముగ్గురు దుండగులను పట్టుకున్నారు. ఈమేరకు తాడివారిపల్లె పోలీసులకు అప్పగించారు. ఈ దుండగులు మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్టేట్ వాసులుగా గుర్తించారు.

### కులం పేరుతో దూషించారని కేసు నమోదు

మార్కాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విధులకు ఆటంకం కలిగించడమేకాక కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీవోగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు వద్దకు పట్టణానికి చెందిన గాలి వెంకటరామిరెడ్డి, పెరుమాళ్ల వెంకటసుబ్రహ్మణ్యంలు వెళ్లారు. పట్టణంలోని సర్వే నెంబర్ 233కు సంబంధించి అనధికార లేఅవుట్ అయినందున పేపర్‌లో ప్రకటన ఎందుకు ఇవ్వలేదని అడిగి కులం పేరుతో దూషించారు. ఈ మేరకు టీపీవో శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

## జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు కేవీపల్లి విద్యార్థిని ఎంపిక


కల్యాణి

కనిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు కంచర్లవారిపల్లి హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 2 నుంచి 4 వరకు అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో కంచర్లవారిపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి కల్యాణి పాల్గొన్నారు. ఈపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్‌లు, పీడీ కాశీవిశ్వనాథ్‌రెడ్డి కల్యాణిని అభినందించి సత్కరించారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కురిచేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుకు బలి కావద్దని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత మంచిగా ఎదగాలన్నారు. ఎవరూ మత్తు పానీయాలు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

దొనకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దొనకొండ ఏబీఎం చర్చి ఆవరణలో ఐక్య క్రిస్మస్ వేడుకలను సంఘకాపరి రెవరండ్ ప్రభుదాస్ అధ్యక్షతన బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీఎం, ఆర్సీఎం, సీఎస్ఐ లూతరన్, క్రీస్తు సంఘం, కల్వరి, బెతస్థ చర్చీలకు చెందిన సంఘకాపరులు ప్రభుదాస్, థామస్, జయరాజ్, మధు, జయరావు, దానియేలు, అననియ్యా క్రిస్మస్ సందేశాన్ని ప్రజలకు వివరించారు. క్రిస్మస్ కేకును కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయించాలి

దర్శి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను సక్రమగా పంపిణీ చేయించాలని జనసేన దర్శి మండల నాయకుడు కుప్పాల పాపారావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం జనసేన కార్యాలయంలో నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈవిషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర నాయకులు భరోసా ఇచ్చినట్లు పాపారావు తెలిపారు. ప్రభుత్వం పేదల కోసం రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేస్తున్నప్పటికీ డీలర్లు కార్డుదారులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న విషయాన్ని రాష్ట్ర నాయకులకు వివరించినట్లు పాపారావు తెలిపారు.

## అప్పాల్లాఖాన్‌కు నివాళి

పామూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించిన మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధుడు అప్పాల్లా ఖాన్ అని అవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో అప్పాల్లాఖాన్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో రియాజ్, అల్లాభక్ష్, మస్తాన్, ఇస్మాయిల్, రహంతుల్లా, గులాం రసూల్, ఖాదర్‌వలి, రషీద్, ఎం.విఠల్‌రావు, వై.వీరనారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## డ్రోన్ ద్వారా నేరాలకు అడ్డుకట్ట

ముండ్లమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేరాల అడ్డుకట్టకు డ్రోన్ ఎంతో ఉపయోగ పడుతుందని సీఐ వై.రామారావు అన్నారు. గురువారం మండలంలోని ఉమామహేశ్వర చెరువుల వద్ద డ్రోన్‌ను ఎగురవేసి పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



# రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


రెవెన్యూ సదస్సులో అర్జీలు పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

దర్శి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులకు సూచించారు. మండలంలోని దేవవరంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. స్థానిక అధికారులు అన్నీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు ఈసందర్భంగా శ్మశాన భూమి ఆక్రమణను తొలగించాలని గ్రామస్థులు అర్జీ ఇచ్చారు. మరో ప్రభుత్వం భూమిలో ఆక్రమణలు తొలగించాలని అర్జీ అందజేశారు. వెంటనే ఆ భూములను కొలచి హద్దులు ఏర్పాటుచేయాలని జేసీ సూచించారు. విద్యుత్‌శాఖకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఇరువురు అర్జీలు దాఖలు చేయగా, సంబంధిత శాఖ అధికారులకు పంపి పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 17 అర్జీలు దాఖలయ్యాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, వీఆర్వో మురళీ తదితరులు పాల్గొన్నారు.

### రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

దర్శి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని బొట్లపాలెంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరంలేదని రైతులకు భరోసా ఇచ్చారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున ధాన్యం తడవకుండా భద్రపరచుకోవాలన్నారు. కొద్దిరోజులు వరి కోతలను నిలుపుదల చేయాలని సూచించారు.

కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం జి.వరలక్ష్మి, వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్, రైతులు పాల్గొన్నారు.

# కోర్సుకొండ నుంచి గ్రావెల్‌ను తరలించొద్దు!

» ఆర్డీవోకు స్పష్టం చేసిన కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు


కొండ ప్రాంతాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ

తాళ్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమకు జీవనాధారంగా ఉన్న కోర్సుకొండ నుంచి గ్రావెల్‌ను తరలించవద్దని కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు పేర్కొన్నారు. ఇందుకుసంబంధించి గ్రామస్థులు, రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న గ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా సమావేశమయ్యేందుకు యత్నించగా గ్రామస్థులు నిరాకరించారు. తాను రోడ్డు నిర్మాణ కంటాక్టర్ తరుపున రాలేదని, జిల్లా కలెక్టర్ గ్రామానికి వెళ్లి ప్రజల, రైతుల అభిప్రాయాలను తెలుసునిరమ్మని చెప్పారని ఆమె పేర్కొన్నారు. తమ అభిప్రాయాలు చెబితే వాటిని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఆర్డీవో విన్నపం మేరకు మాజీ సర్పంచ్ కోట నరసింహారావు గ్రామస్థుల అభిప్రాయలను తెలియజేశారు.

గ్రామ సమీపాన నున్న కోర్సుకొండ నాలుగు సామాజిక వర్గాలకు జీవనోపాధి కల్పిస్తున్నదన్నారు. ఇటీవల హైవే రోడ్డు నిర్మాణ సంస్థ వారు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండటంతో కొండ పూర్తిగా తగ్గి తమ భవిష్యత్తు తరాల వారికి ఇబ్బందులు వస్తాయన్నారు. దీంతో గ్రావెల్ తరలింపును అడ్డుకుంటున్నామన్నారు. ఈ కొండ బాపట్ల జిల్లా అద్దంకి మండలం మోదేపల్లి ఇలాకాలో ఉందని చెప్పారు. తమ గ్రామానికి చెందిన పొలాలు రెండు జిల్లాల పరిధిలో ఉన్నాయన్నారు. తమ గ్రామానికి చెందిన అద్దంకి పరిధిలోని కోర్సుకొండ నుండి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకుంటే తాళ్లూరు పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీవనాధారంకల్పిస్తున్న కోర్సు కొండ నుండి మట్టి తరలించేందుకు అనుమతించబోమన్నారు. గ్రామస్థుల చెప్పిన అభిప్రాయాలను రికార్డుచేయగా సంతకాలు పెట్టారు. అనంతరం ఆర్డీవో లక్ష్మీప్రసన్న, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ కోర్సుకొండను సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, డీటీ రాజు, సీఐ రామారావు, ఎస్సై మల్లికార్జునరావు, గ్రామపెద్దలు కె.రామయ్య, గొల్లపూడి వేణుబాబు, కె.శేషయ్య, సంగం ప్రభుదాసు, కె.అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాగా, డీఎస్పీ లక్ష్మీనారాయణ టీడీపీ నేతలతో సంప్రదింపులు జరిపారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం గ్రామానికి పోలీస్ సిబ్బంది రావటం జరిగిందన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరించటం జరగదన్నారు. మట్టి తోలకం విషయమై టీడీపీ యువనేత గొల్లపూడి వేణుబాబు మాట్లాడుతూ గ్రామస్థుల అభిప్రాయం మేరకు ముందుకెళతామని డీఎస్పీకి స్పష్టం చేశారు. తాము సీఎం చంద్రబాబు పాలనకు, చేపడుతున్న అభివద్ధి పనులకు వ్యతిరేఖం కాదని చెప్పారు. కోర్సుకొండ తమ గ్రామంలోని అన్ని వర్గాలకు జీవనాధారంగా ఉందన్నారు. ఖచ్చితంగా కొండ నుంచి గ్రావెల్ తరలించాలనుకుంటే ఎన్‌వోసీ, మైనింగ్ పర్మిషన్ తీసుకుని నిరభ్యంతరంగా తీసుకోవచ్చని చెప్పారు. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా కొండను తవ్వితే గ్రామస్థులు ఒప్పుకోరని స్పష్టం చేశారు.

# సమర్థవంతంగా నీటి సంఘాలు పనిచేయాలి


నీటి సంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వెలిగండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని టీడీపీ నాయకులు శ్యామల కాశీరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులను సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కాలువల మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవటంతో అధ్వానంగా మారాయన్నారు. తద్వారా ఆయకట్టు భూములకు నీరందక రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. వెలిగండ్ల మండలంలోని పందువ గండి చెరువు కింద రైతులు పంటలు సాగుచేస్తుంటారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయకట్టులో నీరు ఉన్నా గేట్లు మరమ్మతులకు గురవడంతో నీరు మొత్తం వృధాగా పోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తి రెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, గొనా ప్రతాప్, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, సాన జయపాల్ రెడ్డి, సాన నారాయణ రెడ్డి, సంపతి రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి


నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి వీర్రాజు, సిబ్బంది

కనిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జోనల్ మలేరియా వైద్యాధికారి జి.వీర్రాజు అన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లో గురువారం డెంగ్యూ జ్వరపీడితుడిని పరిశీలించారు. అనంతరం సమీపంలోని ప్రజలఉ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పాత టైర్లు, గుబురు లాంటి చెట్లు ఉన్న ప్రాంతాలు దోమలకు నెలవుగా ఉంటాయన్నారు. పగటివేళల్లో సంభవించే దోమకాటుతో డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నీటి నిల్వలు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారాలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు, డీపీఎంవో ప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత


కానిస్టేబుల్ రవికుమార్ భార్యకు నగదు అందజేస్తున్న ఎస్ఐ కోటయ్య

పీసీపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్ఐ జి.కోటయ్య ఆర్థిక చేయూతనిచ్చి అండగా నిలిచారు. ఒంగోలుకు చెందిన బత్తుల రవికుమార్ పీసీపల్లి పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రెండునెలల క్రితం రవికుమార్ విధి నిర్వహణలో భాగంగా కనిగిరిలో ట్రాఫిక్ డ్యూటీ చేస్తున్నక్రమంలో అనారోగ్యానికి గురై హఠాత్తుగా రోడ్డుపై పడిపోయాడు. తోటి సిబ్బంది వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం మంగళగిరిలోని ఓ వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో అధికమొత్తంలో వైద్యఖర్చులు అయ్యాయి. ఓవైపు వైద్య ఖర్చులు మరోవైపు బీటెక్ చదువుతున్న రవికుమార్ కుమారుడి కళాశాల ఖర్చులు ఆ కుటుంబానికి మోయలేనంతగా భారమయ్యింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటయ్య, సిబ్బంది రూ.50వేలు సాయం చేశారు.

రెండు నెలలుగా చికిత్స పొందుతున్నా ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. ఈక్రమంలో దాతలు ఇచ్చిన నగదుతో పాటు ఎస్ఐ కోటయ్య తన సొంత నగదును కలిపి మొత్తం రూ.70 వేలు రవికుమార్ కుటుంబసభ్యులకు గురువారం అందజేసి అండగా నిలిచారు.

# సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


అవగాహన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, అధికారులు

పామూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. పామూరులోని ఒకటో సచివాలయంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దేవదాయ భూముల నుంచి రిజిస్ట్రేషన్ పట్టా భూములను తప్పించి న్యాయం చేయాలని బాధితులు వినతిపత్రం అందజేశారను. పట్టణంలో దేవస్థానానికి చెందిన పలు భూములు అన్యాక్రాంతమయ్యాయని ఈవో నరసింహాబాబు తెలిపారు. సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సదస్సులో 51 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజారహంతుల్లా, ఎంపీటీసీలు ఉప్పలపాటి హరిబాబు, ఆకుపాటి వెంకటేష్, ముబినా మౌలాలి, నీటి సంఘం అధ్యక్షుడు పాలపర్తి రమణయ్య, పందిటి హరీష్, వార్డు మెంబర్లు పిడుగు శ్రీను, షేక్ మస్తాన్, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, జనసేన నాయకుడు దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల పట్టాలకు పొజిషన్ చూపించాలి

పామూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని సర్వేనెంబర్ 447లో పేదలకు మంజూరు చేసిన ఇంటి నివేశన స్థలాలకు పొజిషన్ చూపించాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తహసీల్దార్ బీవీ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఈమేరకు అర్జీ ఇచ్చారు. రీ సర్వేచేసి అక్రమంగా పొందిన డి పట్టాలను రద్దు చేసి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, కె.ప్రభాకర్, పి. రఘునాథరెడ్డి, ఆకుల మోన్‌రావు, ఆర్.సూరిబాబు, మస్తాన్‌రావు, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

### వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

పీసీపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏస్పీ దామోదర్ ఆదేశాల మేరకు మండలంలోని పెదఅలవలపాడులో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా హెల్మెట్ ధరించని వాహనచోదకులపై కేసులు నమోదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశించిందన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు తలకు గాయాలు కాకుండా కాపాడుకోవడంతో పాటు ప్రాణాపాయ పరిస్థితి నుండి కాపాడుకోవచ్చన్నారు. అలాగే, కారులో ప్రయాణించే వారు సీటుబెల్టు ధరించాలన్నారు.

### నేడు పామూరు మండల సమావేశం

పామూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పామూరు మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### ఫసల్ బీమా గడువు పొడిగింపు

దొనకొండ: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నిర్ణీత ప్రీమియం చెల్లించి సభ్యులుగా చేరాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన గడవును ప్రభుత్వం ఈనెల 31 వరకు పొడిగించిందని చెప్పారు. గురువారం మండలంలోని బాదాపురం, ఎర్రబాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.


సీఎం చంద్రబాబుకు అభివృద్ధి పనుల నివేదికను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

## కనిగిరి అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కనిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును ఆయన కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నివేదికలు, ప్రతిపాదనలు సీఎంకు అందజేశారు. నియోజకవర్గంలో ట్రిపుల్‌ఐటీ, రోడ్ల పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికను అందజేశారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు.

## కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

దొనకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అమిత్‌షా క్షమాపణ చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మేళం సంతోష్‌కుమార్, సీఐటీయూ మండల అధ్యక్షుడు కుందుర్తి చిన్ననర్సింహులు, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, తిరుపతయ్య, మేళం సుధాకర్, చిన్నరోశయ్య, వెంకటేశ్వరరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పామూరు: అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని మాల సంక్షేమ సంఘం మండల బాధ్యులు దాసరి సత్యనారాయణ, సామాజిక కార్యకర్త జె.గోవిందయ్య డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు లౌకిక వాదులు కలిసి రావాలన్నారు.

## రైల్వే అండర్ పాస్ పరిశీలన


రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

కురిచేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కురిచేడు మేజర్ పంచాయతీ పరిధిలోని కాటంవారిపల్లె గ్రామం వద్ద నిర్మించిన అండర్ పాస్‌తో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అండర్ పాస్‌లో నీరుపోయే వీలులేక అక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో గ్రామస్థులు పొలాలకు వెళ్లడానికి పడరానిపాట్లు పడుతున్నారు. ఈవిషయమై రైల్వే అధికారులకు విన్నవించినా ఇం తవరకూ సమస్య పరిష్కారం కాలేదు. గురువారం రెవెన్యూ గ్రామ సభకు వచ్చేసిన తహసీల్దార్ రజనీకుమారికి తమ సమస్యను ప్రత్యక్షంగా చూపారు. ఈవిషయమై కలెక్టర్‌తో మాట్లాడతానని తహసీల్దార్ పేర్కొన్నారు.

## ప్రతిఒక్కరూ శాంతి మార్గంలో నడవాలి

కనిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని రెవరెండ్ పాస్టర్ వినయ్‌కుమార్ అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులు, వితంతువులకు, చీరెలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు యేసుదాసు, రామయ్య, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అలాగే, స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాతూరులో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఐ ఖాజావలి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగాగా భావించి సుధీర్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈసందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, స్నేహహస్తం ట్రస్ట్ సభ్యులు, వివిధ సంఘాల పాస్టర్‌లు, దళితహక్కుల వేదిక నాయకులు మల్లిఖార్జున్, దానయ్య, తాతపూడి శ్యామ్, మమతా, రవణ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికైన క్రీడాకారులు

దొనకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ నెట్‌బాల్ బాలురు, బాలికల జిల్లా జట్లను గురువారం ఎంపిక చేసినట్టు నెట్‌బాల్ జిల్లా సెక్రటరీ ఐపీ రాజు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు ప్రారంభించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.నర్సింహారావు తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

## విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

దర్శి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తహసీల్దార్ ఎం .శ్రావణ్‌కుమార్ సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం దర్శిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే కరెంట్ కొరతను పూర్తిగా నివారించవచ్చునని చెప్పారు. ఈఈ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సౌరవిద్యుత్ వాడకాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో విద్యుత్ వాడకం రోజురోజుకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేసుకొని వాడుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

పామూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి కె.రాధ తెలిపారు. గురువారం మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా సాగులో ఉన్న మినుము పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే, సీఎస్‌పురం మండలంలోని అరివేముల, కొండబోయినపల్లి గ్రామాల్లో ఏవో సంపత్‌కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి, కంది పంటలను పరిశీలించారు. వరిలో జింక్‌లోపం ఉందన్నారు. జింకు సల్ఫేట్ ను నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ విస్తరణాధికారి పావలి శ్రీనివాసులు, రైతు సేవా కేంద్రం అధికారులు వి.శ్రీకాంత్, ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## దారి సమస్య పరిష్కారం

ముండ్లమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక గ్రామంలో వివాదంలో ఉన్న దారి సమస్యను తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ పరిష్కరించారు. గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో వివాదంలో ఉన్న దారిని పరిశీలించి ఇరువర్గాలకు సర్దిచెప్పి పరిష్కరించారు. ఈసందర్భంగా రెవెన్యూ సదస్సులో 26 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు.



# ఫ్రీహోల్డ్‌లో అసైన్డ్..

# 1045.09 ఎకరాలు

- ఆ భూములను 22-ఏలో చేర్చాలని ఆదేశాలు
- నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ల రద్దు
- తప్పు చేసిన ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వ నిర్ణయం
- పునః పరిశీలన చేసి అప్‌డేట్ చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా వందల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇష్టం వచ్చినట్లుగా ఆయా భూములను రిజిస్ట్రేషన్లు చేసేశారు. 2023వ సంవత్సరానికి 20 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ చేసిన భూములను ఫ్రీహోల్డ్ చేయాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే దీని వెనక దురుద్దేశం ఉన్నట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఆ ఉత్తర్వులు ఆధారంగా గుంటూరు జిల్లాలో 1623.85, పల్నాడు జిల్లాలో 31,897.32, బాపట్ల జిల్లాలో 13,839.04 ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఫ్రీహోల్డ్ భూములపై విచారణ జరిపించింది. దీంతో వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు వెలుగు చూశాయి. గుంటూరు జిల్లాలో 53.56, పల్నాడులో 138.75, బాపట్ల జిల్లాలో 852.78 ఎకరాల భూమి అసైన్‌మెంట్ భూమి అని తేల్చారు. విలేజ్ సర్వీసు ఇనాం భూములు బాపట్ల జిల్లాలో 668.02, పల్నాడులో 2.13, చుక్కల భూములు పల్నాడులో 107.76 ఎకరాలు, షరతుగల పట్టా భూములు గుంటూరులో 2.83 ఎకరాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం చేసిన ఫ్రీ హోల్డ్ భూములను పునః పరిశీలన చేయించింది. బాపట్లలో 40.38 ఎకరాలు, పల్నాడులో 90.93 ఎకరాలు నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్లు జరిగాయి. గుంటూరులో 38.24 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేయగా అందులో 11.02 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా చేశారని గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి కమిటీలు ప్రతీ ఒక్క కేసుని పునః పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో డేటాని అప్‌డేట్ చేయాల్సిందిగా రెవెన్యూశాఖ మూడు జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. అలానే పునః పరిశీలన అనంతరం కేసుల వారీగా ఆర్డర్స్ జారీ చేయాలని సూచించింది. జీవో, నిబంధనలకు లోబడి ఉన్నవి జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌కు నివేదించాలని సూచించింది. వీటి రిజిస్ట్రేషన్లపై ఉన్న నిషేధాన్ని ఉపసంహరించాలని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని ఆదేశించింది. కాగా ఏవైతే నిబంధనలకు విరుద్ధంగా జరిగాయో వాటిని 22-ఏ జాబితాలో తిరిగి చేర్చాలని, అలానే రిజిస్ట్రేషన్లు జరిగిన వాటి పట్టాలను రద్దు చేయాలని సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసిన రెవెన్యూ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. దీంతో మూడు జిల్లాల రెవెన్యూ అధికారులు హడలిపోతున్నారు. దీంతో అప్పట్లో తప్పిదాలకు పాల్పడిన రెవెన్యూ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

# టీడీఆర్ బాండ్లపై.. విజిలెన్స్

టీడీఆర్ బాండ్లు.. నకిలీ చలానాలు.. ఇష్టం వచ్చినట్లుగా భవనాలకు ప్లాన్ల మంజూరు.. ఇదీ గత ఐదేళ్లుగా మున్సిపాలిటీల్లో జరిగిన అక్రమాలు. ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు.. మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారు. టీడీఆర్ పేరుతో రూ.కోట్లు దోచేశారు. వైసీపీ నేతలు ఆదేశాలు జారీ చేయగా.. అధికారులు ఇష్టం వచ్చినట్లుగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో అధికారులు అడ్డగోలుగా ప్లాన్లు మంజూరు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. మొత్తం మీద మున్సిపల్ ఆదాయాలను హరించేసిన నేతలు, అధికారులు ఆ మొత్తాలను పంచుకుని జేబుల్లో వేసుకున్నారు. ఈ వ్యవహారాలు అప్పట్లోనే వెలుగుచూసినా నాటి పాలకులు, అధికారులు పట్టించుకోకుండా అక్రమాలకు సహకరించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం టీడీఆర్ కుంభకోణాలపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రెండు నగరపాలకసంస్థలు, 14 మున్సిపాలిటీల్లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. అధికారులు బృందాలుగా ఏర్పడి కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తూ గతంలో జరిగిన అక్రమాలపై ఆధారాలు సేకరిస్తున్నారు.

- మున్సిపాలిటీల్లో అధికారుల తనిఖీలు
- రెండు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలపై దర్యాప్తు
- బృందాలుగా ఏర్పడి రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు
- ఐదేళ్లలో జారీ చేసిన బాండ్లు, ప్లాన్ల ఫీజుల వివరాల సేకరణ
- గుంటూరులో గతంలో వెలుగు చూసిన రూ.300 కోట్ల కుంభకోణం
- నకిలీ చలానాలు, అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లతో దోపిడీకి యత్నం
- నాడు వైసీపీ నాయకులు, టౌన్ ప్లానింగ్ అధికారి కుమ్మక్కు

**తనిఖీలు జరుగుతున్న పురపాలక సంఘాలు**

గుంటూరు జిల్లా : గుంటూరు కార్పొరేషన్, తాడేపల్లి- మంగళగిరి కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు.
బాపట్ల జిల్లా : బాపట్ల, రేపల్లె.
పల్నాడు జిల్లా: చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, దాచేపల్లి



బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం



గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీల్లో టీడీఆర్ బాండ్లు, నకిలీ చలానాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇష్టం వచ్చినట్లు జారీ అయ్యాయి. గుంటూరు, తాడేపల్లి- మంగళగిరి నగర పాలక సంస్థలతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని తెనాలి, పొన్నూరు, బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, రేపల్లె, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, దాచేపల్లి మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ క్రమంలో టీడీఆర్, నకిలీ చలానాల కుంభకోణాలపై రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ విచారణకు ఆదేశించారు. దీంతో మున్సిపాలిటీల వారీగా విజిలెన్స్ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపడుతున్నారు. ఐదేళ్ల నుంచి ఆయా నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో జారీ అయిన టీడీఆర్ బాండ్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రువల్స్‌లో చెల్లించిన ఫీజులు, వాటి వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో వైసీపీ హయాంలో అధికారులు అడ్డగోలుగా ప్లాన్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనేక భవనాలకు ఫీజులు సక్రమంగా చెల్లించకుండానే నిర్మాణాలు చేపట్టారు. భవన నిర్మాణాలకు సంబంధించి మున్సిపాలిటీలకు (మిగతా 6వ పేజీలో)

# ఉపాధిలో.. మస్టర్ల మాయ

- ఏడు పంచాయతీల్లో రూ.4కోట్లు గోల్‌మాల్
- ఫీల్డు అసిస్టెంట్లపై పోలీసులకు నగరం ఎంపీడీవో ఫిర్యాదు
- రికార్డులు అపహరించి.. విచారణకు హాజరుకాని సిబ్బంది



నగరం మండలంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు


రేపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వలసలను నివారించి.. కూలీలకు ఉపాధి కల్పించాల్సిన ఉపాధి హామీ పథకం నుంచి అక్రమార్కులు కాసులు పిండుకుంటున్నారు. సాంకేతికత ఎంత అందుబాటులో తెచ్చినా అక్రమాలకు అడ్డుకట్టపడటం లేదు. కూలీల పేరిట బోగస్ మస్టర్లు వేసి సొమ్ములు కాజేస్తున్నారు. నగరం మండలంలోని ఏడు పంచాయతీల్లో ఏడుగురు ఫీల్డు అసిస్టెంట్లు బోగస్ మస్టర్లు వేసి రూ.4 కోట్లు పక్కదారి పట్టించారని ఆడిట్‌లో వెలుగుచూసింది. అయితే ఈ అవకతవకలు బయటపెట్టకుండా డబ్బుతో అధికారులను లోబరుచుకునేందుకు ప్రయత్నించారు. అయితే వారి ప్రయత్నం విఫలం కావడంతో ఫీల్డు అసిస్టెంట్లు సంబంధిత రికార్డులతో పరారయ్యారు. ప్రస్తుతం వారు విధులకు రావడం లేదు. ఈ క్రమంలో వారు గ్రామాల్లో అందుబాటులో లేరని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు నగరం పోలీస్‌స్టేషన్‌లో ఫీల్డు అసిస్టెంట్లపై ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ భార్గవ్ కేసు నమోదు చేసి ఫీల్డు అసిస్టెంట్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఏపీవో అరుణ, కంప్యూటర్ ఆపరేటర్లు సుబ్బారావు, ప్రసాద్, టీఏడబ్ల్యూలు రమణ, మురళి, ఆశీర్వాదంలు ఫీల్డు అసిస్టెంట్లకు సహకరించారని అధికారులు తెలిపారు.

**వైసీపీ హయాంలో అక్రమాలు..**

వైసీపీ ఐదేళ్ల పాలనలో నగరం మండలంలోని తాడవాకవారిపాలెం, ఈదుపల్లి, అల్లపర్రు, పూడివాడ, చిన్నమట్లపూడి గ్రామాల ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్లు మంజూరయ్యాయి. అయితే మట్టిరోడ్లను నిర్మించి సీసీ రోడ్లు వేసినట్లుగా ఎంబుక్‌లు సృష్టించి రూ.1.5 కోట్లు దోచేశారు. పూడివాడ(జాలాదిబుచ్చమ్మ), చిన్నమట్లపూడి(సంపతి తిరుపతమ్మ), సజ్జావారిపాలెం(పులివర్తి వెంకటేశ్వరరావు), తోటపల్లి (గోవతోటి తిరుపతిరావు), ఏలేటిపాలెం(కర్రా నాగరాజకుమారి), జిల్లేపల్లి(కోటేశ్వరరావు), వెనిగళ్ళవారిపాలెం(చిలకా సుబ్బారావు) బోగస్ మస్టర్లు వేసి వచ్చిన నగదును కాజేశారు. ఓ వైసీపీ నాయకుడు, ఆయా పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి సొమ్ములు దోచుకుతిన్నట్లు మండల పరిషత్ అధికారులు సోషల్ ఆడిట్‌లో తేల్చారు. ఈ క్రమంలో విచారణకు రావాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత రికార్డులతో ఫీల్డ్‌అసిస్టెంట్లు పరారయ్యారు.

# అమరావతి రైల్వేలైన్ కూత

- భూ సేకరణకు కేంద్ర గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- 297.499 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్
- గొట్టుముక్కల, పరిటాలలో 122.91 ఎకరాలు
- వీరులపాడు మండలంలో 174.56 ఎకరాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతి నూతన రైల్వే మార్గానికి ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా భూ సేకరకణ ప్రతిపాదనలకు సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రతిపాదిత భూ సేకరణ భూములపై ఏమైనా అభ్యంతరాలుంటే జనవరి 16లోపు తెలపాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించే నూతన రైల్వేలైన్‌కు 297.499 ఎకరాలను సేకరించేందుకు ఈ గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో 50.49 ఎకరాలు, పరిటాలలో 72.42, వీరులపాడు మండలం పెద్దాపురంలో 50.92 ఎకరాలు, గూడెం మాధవరంలో 7.71 ఎకరాలు, జుజ్జూరులో 28.89 ఎకరాలు, నరసింహారావుపాలెంలో 17.44 ఎకరాలు, చెన్నారావు పాలెంలో 26.45 ఎకరాలు, అల్లూరులో 43.15 ఎకరాల చొప్పున భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రతిపాదించిన భూముల్లో నూటికి 99 శాతానికిపైగా ప్రైవేటు భూములే ఉన్నాయి. ప్రభుత్వ భూములు చాలా తక్కువ. ఒకటి రెండు దేవదాయ భూములు కూడా ఉన్నాయి. పంచాయతీల పరిధిలో చాలా స్వల్ప సంఖ్యలో పుంత, పీడబ్ల్యూడీ కెనాల్, వాగు, ఇళ్ల స్థలాలు ఉన్నాయి. పరిటాలలో సర్వే నెంబర్ 8లో సుమారు 3 ఎకరాల వరకు కోర్టు కేసులో ఉన్న భూములను కూడా భూ సేకరణలో పెట్టారు. ఈ భూములను వెంటనే సేకరించటం కుదరదు. కోర్టు కేసులు తేలితే తప్ప సేకరించలేని పరిస్థితి. ఇవికాకుండా పలుచోట్ల డొంకలు కూడా భూ సేకరణలో ఉన్నాయి. పరిటాలలో సర్వే నెంబర్ 13లో ఎన్‌హెచ్ రోడ్డుకు సంబంధించిన భూమిలో 82 సెంట్ల మేర కోల్పోవాల్సి వస్తుంది. ఒకటి రెండుచోట్ల మాత్రమే అసైన్డ్ ల్యాండ్స్‌ను తీసుకోవాల్సి వస్తోంది.

# స్టీల్ గ్రే.. మాకొద్దు

- గ్రానైట్ ఎగుమతుల్లో మందగమనం
- ఫ్యాక్టరీల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన నిల్వలు
- మహారాష్ట్ర నుంచి రాని ఎగుమతుల అనుమతులు
- ఒక్కో ఫ్యాక్టరీలో సగానికి సగం పడిపోయిన అమ్మకాలు
- విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో పలు ఫ్యాక్టరీలు
- ఇదే పరిస్థితి కొనసాగితే మూసివేయక తప్పదంటున్న యజమానులు



గ్రానైట్ ఫ్యాక్టరీలో ఎగుమతులు లేక పెద్ద ఎత్తున నిల్వ చేసి ఉన్న గ్రానైట్ స్లాబులు



బల్లికురవ మండలంలో లభించే స్టీల్ గ్రే గ్రానైట్ స్లాబులు కట్ చేస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీ



క్రేన్ ద్వారా ముడి రాళ్లను కట్ చేస్తున్న యంత్రం

బల్లికురవ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న స్టీల్ గ్రే గ్రానైట్ స్లాబుల అమ్మకాల జోరు తగ్గింది. కొన్ని నెలల నుంచి పూర్తిస్థాయిలో ఎగుమతులు నిలిచిపోవడంతో ఫ్యాక్టరీల యజమానుల్లో ఆందోళన నెలకొంది. ఇదే పరిస్థితి ఉంటే విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేక పలు ఫ్యాక్టరీలు మూత పడడం తథ్యమంటున్నారు. అమ్మకాలు లేక కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్దఎత్తున నిల్వలు పేరుకుపోయాయి. దీంతో వాటిని వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నష్టాలు వచ్చినా తక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారు. గతంలో కొనుగోళ్ల కోసం వచ్చిన బయ్యర్లు ఇప్పుడు రావడం లేదని బల్లికురవ స్టీల్ గ్రే అంటే వద్దు అంటున్నారని ఫ్యాక్టరీల యజమానులు తెలిపారు. బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లో సుమారు నాలుగు వందల పైచిలుకు గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. బల్లికురవ ప్రాంతంలో ఉన్న వీర్లకొండ వద్ద స్టీల్ గ్రే రకం అందుబాటులో ఉంది. పలువురు ఈ రాయిపైనే ఆధారపడి ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం వరకు స్టీల్ గ్రేకి డిమాండ్ ఉండింది. కొన్ని నెలల నుంచి వీటి అమ్మకాలు పూర్తి స్థాయిలో మందగించాయి. మహారాష్ట్ర నుంచి స్లాబులకు ఆర్డర్లు లేవు. చైనా నుంచి ఎగుమతులకు అనుమతులు రావడం లేదు. దీంతో స్టీల్ గ్రే అమ్మకాలు పడిపోయాయని యజమానులు తెలిపారు. గతంలో ఒక్కో ఫ్యాక్టరీ నుంచి సరాసరిన నెలకు 20 లారీలలో లక్ష అడుగులు అమ్మకాలు జరగ్గా ఇప్పుడు 5 లారీల్లో 30 వేల అడుగులకు మించి అమ్మకాలు చేయలేకపోతున్నారు. గతంలో కొంత నాణ్యత తక్కువ ఉన్న స్లాబులు కూడా అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు నూరు శాతం నాణ్యత ఉన్న రాళ్లే అమ్మకాలు జరుగుతున్నాయని యజమానులు తెలిపారు. క్వారీలలో కూడా మంచి ముడిరాయి దొరకడం లేదంటున్నారు. ధర గతంలో మాదిరిగానే ఉందని, కట్ చేసిన స్లాబులు మాత్రం తక్కువ ధరకు అడుగుతున్నారని తెలిపారు. ఇప్పటికే నష్టాలు వస్తున్నా మిషన్లు మరమ్మతులకు రాకుండా అడపాదడపా నడుపుతున్నారు. అమ్మకాలు తగ్గడంతో గతంలో అడుగు స్టీల్ గ్రే రాయి రూ.75కి కొనుగోలు చేశారని ఇప్పుడు అదే అడుగు రూ.50కి అమ్మాల్సి వస్తోంది. ఫ్యాక్టరీల్లో నిల్వ ఉన్న స్లాబులను భద్రపరచడానికి కూడా వీలు లేక కొందరు ఆరుబయటనే వదిలేస్తున్నారు. ఎందరికో ఉపాధిని ఇచ్చే గ్రానైట్ ఫ్యాక్టరీలలో అమ్మకాలకు ఎగుమతులు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యజమానులు కోరుతున్నారు. విద్యుత్ చార్జీలు, మైనింగ్ రాయల్టీని తగ్గించాలంటున్నారు.

**పెరిగిన ఉత్పత్తి.. కొనుగోళ్లు అంతంతే**

గతంలో సింగిల్ కట్టర్లతో గ్రానైట్ స్లాబులను కట్ చేసేవారు. ఒక్కో ఫ్యాక్టరీ నుంచి సరాసరిన రూ.60వేల అడుగుల ఉత్పత్తి వచ్చేది. కానీ ఇప్పుడు మల్టీకట్టర్ మిషన్లను ఏర్పాటు చేయడంతో ఒకేసారి 14 స్లాబులను కట్ చేస్తున్నారు. దీంతో సగానికి సగం స్లాబుల తయారీ ఉత్పత్తి పెరిగింది. కొనుగోళ్లు మాత్రం గతం కంటే పెరగలేదు. దీంతో ధరలు కూడా పూర్తిగా తగ్గాయి. కొందరు యజమానులైతే విద్యుత్ బిల్లులు, మెయింటినెన్స్ కోసం తక్కువ ధరకే అమ్మకాలు చేస్తున్నారు. దీంతో చాలామంది యజమానులు నష్టాలలో ఫ్యాక్టరీలను రన్నింగ్ చేస్తున్నారు.

**అమ్మకాలు పడిపోయాయి**



స్టీల్ గ్రే గ్రానైట్ స్లాబుల అమ్మకాలు పూర్తిగా పడిపోయాయి. కొన్ని నెలల నుంచి అడిగే వారే లేరు. అన్ని ఫ్యాక్టరీలలో పెద్ద ఎత్తున నిల్వలు పేరుకుపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఫ్యాక్టరీలు మూతపడే ప్రమాదం ఉంది.

- చిట్టిపోతు మస్తానయ్య, గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు, బల్లికురవ

**నష్టాలు వస్తున్నాయి**



ముడిరాయి కట్ చేసి అమ్మకాలు చేసే సమయంలో మందం రావడంతో యజమానుల పరిస్థితి ఆందోళనగా ఉంది. కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడంలేదు, చేసేది లేక పలువురు తక్కువ ధరకు అమ్మకాలు చేయాల్సి వస్తుంది. గతంలో బల్లికురవ స్టీల్ గ్రే అంటే డిమాండ్‌గా కొనుగోలు చేసే బయ్యర్లు ఇప్పుడు వద్దు అంటున్నారు.

- గొట్టిపాటి కిశోర్, ఫ్యాక్టరీ యజమాని బల్లికురవ



బల్లికురవ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో అర్జీల స్వీకరణ(ఫైల్ ఫొటో)

# 1515 అర్జీలు పరిష్కారం

- మొత్తం వచ్చిన అర్జీలు 4,115
- ఈ నెలాఖరుకు ప్రక్రియ పూర్తి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియ తప్పుల తడకగా ఉండడంతో వాటిని పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలోని 71 గ్రామాల పరిధిలో రెవెన్యూ సిబ్బంది గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ ప్రక్రియను నవంబరు చివరికే యంత్రాంగం పూర్తి చేసింది. వచ్చిన అర్జీల పరిష్కారంపై ఈ నెల మొదటి వారం నుంచి యంత్రాంగం దృష్టి పెట్టింది. గ్రామసభల్లో వచ్చిన వినతుల్లో అధిక భాగం విస్తీర్ణంలో తేడాలు, జాయింట్ ఎల్‌పీఎంలే ఉండడం గమనార్హం. గత ప్రభుత్వంలో రీసర్వే జరిగిన సమయంలో స్థానికంగా ఉండే రాజకీయ ప్రమేయంతో కూడా కొన్నింటి విషయంలో ఉద్దేశపూర్వకంగా తప్పిదాలకు పాల్పడ్డారనే అర్జీలు కూడా అధికారులకు అందాయి. వీటితోపాటు అవకతవకల్లో సిబ్బంది పాత్రపై పలు ఫిర్యాదులు వచ్చాయి. రీ సర్వే పూర్తయిన 71 గ్రామాల పరిధిలో నిర్వహించిన గ్రామ సభల్లో మొత్తం 4,115 అర్జీలు అధికారులకు అందాయి. వీటిలో ఇప్పటి వరకు 1515 అర్జీలకు పరిష్కారం చూపెట్టగా 1954 వినతులు పెండింగ్‌లో ఉన్నాయి. 646 అర్జీలను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. అర్జీ పరిష్కరించే సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, ఇరుపార్టీల ఆమోదంతోనే దానిని పూర్తి చేస్తున్నట్లు యంత్రాంగం చెబుతోంది. సంక్లిష్టంగా ఉండే వాటి విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని, ఈ నెలాఖరు కల్లా మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని సుధావాణి

## ఏకాగ్రతతో చదువుకోవాలి

ఈపూరుపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చే పదవ తరగతి పరీక్షల్లో ఏకాగ్రతతో చదువుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సుధావాణి అన్నారు. గురువారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు లక్ష్యాలపై దృష్టిసారించే దిశగా అవగాహన కార్యక్రమంలో యూటీఎఫ్, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈక్రమంలో వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సీ 2025 పుస్తకంతో ప్రయోజనమున్నట్లు చెప్పారు. అలాగే ఉత్తమంగా రాణించిన వారికి బహుమతులను అందిస్తామని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు హరిబాబు, భిక్షాలు, పూర్వ విద్యార్థులు నరసింహారావు, పూర్ణచంద్రరావు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి



తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అనధికార లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వేటపాలెం తహసీల్దార్ పార్వతి గురువారం ప్రకటనలో చెప్పారు. వీటిపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇప్పటికే కొన్నింటిని గుర్తించి కన్వర్షన్ రుసుములు విధించినట్లు చెప్పారు. మరికొన్ని లేఅవుట్‌లకు నోటీసులు సిద్ధం చేసి ఆర్డీవో చంద్రశేఖరనాయుడు దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అక్రమంగా లేఅవుట్‌లు నిర్మించి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

## విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

**సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వ ప్రోత్సాహం-ఈఈ మస్తాన్‌రావు**



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ అధికారులు, వినియోగదారులు

అద్దంకి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా గురువారం అద్దంకిలోని బంగ్లా రోడ్డు నుంచి భవానీ సెంటర్ వరకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఈఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ గృహాల పైకప్పులపై సోలార్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ అద్దంకి, మార్టూరు డీఈలు దామోదరం, సురేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు బాలకోటేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, దీపక్, కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దండుబాట రోడ్డు కంపు కంపు

- పందులు, దోమలు, విషసర్పాలకు ఆవాసం
- రోగాలతో బాధపడుతున్న ప్రజలు



చెత్తాచెదారాలు, పందులతో ఉన్న దండుబాట రోడ్డు

చీరాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలోని దండుబాట రోడ్డులో వ్యర్థాలు, మురుగు నీటి నిల్వతో కంపుకొడుతోంది. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. జనావాసాల మధ్య మురుగు నీరు చేరడంతో దోమలు విజృంభిస్తున్నాయి. మరోవైపు పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దోమల దాడితో చిన్నారులు, వృద్ధులు రోగాలబారినడుతున్నారు. డెంగీ జ్వరాలతో పలువురు బాధపడుతున్నారు. చిల్లచెట్లు పెరగడంతో విషసర్పాలు కూడా తిరుగుతున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## రేపు ప్రాజెక్టుల కమిటీ ఎన్నికలు

- జిల్లాలో మూడు మధ్యతరహా ప్రాజెక్టులు
- రెవెన్యూ కీలక అధికారుల పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహణ
- నర్సరావుపేట కలెక్టరేట్‌లో పోలింగ్

ఒంగోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఈనెల 21న జరగనున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేస్తున్నారు. రాష్ట్రంలో సాగునీటి రంగం మూడు విభాగాలుగా నడుస్తుంది. చెరువుల పర్యవేక్షణ మైనర్ ఇరిగేషన్‌లో ఉండగా మధ్యతరహా నీటి వనరుల పర్యవేక్షణ మీడియం ఇరిగేషన్‌లోనూ, భారీ ప్రాజెక్టుల పర్యవేక్షణ మేజర్ ఇరిగేషన్ విభాగంలో ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్‌లో మూడు స్థాయిల్లో సాగునీటి సంఘాలు ఉండగా మీడియంలో రెండు, మైనర్ విభాగంలో ఒక స్థాయిలో ఉన్నాయి. మూడు విభాగాల్లోనూ క్షేత్రస్థాయిలో డబ్ల్యూయూఏలు ఉండగా వాటికి ఈనెల 14న ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో 88 మేజర్, 14 మీడియం, 240 మైనర్ ఇరిగేషన్‌లో డబ్ల్యూయూఏలు ఉండగా అన్నింటికి ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. కాగా రెండవస్థాయిలో మేజర్ విభాగంలో సాగర్ ప్రాజెక్టు పరిధిలో డిస్ట్రిబ్యూటరీ(డీసీ)లు ఉండగా జిల్లాలోని 10 డీసీలకు ఈనెల 17న ఎన్నికలు జరగ్గా అన్నింటికి ఏకగ్రీవంగా జరిగాయి. ఇక చివరి అంకమైన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఈనెల 21న జరగనున్నాయి.

**ఉన్నతాధికారుల నేతృత్వంలో**

జిల్లాలో మీడియం ఇరిగేషన్ విభాగంలో పీబీ అనకట్ట, మోపాడు రిజర్వాయర్, కంభం చెరువులు ఉండగా వాటికి ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాలి. ఆ పరిధిలో ఇప్పటికే ఎన్నికైన డబ్ల్యూయూఏల అధ్యక్షులు ఓటర్లుగా ఈ కమిటీల ఎన్నికలు జరుగుతుంది. పీబీ అనకట్ట కమిటీ ఎన్నిక ఒంగోలు ఆర్డీవో నేతృత్వంలో మూలగుంటపాడులోనూ, మోపాడు రిజర్వాయర్ కమిటీ ఎన్నిక కనిగిరి ఆర్డీవో పర్యవేక్షణలో మోపాడులోనూ, కంభం చెరువు ఎన్నిక మార్కాపురం సబ్ కలెక్టర్ నేతృత్వంలో కంభంలోనూ 21న జరగనుంది. ఇదిలా ఉండగా జిల్లాలో భారీ నీటి వనరుగా ఉన్న సాగర్ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ఈనెల 21వతేదీన నర్సరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరగతుంది. సాగర్ కుడికాలువ పరిధిలో ప్రస్తుతం ఉన్న పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో పరిధిలో ఉన్న 48 డీసీ అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోవాలి. అందులో 17 డీసీలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. ఈ కమిటీ కోసం పల్నాడు జిల్లా నేతలు గట్టి పోటీపడుతుండడంతో చంద్రబాబు సూచనలకు అనుగుణంగా ఎంపిక జరగనుంది.

# పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మినీ బైపాస్‌కు నిధులు మంజూరు చేయాలి
- మున్సిపల్ మంత్రి నారాయణను కోరిన మంత్రి గొట్టిపాటి



మంత్రి రవికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి డీసీ చైర్మన్ శ్రీనివాసరావు, పంగులూరు డీసీ వైస్ చైర్మన్ వీరాస్వామి, టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి కోరారు. అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువకు రెండు వైపులా మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం కు నిధులు మంజూరు చేయాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థలను మెరుగుపరిచేందుకు నిధులు కేటాయించి అభివృద్ధి కి సహకరించాలని రవికుమార్ కోరారు. వీధి దీపాలు, ఇతర బ్యూటిఫికేషన్ పనుల కోసం నిధులు కేటాయించాలని కోరినట్లు మంత్రి రవికుమార్ తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు సరిపడా నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

**మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన అద్దంకి డీసీ చైర్మన్, పంగులూరు వైస్ చైర్మన్**

అద్దంకి డీసీ చైర్మన్ బందారుపల్లి శ్రీనివాసరావు, పంగులూరు డీసీ వైస్ చైర్మన్ ధూళిపాళ్ల వీరాస్వామి పలువురు టీడీపీ నేతలతో వెళ్లి అమరావతిలో మంత్రి రవికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకి, బల్లికురవ మండలాల టీడీపీ నేతలు కరి పరమేష్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, మలినేని గోవిందరావు ఉన్నారు.

# ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి

- బావ, మరదలు మధ్య దీర్ఘకాలంగా భూ వివాదం
- ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అడ్డుకున్న క్రమంలో ఘటన
- పరిశీలించిన చీరాల డీఎస్పీ మొయిన్





వెంకటేశ్వర్లు (ఫైల్)

చినకొత్తపల్లి పొలంలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

అద్దంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఉన్న ఆస్తి తగాదాలతో పొలంలో ట్రాక్టర్ దున్నుతుండగా అడ్డుకున్న వెంకటేశ్వర్లు (65)ను ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని చినకొత్తపల్లికి చెందిన చెన్నుపాటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు అన్నదమ్ములు. నాగేశ్వరరావు 2007లో అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు భార్య నాగమల్లేశ్వరి మధ్య ఆస్తి వివాదం నెలకొంది. ఈ విషయమై పలు సార్లు రెండు కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో నాగమల్లేశ్వరి తన సోదరుడు గోవాడకు చెందిన యడ్లపల్లి నిమ్మయ్య సహాయంతో గురువారం సాయంత్రం ట్రాక్టర్‌తో పొలం దున్నిస్తుంది. విషయం తెలుసుకున్న వెంకటేశ్వర్లు పొలం వద్దకు వెళ్లి పొలం దున్నకాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లును ట్రాక్టర్ ఢీకొనటంతో అతను అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని చీరాల డీఎస్పీ మొయిన్ పరిశీలించి అద్దంకిటౌన్ సీఐ కృష్ణయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# రాష్ట్ర స్థాయి ఖోఖోలో బంగారు పతకం సాధించాలి

**ఆర్ఐవో సైమన్ విక్టర్**



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం బాలుర జట్టు

పంగులూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాలని ఆర్ఐవో సైమన్ విక్టర్, డీఆర్ఐవో ఎర్రయ్య ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి అండర్ - 19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు శిక్షణ గురువారం పంగులూరులో ముగిసింది. ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 20 రోజులు ఈ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ఈ జట్టు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగే అండర్ - 19 ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వ నిధులతో క్రీడాకారులకు సమకూర్చిన క్రీడా దుస్తులను కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి క్రీడాకారులకు అందచేశారు.

**జట్టులో పాల్గొనే క్రీడాకారులు**

ఈ జట్టు తరపున ఎస్.భరత్‌కుమార్, జి.సాయి, ఎస్.లక్ష్మణరావు, ఐ.ప్రవీణ్‌రెడ్డి, ఎల్.రవీంద్ర, ఎస్.మహేష్‌బాబు, సీహెచ్ గణేష్, సి.లక్ష్మీనరసింహ, సీహెచ్ బాజీ బాబు, షేక్ బాషా, దినేష్, కిషన్‌రెడ్డి ఆడనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి చింపారెడ్డి గురువారం ప్రకటించారు. కోచ్‌గా ఎం.సీతారామిరెడ్డి, మేనేజర్లుగా షేక్ ఆలీనవాజ్, ఎన్.అజయ్ వ్యవహరిస్తారని చింపారెడ్డి తెలిపారు.

# సంక్రాంతికి పల్లెపండగ పనులు పూర్తి చేయాలి

**కలెక్టర్ జె.వెంకటమురళి**



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, డీఆర్వో గంగాధర్‌గౌడ్

బాపట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండగ కార్యక్రమం కింద మంజూరు చేసిన పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిర్వహించిన సమావేశంలోని అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాల కోసం చేపట్టే పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. పాఠశాలలో తప్పకుండా ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయటానికి డివిజన్, మండల, గ్రామ స్థాయిలో అధికారులతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెంచేదిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసిన 15 రెసిడెన్షియల్ స్కూల్స్‌లో, 62 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టళ్లల్లో నిర్మాణాలు చేపట్టటానికి చర్యలు తీసుకోవాలని అధికారులకుసూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులన్నీ టెండర్ల దశ పూర్తి చేసుకొని పనులు ప్రారంభించాలన్నారు. పనులు ప్రారంభించకుండా ఉన్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. వసతి గృహాలకు సమీపంలో 104 వాహనాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు.

జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు మంజూరు చేసిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ రుణాలను రికవరి చేయటానికి అధికార బృందాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చర్మకారులను గుర్తించటానికి సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖతోపాటు మిగిలిన శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గించటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా అందిస్తున్న పథకాలను సక్రమంగా అందించటానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టటానికి తీసుకోవాలన్నారు. ఆడపిల్లలు శాతం పెంచేవిధంగా చూడాలన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించటానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అక్రమ మద్యం, గంజాయి రవాణా అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో బెల్ట్‌షాపులు ఉండకూడదనీ, ఎక్కడైనా ఉన్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని అధికారులను ఆయన హెచ్చరించారు. జలజీవన్‌మిషన్ కింద అన్ని గ్రామాలలో ప్రతి ఇంటికీ తాగునీటి అందించటానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో గంగాధర్‌గౌడ్, డీఈవో ఎస్.పురుషోత్తం, స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమ, డ్వామా పీడీ విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖాధికారిణి జె.రాజదెబోరా, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో గురువారం డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఏపీవోలతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడంతోపాటు క్లోరినేషన్ ప్రక్రియను పటిష్ఠంగా అమలు చేసే విధంగా చూడాలన్నారు. ప్రతిరోజు పారిశుధ్య ఏర్పాట్లపై వచ్చే ఫిర్యాదులను అదే రోజు పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పటిష్ఠంగా అమలు జరిగేలా కంట్రోలు రూమును ఏర్పాటు చేసి ప్రతిరోజు మానిటరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.



ఆటోలో వేలాడుతూ వెళ్తున్న కూలీలు

# ప్రయాణం..ప్రమాదం..!

- తరచూ ఏదోఒక చోట ఘటనలు
- అయినా మారని ప్రయాణికుల తీరు

చీరాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ప్రయాణికుల్లో మార్పు రావడం లేదు. ప్రమాదం మాట అటుంచితే.. గమ్యం చేరాలన్న ఆలోచనే పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపుతుంది. ఆటోలు, బస్సుల్లో, ద్విచక్ర వాహనాలపై ఇష్టా రీతిగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రయాణాల్లో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. లెక్కకు మించి వాహనాల్లో ఎక్కి వెళ్తున్నారు. మరో వైపు అధికారులు పలుమార్లు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా వాటిని పెడచెవిన పెడుతున్నారు. అందుకు ఈ ఫొటో నిదర్శనం. ఇటీవల కాలంలో వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోలు పలు ప్రాంతాల్లో ప్రమాదాలకు గురయ్యాయి. ఆ సమయంలో పలువురు క్షతగాత్రులు కాగా, కొందరు మృత్యువాతపడుతున్నారు. అయినా ప్రయాణాల తీరు మారలేదు. పొట్టకూటి కోసం ఒకే వాహనంలో పదుల సంఖ్యలో కూలీలు ఆటోల్లో తరలివెళ్తున్నారు. ఇలాంటి వాహనాలపై అధికారులు దృష్టి సారించాల్సిందే.

## జ్వరంతో బాలిక మృతి

- ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స
- ధేనువకొండ పునరావాసకాలనీలో ఘటన

అద్దంకిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలిక మృతి చెందింది. జ్వరం, తరువాత జలుబుతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతు మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తెలిసిన వివరాల మేరకు.. వేలమూడిపాడు వద్ద ఉన్న దేనువకొండ పునరావాసకాలనీలో నివాసం ఉండే పి.వర్షిణి(10)కి గత రెండు రోజుల కిందట జ్వరం రావడంతో ప్రైవేట్ వైద్యులలో చూపించారు. జ్వరం అంతగా లేపోవడంతో తిరిగి బడికి వెళ్లింది. ఆ రోజు రాత్రి జలుబు తీవ్రంగా ఉండగా తల్లిదండ్రులు అద్దంకిలో ప్రైవేట్ వైద్యులలో చూపించారు. పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఇంటికి తీసుకువచ్చిన బాలికకు అర్ధరాత్రి తరువాత జలుబు ఎక్కువై ఊపిరి తీసుకునే పరిస్థితి లేక ఇబ్బంది పడుతుండడంతో రావినూతలలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ బాలికల చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 7 గంటల సమయంలో చనిపోయింది. బాలికను గురువారం పూడ్చివేశారు. అయితే బాలిక ఎటువంటి అనారోగ్య సమస్యతో చనిపోయిందో.. ఏమైందో అర్థంకాక తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన చెందుతున్నారు.

## సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

- వైద్యాధికారుల సమయపాలన, రిఫర్ కేసులపై డీసీహెచ్ఎస్ ఆరా
- 50 పడకల ఆసుపత్రిగా మార్పునకు ప్రతిపాదనలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శేషుకుమార్

అద్దంకిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి సీహెచ్‌సీలో మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు వైద్యశాలను 50 పడకల ఆసుపత్రిగా మార్పు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ శేషుకుమార్ అన్నారు. గురువారం అద్దంకి సీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు సమయపాలన పాటిస్తున్నారా లేదా, రిఫర్ చేస్తున్న కేసులు వాటి వివరాలను పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైద్యశాలలో ట్రామా కేర్, ఆర్థోపెడిక్, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్ వంటి నూతన సౌకర్యాలతో పాటు ఖాళీగా ఉన్న జనరల్ సర్జన్, జనరల్ మెడిసన్ ఏర్పాటుకు వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు వాహిలా చౌదరి, అనితజ్యోతి, ప్రదీప్తి, వెంకట కిరణ్, ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

అద్దంకిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, ఎం. జోసఫ్, తిరుపతిరెడ్డి, ఆదాం, కోటేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : డాక్టర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అమానుషమని పలువురు దళిత సంఘాల నాయకులు అన్నారు. గురువారం చీరాల గడియార స్తంభం కూడలిలో చీరాల దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మానవ హారంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# టీడీఆర్ బాండ్లపై.. విజిలెన్స్

(5వ పేజీ తరువాయి)

ఫీజులు చెల్లించకుండానే నేతల ఒత్తిడి మేరకు ప్లాన్లను అధికారులు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక అనధికారిక నిర్మాణాలకు లెక్కేలేదని సమాచారం. వాటికి రెవెన్యూ పరంగా పన్నులు కూడా సక్రమంగా విధించలేదని తెలుస్తుంది. ఇలా అనేక అంశాలపై రెండు నగర పాలక సంస్థలు, 14 మున్సిపాలిటీలలో విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఆయా రికార్డులను తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణకుమార్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి మున్సిపాలిటీల్లో క్షేత్రస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు. రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నారు.

**గుంటూరులో భారీ స్కాం**

గుంటూరులో నకిలీ టీడీఆర్ బాండ్లు, నకిలీ చలనాల కుంభకోణం గతంలో జరిగింది. దీనిపై దర్యాప్తు జరుగుతుండగానే 2022లో మరో స్కాంకు వైసీపీ నాయకులు, అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి తెర తీశారు. పెదకాకాని రోడ్డులోని బెస్ట్‌ప్రైస్ నుంచి జాతీయ రహదారి వరకు వయా పందులకాలనీ మీదగా రోడ్డు విస్తరణకు టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయే బాధిత రైతులకు మస్కా కొట్టి టీడీఆర్ బాండ్లు జారీ చేసి కుంభకోణానికి పాల్పడ్డారు. ఈక్రమంలో తక్కెళ్లపాడుకు చెందిన రైతులను ఒప్పించేందుకు అధికారులు ప్రయత్నించగా వ్యవహారం బెడిసికొట్టింది. అక్రమ బాండ్లకు తాము ఒప్పుకోమంటూ రైతులు నగరపాలక సంస్థ అధికారులకు ఎదురుతిరిగారు. దీంతో రూ.300 కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం వెలుగుచూసింది. అప్పటి నుంచి రైతులకు వాస్తవంగా అందించాల్సిన టీడీఆర్ బాండ్లను కూడా ఇవ్వలేదు. దీనిపై కూడా విజిలెన్స్ అధికారులు నగర పాలక సంస్థలో తనిఖీలు చేపట్టారు.

# చురుగ్గా అండర్ డ్రైనేజీ పనులు

» ఎమ్మెల్యే ఏలూరి ఆదేశంతో కదిలిన హైవే అధికారులు

» హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పర్చూరు, డిసెంబరు 19 : ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ఆదేశాలతో హైవే అధికారులు స్పందించారు. వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు విస్తరణలో భాగంగా పెండింగ్ పనులను చురుగ్గా ప్రారంభించారు. ప్రధానంగా హైవే రోడ్డు నిర్మాణంలో సమీపంలోని పంట పొలాలు ముంపునకు గురికాకుండా అండర్ డ్రైన్ నిర్మాణానికి కార్యాచరణ చేపట్టారు.

రోడ్డు నిర్మాణంపై తమ పంట పొలాలు ముంపునకు గురవుతాయని దీని పై చర్యలు తీసుకోవాలని సమస్యను రైతులు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే ఇటీవల తన క్యాంపు కార్యాలయంలో హైవే ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో హైవే రోడ్డును నిర్మించాలని సూచించారు. ప్రధానంగా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం - పర్చూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వరద కాలువ లేకపోవడంతో పంటలు దెబ్బతింటాయని అండర్ డ్రైన్ పైపు లైన్‌ను ఏర్పాటు చే యాలని సూచించారు. అధికారులతోపాటు, కాంట్రాక్టర్లు కాజ్‌వే ప్రాంతంలో రెండు లైనులతో పెద్ద పైపులైన్‌ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. అదేవిధంగా తిమ్మరాజుపాలెం సమీపంలో తలపెట్టిన కాజ్‌వే స్థానంలో పైపులైన్‌ను తొలగించి 10 మీటర్ల వెడల్పు 3 మీటర్ల ఎత్తులో బ్రిడ్జి (అండర్ డ్రైనేజీ) ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. సమస్య త్వరితగతిన పరిష్కరించే విధంగా చొరవ చూపిన ఎమ్మెల్యే ఏలూరికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


సబ్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న అండర్ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులు


ఎక్స్‌కవేటర్‌తో సాగుతున్న పనులు


పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న రోటరీ సభ్యులు

## కుట్టుమిషన్‌లతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ద్వారా అందించిన కుట్టుమిషన్‌లను జీవనోపాధిగా ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, బీజీఆర్ మైన్స్ అండ్ ఇన్ఫ్రా ఎల్‌టీడీ హైదరబాద్ సౌజన్యంతో 10మంది మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ చండూరి మురళీసుధాకరరావు, మహమ్మద్ రఫీ, చిన్ని మురళీకృష్ణ, దేవపాలన, చంద్రమౌళి, రామకోటేశ్వరరావు, హరిప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అమరవీరులకు నివాళి

మార్టూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్‌లకు ఘనంగా నివాళులర్పించారు. గురువారం గన్నవరం రోడ్డులో అఖిల భారత విప్లవ రైతు సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో షేక్ మమ్మద్‌బాషా, కమాలుద్దీన్, ఉప్పలపాటి తిరుపతిరాజు, రాధాకృష్ణమూర్తి, ఖాజా, మధు, సుజాత పాల్గొన్నారు.

## పంట బీమాను చేయించుకోవాలి

చినగంజాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో వరిసాగు చేస్తున్న మండల పరిధిలోని రైతులు డిసెంబరు 31వ తేదీలోపు పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. క్రాప్ సోన్ సర్టిఫికెట్‌ని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల వద్ద తీసుకొని దగ్గరలోనే మీ సేవ కేంద్రం, గ్రామ సచివాలయం లేదా బ్యాంకులో నమోదు చేయించుకోవాలని సూచించారు. రబీలో బ్యాంకు రుణం తీసుకొని శనగ, వరి, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పండించే రైతులు నెలాఖారులోపు రైతు సేవా కేంద్రంలో వీఏఏని సంప్రదించి క్రాప్ సోన్ సర్టిఫికెట్‌ను తీసుకొని బ్యాంకు మేనేజర్‌కు సమర్పించి పంట బీమా నమోదు చేయించుకోవాలని ఏవో తెలిపారు.

## వైసీపీలో పలువురికి జిల్లా పదవులు

చీరాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బాపట్ల జిల్లాకు సంబంధించి పలు జిల్లా పదవులకు అభ్యర్థులను నియమిస్తూ ఆపార్టీ అధిష్టానం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గవిని శ్రీనివాసరావును, ఎస్సీ సెల్ విభాగ జిల్లా అధ్యక్షుడిగా వాసిమళ్ల వాసు, పురపాలక సంఘ విభాగ జిల్లా అధ్యక్షుడిగా బత్తుల అనిల్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా చీమకుర్తి బాలకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఈ నేపథ్యంలో పలువురు వీరికి అభినందనలు తెలిపారు.

## చీరాలలో గోవా మద్యం పరవళ్లు

» నిఘా వేసి పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

» 9 ఫుల్ బాటిల్స్, 157 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం » మహిళ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేటపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో గతకొంత కాలంగా గోవా మద్యం పరవళ్లు తొక్కుతోంది. ఈమేరకు సమాచారం అందుకున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ కేపాల్‌కాలనీకి చెందిన ఇట్టా శ్రావణి కొంతకాలంగా గోవాకు చెందిన మద్యంను రైలు మార్గాన కాలనీకు తరలించి విక్రయాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు.. ఎస్సై శ్రీహరి సిబ్బందితో దాడులు నిర్వహించారు. దీంతో ఆమె ఇంట్లో ఉన్న 9 ఫుల్ బాటిల్స్, 157 క్వార్టర్ గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సరుకును సీజ్ చేశారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

## రెచ్చిపోతున్న సెల్‌ఫోన్ దొంగలు

» 10 రోజుల వ్యవధిలో 4 చోరీ

» బైక్‌పై ఇద్దరు యువకుల హల్‌చల్

మార్టూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు మక్కెన సాంబశివరావు అనే గ్రానైట్ యజమానిని మోసగించి దాదాపుగా రూ.60వేల విలువైన సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. ఈ ఘటన గురువారం మార్టూరులోని రవీంద్ర స్వీట్ బ్యాకరీ ఎదురుగా జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఎవరైనా రోడ్డుపై పడిపోతే మానవతా దృక్పథంతో వారికి సహాయం చేస్తాం. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని ఇద్దరు యువకులు సెల్‌ఫోన్‌ల చోరీకి సిద్ధపడుతున్నారు. సాంబశివరావు రవీంద్ర స్వీట్ బ్యాకరీ నుంచి బయటకు వస్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన యువకులు రోడ్డుపై పడిపోయినట్లు నటించారు. దీనిని చూసిన అతను వారిని పైకిలేపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారిలో ఒక యువకుడు సాంబశివరావు జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకోవడం అదే వేగంతో బైకుపై ఇద్దరు యువకులు పరార య్యారు. వారిని సాంబశివరావు తనబైకుపై వెళ్లి వెంబడించినా పట్టుకోలేకపోయారు. ఇదే తరహాలో బుధవారం కూడా కొణిదెన రోడ్‌లో ఒక చెప్పులషాపు యజమానిని రోడ్డుపై మోసం చేసి సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. అదేరోజు గన్నవరం రోడ్డులో రాయల్ స్కూల్‌కు వెళ్లే టర్నింగ్ వద్ద ఒక సెలూన్ షాపు వద్ద కూర్చుని ఉన్న రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీను సెల్ ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. వారం రోజులు కిందట సెంటర్లో మధు టీ షాపు వద్ద ఆటోమొబైల్ షాపు యజమాని ముందు రూ.10 నోటు వేసి దానిని అతను తీసుకుంటుండగా, అతని జేబులోని సెల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. దాదాపుగా 10 రోజుల వ్యవధిలో సెల్‌ఫోన్లు లాక్కొని పారిపోయే యువకులపై చర్చ సాగింది. కాగా సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కాలేజీ బస్సును ఢీకొన్న పాల ట్యాంకర్

మార్టూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చెందిన కాలేజీ బస్సును గురువారం రాత్రి మార్టూరులో హోండా షోరూం ఎదురుగా హైవేపై ఒంగోలు వైపు వెనుక నుంచి పాల ట్యాంకరు ఢీకొన్న సంఘటన జరిగింది. ఈ సమయంలో కాలేజీ బస్సులో విద్యార్థినులు ఉన్నప్పటికీ పాల ట్యాంకరు నిదానంగా బస్సును ఢీకొనడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు వెనుక భాగం, పాల ట్యాంకరు ముందు భాగం కొంతమేర దెబ్బతిన్నాయి. తరువాత మధ్యవర్తుల సమక్షంలో వారి మధ్య రాజీ జరిగినట్లు తెలిసింది. ఈ విషయమై స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ బాషా తెలిపారు.

## మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు తోటకూర నాగేశ్వరరావు మృతదేహానికి గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించినట్లు ఎస్ఐ సైదా తెలిపారు. నాగేశ్వరరావు బుధవారం రాత్రి స్థానికంగా అంబేడ్కర్ నగర్ ఎదురుగా చిలకలూరిపేట వైపు హైవేపై రోడ్డుదాటుతుండగా కారు ఢీకొని మృతిచెందిన విషయం విదితమే. అతని అల్లుడు కసుమర్తి కనకచంద్రారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టమ్ అనంతరం బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి మృతదేహాన్ని భార్య, కుమార్తె కుటుంబసభ్యులు తీసుకువెళ్లారు.


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సచివాలయాల సిబ్బంది

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

చీరాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజక వర్గ పరిధిలోని అన్నిప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని శాఖల సచివాలయ సిబ్బంది పని చేయాలని రెండు మండలాల ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెండు మండలాల్లో గతకొంత కాలంగా నిర్వహిస్తున్న ఎల్ఎస్‌డీజీ ఎస్ (లోకల్ ఆఫ్ సస్టెయిన్‌బుల్ డెవలప్ మెంట్ గోల్స్) కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శిక్షణలో అలవరచుకున్న విధానాలతో ప్రజలకు సేవలు అందించాలని వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


వీరబ్రహ్మనందం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మార్టూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పురాతన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంలోనూ, విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యద్దనపూడి ఎంఈవో-2 చిలుకూరి గోపి అన్నారు. గురువారం స్థానిక విద్యానగర్‌లో విశ్రాంత ఉపాధ్యాయుడు దొడ్డా వీరబ్రహ్మనందం దశ దిన కర్మ జరిగింది. సంస్మరణ సభకు విశ్రాంత డీవైఈవో రాజారావు అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా ఎంఈవో గోపి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధ్యాయులు ప్రజలను ప్రభావితం చేస్తారన్నారు. అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. తొలుత వీర బ్రహ్మనందం చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెరుకూరి శ్రీరామమూర్తి, రావి యలమందయ్య, ఎం.ఈశ్వరప్రసాద్, గరిమిడి శ్రీను, చెరుకూరి అంజిబాబు, కే హనుమంతరావు, పీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవాలి


స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దాత శ్రీరామచంద్రమూర్తి, తదితరులు

అద్దంకిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలతో పాటు సులభతరమైన స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని విశ్రాంత హెచ్‌ఎం, దాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. గురువారం మండలంలోని చక్రాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించాలి

చీరాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు అవసరమైన మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించుకోవాలని సాధ్యమైనంత వరకు పొదుపు దిశగా ఆచరించాలని డీఈఈలు హరిప్రసాద్, శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం చీరాల డివిజన్ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 21 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో సోలార్‌ను ఉపయోగించుకోవాలని అన్నారు. తద్వారా విద్యుత్ పొదుపు జరగడమే కాకుండా బిల్లు భారం తగ్గుతుందని చెప్పారు. సోలార్‌పై అవగాహన కల్పించారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏఈలు, జెఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

## ముమ్మరంగా వరినాట్లు


చినగంజాం ప్రాంతంలో జోరుగా వరినాట్లు వేస్తున్న కూలీలు

చినగంజాం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం ప్రాంతంలో ముమ్మరముగా వరినాట్లు జరుగుతున్నాయి. చినగంజాం ఎత్తిపోతుల పథకం ఆయకట్టు భూములలో ఈ ఏడాది ఆలస్యంగా వరి నారులను పోశారు. నవంబరులో వరినార్లు పోసి డిసెంబరులో నాట్లు పూర్తి చేస్తున్నారు. కడవకుదురు, గొనసపూడి, చినగంజాం, చింతగుంపల్లి తదితర ప్రాంతాల నుండి మహిళా కూలీలు చినగంజాం వచ్చి నాట్లు వేస్తున్నారు. కూలీల కొరత ఉండడంతో నిధానంగా నాట్లు వేస్తున్నారు. చినగంజాం ఎత్తిపోతుల పథకం కింద 1000 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన రైతులు ఎకరం రూ.10వేలకు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 92, 1163, 1638, 1156, 1153, 1010 క్రాస్ తదితర వరి వంగడాలను వేశారు. ఐదు నుంచి నాలుగు నెలల వ్యవధిలో పంట చేతికి వచ్చే విధంగా రైతులు విత్తనాలను ఎంచుకున్నారు. వాయుగుండం ప్రభావంతో వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులందరూ వరినాట్లు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. మార్చి ఆఖరు నాటికి కొమ్మమూరు కాలువలో నీరు సమృద్ధిగా వస్తే వేసిన పైర్లు పంట పండే అవకాశం ఉంది. కొమ్మమూరు కాలువలో గత ఏడాది సాగునీరు సక్రమంగా రాకపోవడం వలన చినగంజాం ఎత్తిపోతుల నుంచి రొంపేరు కాలువలోని నీటితో తడులు ఇచ్చారు. కాలువలోని నీటితో సాగు చేయడం వలన వరి పైర్లు అంతా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కొమ్మమూరు కాలువకు పుష్కలంగా నీరు వస్తుండడంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. వ్యవసాయశాఖ వారు రైతులకు తగిన సూచనలు ఇచ్చి మూస కాకుండా ఆధునిక పద్ధతుల్లో సాగు చేసి రైతులు లాభాలు ఆర్జించేలా తగు సూచనలు, జాగ్రత్తలు ఇవ్వాలి.

## పారిపోయిన విద్యార్థి చివరికి ఇంటికి

» పాఠశాలకు బయలుదేరిన బాలుడు » సైకిల్, స్కూల్ బ్యాగ్ పడవేసి ఒంగోలుకు

» ఆర్టీసీ ఉద్యోగి సమాచారంతో తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు


ఓంకార్


రామ్‌నగర్ గ్యాస్ గోడౌన్ రోడ్డులో పడి ఉన్న సైకిల్, బ్యాగు

అద్దంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు బయలుదేరి వెళ్లిన విద్యార్థి గొట్టిపాటి ఓంకార్ అదృశ్యమైన సంఘటన కథ కాసేపటికి సుఖాంతమైంది. ముండ్లమూరు మండలం వేంపాడుకు చెందిన గొట్టిపాటి శ్రీధర్‌బాబు మరి కొంతమందితో కలసి అద్దంకిలో తౌడు వ్యాపారం చేస్తూ నాగులపాడు రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. శ్రీధర్‌బాబు కుమారుడు ఓంకార్ అద్దంకిలోని గ్యాస్ గోడౌన్ రోడ్డులో ఉన్న బెల్ అండ్ బెనెట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరిన ఓంకార్ సైకిల్, స్కూల్ బ్యాగ్‌లను మార్గమధ్యంలో పడేసి వెళ్లిపోయాడు. పాఠశాలకు వెళ్లని విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనతో పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు సైకిల్, స్కూల్ బ్యాగ్ పడవేసి ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. వ్యాపారంలో మిగిలిన భాగస్తులతో విభేదాలు ఉన్నాయని, ఆ క్రమంలో కిడ్నాప్ జరిగి ఉంటుందని తండ్రి శ్రీధర్‌బాబు తొలుత అనుమానం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగికి కూడా ఈ విషయాన్ని చెప్పడంతో విద్యార్థి ఫొటోను ఆర్టీసీ ఉద్యోగుల సోషల్ మీడియా గ్రూప్ లో పోస్ట్ చేశారు. ఆర్టీసీ బస్‌లో అద్దంకి నుంచి ఒంగోలు వెళ్లినట్లు ఓ కండక్టర్ స్పందించి సమాచారం ఇచ్చారు. దీంతో బంధువులు ఒంగోలు వెళ్లి వెతికారు. సాయంత్రం 6-30 సమయంలో ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తించి ఇంటికి తీసుకొచ్చారు. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

## ప్రజలు చల్లగా ఉండాలి

ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక పూజలు

చీరాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ ప్రజలంతా సంతోషంగా ఉండాలని, దేవుడు వారిని చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు చేయించినట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం నర్మదా నదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీ ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దేవస్థానాన్ని గురువారం కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కొండయ్య దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు నిర్వహించారు. నిత్యం ప్రజల యోగ క్షేమాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. పూజల్లో ఆయన సతీమణి బాలకొండమ్మ, కుమారులు గౌరీ అమర్‌నాథ్, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, కుమార్తె దేవి ఉన్నారు.


ఓంకారేశ్వర జ్యోతిర్లింగ ఆలయం వద్ద ఉన్న ఎమ్మెల్యే కొండయ్య, కుటుంబ సభ్యులు


## సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం


జనకవరంలో వివాదంలో ఉన్న ఇంటి స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో అర్జీల ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరు, జనకవరం గ్రామాలలో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జనకవరం గ్రామంలో స్థల వివాద సమస్యను గుర్తించి ఆ స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, సర్వేయర్ సురేష్, పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో శేషమ్మ, ఏపీఎం జ్యోతిప్రసాద్, కార్యదర్శి రాంబాబు, వీఆర్వో చింపారావు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, ఆదిశేఖర్, వెంకటరావు పాల్గొన్నారు.

చినగంజాం : రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామసభలో పలు సమస్యలపై 158 అర్జీలను అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మ్యుటేషన్‌కు 26, ఎఫ్.లైన్ కోసం 90, కులధ్రువీకరణ సర్టిఫికెట్‌కు 40, ఆదాయ సర్టిఫికెట్ కోసం 2 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ నాగేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

యద్దనపూడి : గ్రామాలలో రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె రవికుమార్ అన్నారు. గురువారం యద్దనపూడిలో జరిగిన సదస్సులో అందిన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.



## సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా శోభారాణి



నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కే శోభారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తూ బోధన సాగించడం ద్వారా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని ఆమె అన్నారు.

# అటాక్!

## సాయంత్రం కాదు.. పగటిపూటా దోమల దండయాత్ర

ఆంధ్రజ్యోతి పరిశీలన



గుయ్.. గుయ్.... మంటూ దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సాయంత్రం కాదు.. పగటిపూట కూడా ప్రజలను వదలడం లేదు. కనబడ్డవారినల్లా కుట్టి రక్తాన్ని పీల్చేస్తున్నాయి. వాతావరణంలో ప్రతికూలత ఏర్పడటంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు చలి కూడా ఎక్కువైంది. పేరుకుపోయిన చెత్తకుప్పలు.. పారుదల లేని మురుగు కాలువల్లో లార్వా నుంచి దోమలు పురుడు పోసుకుంటున్నాయి. ఆ తర్వాత 'అటాక్' అంటూ ప్రజలపై విజృంభిస్తున్నాయి. వీటిని నిలువరించాల్సిన నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. కొన్నిచోట్ల ఫాగింగ్ యంత్రాలు మూలనపడగా, అక్కడక్కడా డ్రైనేజీ కాలువల్లో ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్‌లతో యంత్రాంగం చేతులు దులుపుకుంటోంది. కాయిల్స్, లిక్విడ్‌లకూ జంకని దోమలకాటుతో అనేక మంది రోగపీడితులై ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.



నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో పాచిపట్టిన మురుగునీరు



ఆత్మకూరు: నివాసాల మధ్య మురుగునీరు





రాజావారివీధిలో చెత్త చెదారం మధ్య పందులు

కావలిలో చెత్తకుప్పలు

కావలి, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్యం వ్యవస్థ అధ్వానంగా ఉంది. 40 వార్డులు ఉన్న పట్టణంలో నాలుగు డివిజన్లకు డివిజన్‌కు రెండు ట్రాక్టర్లు వంతున 8 ట్రాక్టర్లు చెత్తను తరలిస్తున్నాయి. ఆ చెత్తను ట్రాక్టర్ల నుంచి కంపోస్ట్ యార్డుకు తరలించేందుకు ఏర్పాటు చేసిన కంపాక్టర్ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరంతా చెత్తలో చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఇక పందుల గుంపు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక కాలువల్లో పూడికతీత, దోమల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలో ఉన్న 5 ఫాగింగ్ మిషన్ల ద్వారా నిత్యం ఫాగింగ్ చేస్తున్నా దోమల ఉధృతి మాత్రం తగ్గడం లేదు. మురుగు కాలువల్లో దోమల లార్వా నియంత్రణకు స్ప్రే చేయడం లేదు.



ఫాగింగ్ చేస్తున్నా డోంట్‌కేర్!

కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : ఫాగింగ్ జరుగుతున్న దోమలు మాత్రం కందుకూరు వాసులను వదలడం లేదు. రాత్రయితే బయట ఉండే పరిస్థితి లేనంతగా దోమలు ముసురుతున్నాయి. ప్రధానంగా గుణ్ణంకట్ట కుంట, ముత్యాలకుంట, కోమటికుంట, చాకలికుంట పరిసరాలు దోమల వృద్ధి కేంద్రాలుగా ఉంటున్నాయి. అలాగే అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోని ఖాళీస్థలాల్లో వర్షపునీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల నియంత్రణకు ఫాగింగ్ తోపాటు ఇతర మందులు పిచికారీ చేయడం, మురుగుకాలువలు, గుంతలు, నివాసగృహాల మధ్య ఆయిల్‌బాల్స్ వేయించటం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. మరోపక్క మురుగుకాలువల్లో చెత్తాచెదరం తీసి రోడ్డుపైనే వదిలేస్తున్నారు. రోజుల తరబడి వాటిని తీయకపోవడంతో కుక్కలు, పందులు, కోళ్లు రోడ్డు అంతా వెదజల్లి వీధులను అపరిశుభ్రం చేస్తున్నాయి. గతంలో చెత్త తీసిన వెంటనే ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తరలించేవారని ప్రస్తుతం కూడా అదేపద్ధతి అవలంబించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆత్మకూరులో కానరాని నియంత్రణ

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డులు ఉండగా, వీటిలో 14 మురికివాడలున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు పారుదల లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక దోమల ఉధృతి పెరగడంతో వ్యాధులు అధికమవుతున్నాయి. మున్సిపాలిటీలో 4 ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ఇంతవరకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఇటీవల రెండు యంత్రాలకు మరమ్మతులు చేయించామని, వర్షం తగ్గిన తరవాత ఫాగింగ్ చేయిస్తామని పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. కనీసం మురుగు గుంతల్లో ఆయిల్‌బాల్స్ కూడా వేయకపోవడంతో దోమల ఉధృతి ఎక్కువైంది.

## నగరం.. నరకం



నెల్లూరు : రాజీవ్‌గృహకల్ప వద్ద మురుగు నిల్వ

నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి) : 149.02 చ.కి.మీ విస్తీర్ణం కలిగిన నెల్లూరులో 99 మురికివాడలు ఉన్నాయి. 56 డివిజన్లు ఉన్న నగరంలో 7.5 లక్షల మంది జనాభా ఉన్నట్లు కార్పొరేషన్ సిబ్బంది తమ గణాంకాల్లో తేల్చారు. సుమారు 8 వేల వరకు ఖాళీ స్థలాలు ఉన్నట్లు లెక్కలు తీసిన అధికారులు ఇవన్నీ దోమల పుట్టినిళ్లుగా చెప్పుకొస్తున్నారు. లార్వా పురుడుపోసుకుని దోమగా మారి నగరంపై దండయాత్రకు ఇక్కడే పునాది అవుతుంది. పాత మున్సిపల్ ప్రాంతం డ్రైనేజీ వ్యవస్థ మెరుగ్గానే ఉండటంతో దోమల దాడి పెద్దగా లేదు. పైగా ఖాళీ స్థలాలు కూడా తక్కువే. విస్తరించిన శివారు, విలీన ప్రాంతాలలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండి డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేదు. దోమలు వృద్ధి చెంది ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు, ఖాళీ స్థలాల్లో లార్వా దోమలను నాశనం చేసే ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్ ప్రక్రియ ఈ ప్రాంతాలలో పెద్దగా జరగడం లేదు. ఇక ఫాగింగ్ యంత్రాలు 5-7 వరకు పనిచేయక మూలనపడేశారు. రెండు యంత్రాలను మాత్రం అటు రూరల్, ఇటు సిటీ నియోజకవర్గాల్లో రోజుకు రెండు డివిజన్ల చొప్పున వాడుతున్నారు.

### పత్తాలేని 'గంబూజీయా'

నీటిలో లార్వాను ఆహారంగా తీసుకునే గంబూజీయా చేపల వాడకాన్ని కార్పొరేషన్ అధికారులు పూర్తిగా పక్కనపెట్టేశారు. ఈ చేప కేవలం లార్వాను మాత్రమే తింటుంది. దీనివల్ల దోమల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. గత టీడీపీ హయాంలో నగర మంతా ఈ చేపలను నీటి నిల్వప్రాంతాలలో వదిలిన ఎస్‌ఎంసీ అధికారులు మంచి ఫలితాలనే రాబట్టారు. కానీ గడిచిన ఐదేళ్లగా ఈ ప్రక్రియకు స్వస్తి పలికారు. ఇప్పుడైన గంబూజీయా చేపలను ఖాళీ స్థలాలు, నీటి నిల్వ ప్రాంతాలలో వదిలి లార్వాను నాశం చేస్తే దోమల వ్యాప్తి తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఖాళీ స్థలాల వారికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారు.

బుచ్చిలో..

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఖాజానగర్, రామచంద్రాపురం, హౌస్‌తోట, సుబ్బారెడ్డినగర్ ప్రాంతాల్లో గుడపల్లి కాలువ వెంబడి దోమలు విజృంబిస్తునాయి. నగర పంచాయతీలో ఫాగింగ్, 2 స్ప్రేయింగ్ పరికరాలు ఉండగా, రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున స్ప్రేయింగ్ చేయడంలేదు. రెండు స్ప్రేయింగ్ పరికరాలతో దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్టు కమిషనర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.



బుచ్చిరెడ్డిపాళెం : హౌస్‌తోటలో గుడపల్లి కాలువ దుస్థితి

## భూ సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్

**కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం**

**రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీల ఏర్పాటు**

ప్రజలను పట్టిపీడిస్తున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చాలా వరకు భూ వివాదాల్లో సివిల్, క్రిమినల్ వ్యవహారాలు ముడిపడి ఉంటున్నాయి. దీంతో వీటి పరిష్కారానికి రెవెన్యూ, పోలీసు శాఖలతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు ఈ టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటు, పనితీరుకు సంబంధించి విధివిధానాలను పంపింది. ప్రస్తుతం జిల్లాలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల నియామకం జరుగుతోంది. ఈ కమిటీలో తహసీల్దార్, ఎస్సైలతోపాటు స్థానిక రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉంటారు. ఈ కమిటీల ఏర్పాటు పూర్తి కాగానే డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీలతో కూడిన కమిటీలను నియమించనున్నారు. భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీల ప్రధాన లక్ష్యం.

- వివరాలు 6లో..

## గతి తప్పుతున్న ప్రగతి చక్రం!



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ)లో సిబ్బంది కొరత తీవ్రరూపం దాల్చుతోంది. దశాబ్దకాలంగా ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం ఎక్కువవుతోంది. నెల్లూరు రీజియన్ పరిధిలో సుమారు 300 వరకు డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీలలోని పలు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. కారుణ్య నియామకాలు మినహా 2013 నుంచి ఇప్పటివరకు పోస్టుల భర్తీ కోసం ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఉన్న సిబ్బందిపై భారం పెరుగుతుండటంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం గాలిలో దీపంలా మారుతోంది.

**• ఆర్టీసీలో పదేళ్లుగా భర్తీకాని పోస్టులు**

**• ప్రైవేటు డ్రైవర్లే దిక్కు!**

ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌లో డ్రైవర్ పోస్టులు 125 వరకు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ అధికంగా ఉన్న సమయంలో డిపో మేనేజర్లు కాల్ ఆన్ డ్రైవర్లు అంటే ప్రైవేటు డ్రైవర్లకు రోజువారి వేతనం చెల్లించి బస్సులను తిప్పుతున్నారు. ఆర్టీసీ బస్సు అంటేనే సురక్షిత ప్రయాణమని ప్రజలు నమ్ముతుంటారు. అందుకు ప్రధాన కారణం సంస్థకు చెందిన డ్రైవర్లకు బస్సు నడపడంపై ఎంతో నైపుణ్యత కలిగి ఉంటారు. అయితే ప్రైవేటు డ్రైవర్లతో బస్సులు తిప్పుతుండటంతో సురక్షితంపై ప్రయాణికుల్లో ఆందోళన రేగుతోంది.

**• కనుమరుగవుతున్న కండక్టర్లు**

సురక్షితమైన ప్రయాణంపై డ్రైవర్ దృష్టి పెడుతుంటే కండక్టర్ ప్రయాణికులను బస్సులో ఎక్కించుకోవడం, వారితో మర్యాద పూర్వకంగా మలుచుకుంటూ చార్జీలు వసూలు చేసి సంస్థకు ఆదాయం పెంచేవారు. అయితే, పల్లె వెలుగు సర్వీసులు మినహా దూరప్రాంతాలకు బస్సుల్లో కండక్టర్లు కనిపించడం లేదు. సింగిల్ డ్రైవర్, డబుల్ డ్రైవర్ బస్సులే రోడ్డుమీద తిరుగుతున్నాయి. డ్రైవర్ బస్సును నడుపుతూనే కండక్టర్ విధులు కూడా నిర్వహిస్తున్నారు. దీంతో ఆ డ్రైవర్‌పై పనిభారం పెరిగిపోతూ డ్రైవింగ్‌పై దృష్టి సారించలేకున్నారు.

**• గ్యారేజీలలోనూ అంతే!**

పది సంవత్సరాలుగా ఆర్టీసీలో పోస్టులు భర్తీ చేయకపోవడంతో గ్యారేజీలలో పనిచేసే అనేక రకాల ఉద్యోగులపై పనిభారం పెరిగిపోతోంది. వైసీపీ సర్కారులో కొత్త బస్సులు ఒకటి కూడా ఇవ్వకపోవడం, కాలం చెల్లిన బస్సులకు మరమ్మతు చేసి రోడ్లపైకి పంపేవారు. అయితే గ్యారేజీలలో ఉద్యోగులు అడిగిన స్పేర్ పార్ట్స్ కూడా సరిగా అందించక పోవడం, పూర్తి స్థాయిలో సిబ్బంది కొరతతో ఉన్నవారిలో అసహనం పెరిగిపోతోంది. రీజియన్‌లో సుమారు 150 పోస్టులకుపైగా ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

## జికా వైరస్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నాం

**• పూణే ల్యాబ్‌కు రక్తనమూనాలు : డీఎంహెచ్‌వో**

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అనుమానిత జికా వైరస్‌పై అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాడు మండలం వెంకటాపురానికి చెందిన బాలుడు సుబ్బరాయుడు, తల్లిదండ్రులు, సోదరిల నుంచి రక్త నమూనాలు తీసి పూణే వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అలాగే మరో 20 మంది రక్తనమూనాలు కూడా పంపించామని, ఇంకా ఫలితాలు రావాల్సి ఉందన్నారు. వెంకటాపురంలోని 152 ఇళ్లలో ఇంటింటికి వెళ్లి వైరస్ లక్షణాలు జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఉన్నయా లేదా పరిశీలించామని, ఎవరూ ఆ లక్షణాలతో లేరని పేర్కొన్నారు. ఇక దోమల నివారణకు ఇంటి బయట, లోపల స్ప్రే చేస్తున్నామని, ఫాగింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, ఎలాంటి ఆందోళన వద్దని కోరారు.

## రేపు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం

నెల్లూరు(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ అన్ని మేనేజ్‌మెంట్ల కింద నడుస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం శనివారం నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 మార్చిలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్స్, థియరీ కేంద్రాల ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. అలాగే నైతిక విలువలు, పర్యావరణ విద్య, ప్రాక్టికల్స్, థియరీ పరీక్షల సన్నాహక చర్యలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది వివరాల నమోదు, అపార్ కార్డుల జారీ, 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి కొత్త జూనియర్ కళాశాలల ఏర్పాటు, అఫిలియేషన్, రెన్యువల్స్‌పై కూడా చర్చ ఉంటుందని తెలిపారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అందరూ ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

## 'పోక్సో' కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

**• రూ.20 వేల జరిమానా**

అల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. అల్లూరు ఎస్‌ఐ కె.కిషోర్ బాబు కథనం మేరకు.. 2015 జూలై 8న అల్లూరులో తల్లిదండ్రులు లేని ఓ బాలిక పెద్దమ్మ ఇంటిలో ఉంటూ చదువుకుంటోంది. వరుసకు అన్న అయిన చెంబేటి మురళి మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై బలాత్కారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బాలిక పెద్దమ్మకు తెలపడంతో ఆమె ఎవరికీ చెప్పవద్దని చెప్పి, ఆమంచర్లలోని ఓ హాస్టల్‌లో చేర్పించారు. అయితే, బాలిక ఆరోగ్య పరిస్థితిలో మార్పులు రావటంతో హాస్టల్ సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించగా, గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధారించారు. ఐసీపీసీ అధికారుల సహాయంతో బాలిక అల్లూరు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో విచారించిన అప్పటి కోవూరు సీఐ అశోకవర్ధన్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కావలి డీఎస్పీ వి.శ్రీధర్, కావలి రూరల్ సీఐ బి.పాపారావు, అల్లూరు ఎస్‌ఐ కె.కిషోర్ బాబులు ఈ కేసుకు అవసరమైన సాక్ష్యాధారాలను సమకూర్చారు. ప్రాసిక్యూషన్ వారు నేరం రుజువు చేయడంతో చెంబేటి మురళికి జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానాను విధిస్తూ న్యాయాధికారి సుమ తీర్పు ఇచ్చారు.

## నరుకూరులో కుంగిన రోడ్డు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు నుంచి తోటపల్లిగూడూరుకు వెళ్లే మార్గంలో కోడూరు కాలువకు సమీపంలో రహదారి గురువారం ఉదయం కుంగి పెద్ద గుంత పడింది. దీంతో ఆ రహదారిలో వెళ్లే వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ రహదారిలో కోడూరు కాలువకు సమీ పంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పంట పొలాలకు సాగునీరు సరఫరా జరిగే కాలువ ఉంది. ఈ కాలువకు చిన్నపాటి వంతెన నిర్మించారు. అది పటిష్టతను కోల్పోయి కుంగిపోయింది. గ్రామస్థులు ఇరి గేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడం తో ఆ హోల్ వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టారు.





## నెల్లూరులో సీఎస్ బస

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. నగరానికి వచ్చిన సీఎస్‌కు కలెక్టర్ ఆనంద్ పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్ పాల్గొన్నారు. సీఎస్ జిల్లా మీదుగా వెళుతూ ఇక్కడ బస చేసినట్లు సమాచారం.

## వెంకటాపురంలో పారిశుధ్య చర్యలు

• 13 మంది నుంచి రక్త నమూనాల సేకరణ



గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

జికా వైరస్ కలకలంతో మర్రిపాడు మండలం వెంకటాపురంలో పారిశుధ్య మెరుగు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే వైద్యశిబిరం నిర్వహించి, గ్రామస్థుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నారు. ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ లక్షణాలు బయటపడిన విషయం తెలిసిం దే. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్ తన సిబ్బందితో గురువారం కూడా వీధులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యుడు గోపినాథ్ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, గ్రామంలో 9మందికి, బాలుడు చదువుతున్న కృష్ణాపురం పాఠశాలలో నలుగురు విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి నెల్లూరు ల్యాబ్‌కు పంపారు. గ్రామంలో ఎవరికీ జ్వర లక్షణాలు లేవని, ప్రజలు ఆందోళన చెందవద్దని తహసీల్దారు అనిల్‌కుమార్ తెలిపారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)





రైల్వే యార్డులో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

## యూరియా కొరతే లేదు

• జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

కోవూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ సీజన్‌లో యూరియా కొరతే లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారిణి పీ.సత్య వాణి తెలిపారు. స్థానిక పడుగుపాడు రైల్వేస్టేషన్ యార్డులో గురువారం ఆమె యూరియా లోడింగ్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ జిల్లాకు ఈ నెలలో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే 12 వేల మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందన్నారు. మిగతా 18వేల టన్నులు యూరియా ఈ నెలాఖరులోగా వస్తుందని, అందులో 8వేల టన్నులు వారం రోజుల్లోనే వస్తుందని పేర్కొన్నారు. యూరియా దొరకదని రైతులు ఆందోళన చెంది స్టాకు పెట్టుకోవద్ద న్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సోజీరావు, ఏడీఏ సుజాత, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

20 నుంచి 40 శాతం వరకు రాయితీలు

పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యం

• రైతులకు పాత బకాయిల చెల్లింపు

• జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి

ఉద్యాన పంటలు లాభసాటిగా ఉండాలంటే రైతు కష్టంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా ముఖ్యం. అందుకే కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగు లేస్తోంది. వైసీపీ సర్కారు హయాంలో ఉన్న పాత బకాయిలను విడుదల చేస్తూనే 2024-25 లక్ష్యాలను నిర్దేశించి నిధులు కేటాయిస్తోంది. ఈ విషయాలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ.సుబ్బారెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై)లతోపాటు ఆయిల్ ఫాం పథకాల ద్వారా ప్రభుత్వం రాయితీ లు అంది స్తున్నట్లు తెలిపారు. పండ్లు, కూరగాయలు, పూలతో టల పెంప కం ద్వారా అధిక ఆదాయం పొందేలా చర్యలు తీసుకుం టున్నట్లు చెప్పారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



సౌరశక్తి శీతల గది



ఎం.వి. సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద అధిక విలువ కలిగిన కూర గాయల సాగును ప్రోత్సహిస్తున్నారు. సాగులో ఆధునీక రణ పద్ధతులు, శాశ్వత పందిళ్లు, సేకరణ కేంద్రాలు, సౌరశక్తి శీతల గదు లను నిర్మించుకోవచ్చు. అదేవిధంగా పండించిన కూరగాయల రవాణాలో 20 శాతం పాడవు తాయి. వీటిని నివారించేం దుకు కోత తర్వాత శుభ్రం చేయ డం, శీతల గదుల్లో నిల్వ చేయడంతో పాటు శీతల సౌకర్యం ఉన్న వాహ నాల ద్వారా రవాణా చేసుకునే అవకాశం ఉంది. అన్ని రకాల కూర గాయలు పండించడం, వాటికి గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. సంకరజాతి కాయగూరల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు హెక్టారుకు 40 శాతం రాయితీ కింద గరిష్ఠంగా రూ.20వేల వరకు అందిస్తారు. సోలార్ శీతల గదికి రూ.12.5 లక్షలు ఖర్చు అవుతుంటే 35 నుంచి 40 శాతం గరిష్ఠంగా రూ.4.3 లక్షల నుంచి 5లక్షల వరకు రాయితీ అందుతుంది.

### పండ్ల తోటల సాగుకు..

పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచడమే ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ పథకం (ఎంఐడీహెచ్) ముఖ్య ఉద్దేశం. పండ్ల తోటల పెంపకం, నిర్వహణ, తోటల పునరు ద్ధరణ, ప్యాక్ హౌస్, శీతల గదులు, సేకరణ కేంద్రాలు, యాంత్రీకరణ పరికరాలకు రాయితీ ఉంటుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు శిక్షణ ఉంటుంది. అదేవిధంగా మల్చింగ్, పక్షుల నుంచి పంట రక్షణకు నెట్ ఏర్పాటుకు రాయితీ ఉంటుం ది. నీటి కుంటలను నిర్మించుకో వచ్చు. నిమ్మ, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మూడేళ్లపాటు హెక్టారుకు నిమ్మకు రూ.16,004, మామిడి రూ.13,300, జామ రూ.29,331, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.30వేలు రాయితీ అందిస్తు న్నారు. టిష్యూ కల్చర్ కింద రెండేళ్లపాటు అరటికి రూ.40,985, బొప్పాయికి రూ.24,663 చొప్పున రాయితీ అందుతుంది. పంట ఉత్పత్తులను గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్ చేసేందుకు ఉపయోగపడే ప్యాక్ హౌస్‌కు గరిష్ఠంగా రూ.2 లక్షలు రాయితీ అందుతుంది. కలుపు నివారణ, కూలీల ఖర్చు తగ్గించడం, అధిక దిగుబడు లు పొందేందుకు ఉపయోగపడే మల్చింగ్ పద్ధతికి 50శాతం రాయితీ అందుతుంది. దుర్భిక్ష పరిస్థితుల్లో పండ్ల తోటలను రక్షించుకునేందుకు నీటికుంటల ఏర్పాటుకు ప్రత్యేక పథకం ఉంది. వ్యక్తిగతంగా నీటికుంట ఏర్పాటు చేసుకుంటే 50శాతం అంటే రూ.75 వేలు, కమ్యూనిటీ నీటికుంట ఏర్పాటుకు 100శాతం సబ్సిడీ ఉంటుంది. ఉద్యాన యాంత్రీకరణ కింద మినీట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు వంటి యంత్ర పరికరాలకు సంబంధించి మహిళ, సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం, పెద్ద రైతులకు 40శాతం రాయితీ అందుతుంది.



కలెక్షన్ సెంటర్

శాశ్వత పందిళ్ల నిర్మా ణానికి హెక్టారుకు 50శాతం రాయితీ కింద గరిష్ఠంగా రూ.25 వేలు, సేకరణ కేంద్రానికి రూ.15లక్షల ఖర్చు అవుతుం టే రూ.5.2లక్షల నుంచి 6లక్షల వరకు రాయితీ అందుతుంది. విడిపూల సాగుకింద బంతి, చామంతి, గడ్డి సంపంగి తదితర పూల రకాల విస్తీర్ణాన్ని పెంచేం దుకు హెక్టారుకు 40శాతం రాయితీ కింద గరిష్ఠంగా రూ.16వేల రాయితీ లభిస్తుంది.

• ఆయిల్‌ఫాం సాగుకు

నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ పథకం ద్వారా జిల్లాలో ఆయిల్ ఫాం సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తు న్నారు. జిల్లాకు ఎఫ్ఎఫ్ఎఫ్ ఆయిల్ ఫాం కంపెనీని కేటాయించింది. ఇండిజి నస్ ఆయిల్ ఫాం సాగుకు 4 సంవ త్సరాలకు రూ.62వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్ ఫాం సాగుకు రూ.71వేలు ఉద్యాన శాఖ ద్వారా రైతులకు రాయితీ అందిస్తారు.



జ్వర పీడితులను పరీక్షిస్తున్న కోవూరుపల్లి వైద్యులు

## సీఎల్ పురంలో వైద్యశిబిరం

చీరాలగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచు లక్ష్మీపురంలో రోజురోజుకు విషజ్వరాలు పెరుగుతుండటంతో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 70మందికి పైగా వైద్య పరీక్షలు చేయగా 10 మందికి జ్వరం ఉందని రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌లు తెలిపారు. మిగిలిన వారికి జ్వరం తగ్గి కీళ్లనొప్పులతో బాధపడుతున్నట్లు చెప్పారు. వారికి అవ సరం అయిన మందులు ఇచ్చామన్నారు. టీడీపీ బోగోలు ఇన్‌చార్జి ముంతాల వెంకయ్య, గిరిజన నేత బోగిరి ప్రభాకర్‌లు వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో మేరీ, సూపర్‌వైజర్ విక్టోరియా, ఏఎన్‌ఎంలు జ్యోష్న, సలోమి, ప్రసున్న, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కుడి కాలువకు మోటార్ల ఏర్పాటు

• 130 క్యూసెక్కుల నీటి విడుదల • ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు



తూము వద్ద మోటార్లు, పైపులను సిద్ధం చేస్తున్న అధికారులు

లింగసముద్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువకు రెండు మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గురు వారం మెగా కం పెనీ ప్రతినిధులు తూము వద్దకు మూడు మోటా ర్లను తెచ్చారు. అయితే వాటిలో 75 హెచ్‌పీ మోటారు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడంతో 25 హెచ్‌పీ, 16 హెచ్‌పీ మోటార్ల ద్వారా 15 క్యూసెక్కుల మేర నీటిని సరఫరా చేస్తున్నట్టు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సైఫన్ పద్ధతిలో మరో పైపు ద్వారా ఇంకో 5 క్యూసెక్కుల నీరు కాలువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం కాలువలో 130 క్యూసెక్కుల మేర నీరు సరఫరా అవుతున్నట్లు డీఈ తెలిపారు. శుక్రవారం మరో 3పైపుల ద్వారా సైఫన్ పద్ధతిలో నీరు కాలువకు విడుదల చేస్తామన్నారు. అధికారులు ఇంత చేస్తున్నా ఇసుకపాలెం వద్ద కాలువపై వేసిన అడ్డుకట్టలను లస్కర్లు ఉదయం తొలగించారు. మధ్యాహ్నం మరలా కాలువ నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయించినట్లు ప్రాజక్టు సిబ్బంది తెలిపారు.

## బెల్టుషాపులను కట్టడి చేయాలి

• ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



అధికారులతో సమీక్షిస్తున్న రాహుల్‌దేవ్ శర్మ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం బెల్టు దుకాణాలను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని, ఎక్సైజ్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో గురువారం ఆయన ఎక్సైజ్ అధికా రులతో సమీక్ష జరిపారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకు న్నారు. వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. బెల్టు దుకాణాల నిర్వాహ కులు, వారికి మద్యం సరఫరా చేసే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎంఆర్పీ ఉల్లంఘన, బ్రాండ్ మిక్సింగ్‌కు పాల్పడేవారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. సారా తయారీ, విక్రయాలు, రవాణాను నిర్మూలిం చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, ఏసీ దయాసాగర్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాసులు నాయుడు, ఐఎంఎల్ డిపో మేనేజర్ అయుషాబేగం, ఏఈఎస్‌లు రమేష్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

• ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కేరళకు తరలిన జట్టు

కావలి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని వీఎస్‌యూ పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వీఎస్‌యూ ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. వారంరోజులుగా పీజీ కళాశాల పీడీ మణికంఠ ఇన్‌చార్జిగా వ్యవహరించగా సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఎస్ఏ.నవీద్ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి జేబీ డిగ్రీ కళాశాల సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను యూనివర్సిటీ సమకూర్చిన ట్రాక్‌షూట్, ఫుట్‌బాల్ షూస్, జెర్సీ, షార్ట్‌లను అందజేశారు. ఇంటర్ యూని వర్సిటీ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి వీఎస్‌యూకు పేరుతేవాలన్నారు. శనివారం నుంచి కేరళ రాష్ట్రం క్యాలికట్ (కోజికోడ్)లో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.



ఫుట్‌బాల్ జట్టు సభ్యులతో మాల్యాద్రి



బస్సుకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కోటంరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఈడీ వెంకటేశ్వరరావు తదితరులు

## ఆర్టీసీ సిటీ బస్సు ప్రారంభం

• 20 ఏళ్ల తర్వాత చిన్నచెరుకూరుకు సర్వీసు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/తోటపల్లి గూడూరు డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి సెంటర్ నుంచి చిన్న చెరుకూరుకు ఆర్టీసీ సిటీ బస్సును గురువారం ప్రారంభించారు. నెల్లూరు-2 డిపో గ్యారేజీలో నెల్లూరు రూరల్, సర్వేపల్లి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పచ్చజెండా ఊపి బస్సును ప్రారంభించారు. సోమిరెడ్డి మాట్లాడుతూ జోనల్ చైర్మన్‌గా సురేష్‌రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందా లని ఆకాంక్షి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, నెల్లూరు 1, 2 డిపోల మేనేజర్లు ఎం మురళీబాబు, శివకేశవ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తోటపల్లి గూడూరు మండలం చిన్నచెరుకూరు గ్రామానికి 20 ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గ్రామస్తులు ఆటోల్లోనే ప్రయాణం చేస్తుండేవారు. అయితే, చిన్న చెరుకూరు గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి ఇటీవల ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని స్థానికులు కోరారు. ఈ నేపథ్యంలో అయ్యప్పగుడి నుంచి సిటీ సర్వీసును ప్రారంభించి గ్రామస్తులతో కలసి సురేష్‌రెడ్డి బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, బీజేపీ నాయకులు అన్నం శ్రీనివాసులు, తుళ్లూరు జనార్దన్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, నక్క సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్

• కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం
• రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీల ఏర్పాటు
• తొలుత మండల స్థాయిలో నియామకం
• ఆ తర్వాత డివిజన్, జిల్లా స్థాయిలో ఏర్పాటు

నెల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూ సమస్యలు పెరిగిపోయాయి. రాజకీయ బలంతో బలహీనుల భూములను లాక్కుకున్నారు. కొందరు రికార్డులు మార్చేసి ఇతరుల భూముల్లోకి చొరబడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతీ వారం గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీల్లో సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అం దులో భాగంగానే రీసర్వే జరిగిన గ్రామాల్లో తొలుత గ్రామసభలు నిర్వహిం చింది. ఈ సభల్లో కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చా యి. వీటిని చూశాక ఆ తర్వాత అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. ఇక్కడ కూడా తమ భూములను లాక్కున్నారన్న అర్జీలు వస్తున్నాయి. అయితే ఈ సమస్యల పరిష్కారంలో మాత్రం ఆశించినంత పురోగతి కనిపించడం లేదు. దీంతో బాధితులు మళ్లీ అదే అర్జీలతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

### తొలుత మండల టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

రెవెన్యూ, పోలీసు శాఖలతో ముడి పడి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని ఆదేశించింది. అందులో భాగంగా తొలుత మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సైలతో టాస్క్‌ఫోర్స్ కమిటీను ఏర్పాటు చేస్తున్నాం. ఈ కమిటీలు ఎప్పటికప్పుడు అందుతున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తాయి.

- కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

### ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ..

భూ వివాదాల పరిష్కారంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసు శాఖలు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ తప్పించుకుంటున్నారు. ఒక వ్యక్తి తన భూమిని మరొకరు భయపెట్టి ఆక్రమించారని ఫిర్యాదు చేస్తే రెవెన్యూ శాఖ లాఅండ్‌ఆర్డర్ సమస్యగా చూపిస్తుండగా, పోలీసు శాఖ మాత్రం సివిల్ వివాదంగా చూపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో బాధితులకు న్యాయం జరగడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఆలోచనను ముందుకు తెచ్చింది. ఇటు సివిల్, అటు క్రిమినల్ వ్యవహారాలు ముడిపడి ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, పోలీసు శాఖలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా భూ ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారాలను ఈ కమిటీ సమీక్షిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చే వివాదాలన్నిటినీ ఈ కమిటీకి పంపుతారు. తహసీల్దార్, ఎస్సైలు క్షేత్రస్థాయిలో సంయుక్తంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తారు. ఇక్కడ కూడా పరిష్కారం కాని సమస్యలు రెండో దశలో డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల దృష్టికి వెళతాయి.

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

**న్యూస్ బాక్స్**

### స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ఉదయగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రేడియన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖుల్లా ఖాన్, పండిత్ రాంప్రసాద్‌బిస్మిల్‌ల వర్ధంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మసూద్, ఆవాజ్ కమిటీ సభ్యులు నజర్‌బాషా, హీనా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### బొల్లినేని సురేంద్రకు..

కలిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు చిన్న కుమారుడు, సోషల్ మీడియా సైనికుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు బొల్లినేని సురేంద్ర అకాల మరణం కలిచివేసినట్లు మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పెద్దపాడుకు వెళ్లి సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం సురేంద్ర తండ్రి రామారావును పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మొక్క హజరత్ బాబు, పొన్నగంటి శ్రీనివాసరావు ఉన్నారు.

### ప్రతిభా విద్యార్థికి అభినందన

కావలి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన బ్లాక్‌లెవెల్ క్రీడా పోటీల్లో స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి నవదీప్ ప్రతిభ చూపాడు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ లుకోధర్ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకయ్య, డైరెక్టర్లు కొండయ్య, పీవీఎస్ ప్రసాద్, కళాశాల గౌరవ సలహాదారుడు నందనవనం మధుసూదన్‌రావు, పీడీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు నవదీప్‌కు బొకే, మెమెంటో అందించి అభినందించారు.

### డీఈవో కేజీబీవీ తనిఖీ

కలిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారి బాలాజీరావు గురువారం స్థానిక కెజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి విద్యార్థినుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉతీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కేజీబీవీ ప్రిన్సిపల్ సుప్రియ ఉన్నారు.

### మెటీరియల్ పంపిణీ

వలేటివారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాఖవరం హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ టీచరు వీ.ఎస్ లక్ష్మీనారాయణ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేసిన లక్ష్మీనారాయణకు టీచర్లు అభినందించారు.

### 22 నుంచి స్పాట్ వ్యాల్యూయేషన్ క్యాంప్

కందుకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నుంచి ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం థర్డ్ సెమిస్టర్ డిగ్రీ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ ప్రారంభం అవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పాట్ వాల్యూయేషన్‌కు హాజ రయ్యే అధ్యాపకులు విధిగా యూనివర్సిటీ జారీ చేయబడిన గుర్తింపుకార్డుకు ఫోటో అతికించి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం తీసుకుని రావాలని పేర్కొన్నారు.

### రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

వలేటివారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సూక్ష్మ నీటి సేద్యంపై గురువారం రైతులకు అగాహన కార్యక్రమం నిర్వహించారు. 5ఎకరాలలోపు రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్ అందించనున్నట్లు తెలిపారు. రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు నరేష్, మహేంద్ర, ఈపీసీ కంపెనీ ప్రతినిధి శ్రీహరి, ఏఓ హేమంత్ పాల్గొన్నారు.

### టెలికం అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్‌కు అభినందన

లింగసముద్రం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా టెలికం అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ గురం మాల్యాద్రిని గురువారం అభినందించినట్లు టీడీపీ నాయకులు అడపా రంగయ్య, పూరిమిట్ల మాల్యాద్రిలు గురువారం ప్రకటనలో తెలిపారు. మాల్యాద్రిని డైరెక్టర్ గా నియమించడంలో సహకరించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

### రికార్డుల తనిఖీ

వలేటివారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంను గురువారం ప్రకాశం జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సొంత భవనం నిర్మాణానికి స్థలం సేకరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ ఎంపీడీఓ నరేంద్రదేవ్, ఈఓఆర్డీ అబ్దుల్ లేకపోవడంతో నెల్లూరు జిల్లా డీఎల్‌పీఓతో మాట్లాడింది. గ్రంథ పాలకుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ తాత్కాలిక వంతెన!



ప్రమాదకరంగా ఉన్న తాత్కాలిక వంతెన

కలిగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిర్రావారిపాలెం వద్ద గొట్టిపాటి కొండపనాయుడు ఉత్తరకాలువ (సోమశిల ఉత్తరకాలువ)పై నిర్మించిన తూములు వేసి ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన మార్గం ప్రమాదకరంగా మారింది. ఈ కాలువ కలిగిరి, కొండాపురం మండలాలకు అనుసంధానంగా రాళ్లపాడు రిజర్వాయర్ వరకు వెళుతుంది. ఈ కాలువ నిర్మాణం జరుగుతున్నపుడు కాలువకు ఆవలివైపున 500ఎకరాలు పంట పొలాలు ఉన్నాయని ఆ పొలాలకు వెళ్లాలంటే కాలువపై వంతెన నిర్మించాలని పనులు అడ్డుకున్నారు. వంతెన నిర్మించాలని పట్టుబడితే అప్పటి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు చొరవతో ఒక వరుసలో ఎనిమిది తూములను ఏర్పాటు చేసి పైన మట్టి వేయించి తాత్కాలిక ఇబ్బందులు లేకుండా చేశారు. అయితే వర్షాకాలంలో నీరు ప్రవహించేటపుడు తూముల వద్ద చెత్తచె దారం, జంతుకళేబరాలు అడ్డుపడి నీరు వెళ్లడం లేదు.

**● ఇద్దరు ఎమ్మెల్యేల పరిశీలన..**

ఈ క్రమంలో నాలుగునెల క్రితం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులతో వంతెనను పరిశీలించి శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని తెలిపారు. వంతెన వద్ద నీరు వెళ్లడానికి రెండోవరుసలో మరో ఎనిమిది తూములను ఏర్పాటు చేశారు.

● రెండునెలల కిందట ఉత్తరకాలువకు నీరు వదిలినపుడు స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వంతెనను పరిశీలించారు. జిర్రావారిపాలెం ప్రజలు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి ఈ తీసుకొచ్చారు. ఆయన కూడా వంతెన వద్ద శాశ్వత నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**ఇటీవల కురుస్తున్న వర్షాలతో..**

గత 20రోజులుగా పడుతున్న వర్షాలకు తూములపై వేసిన మట్టి కొట్టుకుపోయింది. వంతెన ప్రాంతమంతా బురమయంగా మారింది. ఈ మార్గం ద్వారా గుండా తాము పొలాలకు వెళ్లలేకపోతున్నామని ఈ గ్రామాల పరిసరాల ప్రజలు వాపోతున్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణ మార్గం ద్వారా వెళ్లలేకపోతే గ్రామం చుట్టూరా మూడు కిలోమీటర్లమేర తిరిగి పొలలకు వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్నిసార్లు ఉత్తర కాలువ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కాంక్రీటు నిర్మాణంతో ఉత్తర కాలువపై వంతెన ఏర్పాటు చేస్తే తాము పడుతున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు.

**పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం..**



కాలువ ఆవలివైపున 500ఎకరాలు పంటు పొలాలు ఉన్నాయి. వర్షాకాలం వస్తే పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వంతెన నిర్మాణం చేపట్టాలని అధికారుల చుట్టూరా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సమస్యపై ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు స్పందించాలి.

- జిర్రా పెద్ద అంకిరెడ్డి, జిర్రావారిపాలెం

**తాత్కాలిక వంతెనతో ప్రమాదమే..**



కావలి-ఉదయగిరి ప్రధాన రహదారి సమీపంలోని జిర్రావారిపాలెం ఉత్తర కాలువపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గం గుండా మహిళలు, చిన్నారులు, వృద్ధులు వృద్ధులు వెళ్లేందుకు ఇబ్బందులు పడతారు. కాంక్రీట్ నిర్మాణంతో శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలి.

- పులి మదన్‌మోహన్‌రెడ్డి, జిర్రావారిపాలెం

## సీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే కాకర్ల



టీడీపీ నేతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) అభివృద్ధికి అన్నీ చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే, హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న ఈ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత తీర్చేందుకు, ఇప్పటికే ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. మెట్ట ప్రాంతం కావడంతో పేదలు అధికంగా ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారని తెలిపారు. వారిని దృష్టిలో ఉంచుకొని వైద్యశాలలో అన్నీసేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైద్య శాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో చర్చించారు. పారిశుధ్యం సమస్య తలెత్తకుండా చూడాల న్నారు. అనంతరం సమావేశంలో చేపట్టిన, చేప ట్టాల్సిన అభివృద్ధి పనులను సభ్యు లకు చదివి వినిపించారు. కార్యక్రమంలో డీడీవో అనీషా, వైద్యులు సింధూర, ప్రశాంత్, ఎంపీడీవో అప్పాజీ, ఈవో కరీముల్లా, హెచ్‌డీఎస్ సభ్యురాలు కలివెల జ్యోతి, టీడీపీ నేతలు బయ్యన్న పాల్గొన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

సీతారామపురం : పేదవారు ఆపదలో ఉన్నప్పుడు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆసుపత్రి ఖర్చుల కోసం బాధితులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలపరిధిలోని నాంచారమ్మపల్లెకి చెందిన కంచెంరెడ్డి జస్విక రెడ్డికి రూ.3,39,075ల చెక్కును, సీతారామపు రానికి చెందిన దూదేకుల హాజరత్‌కు రూ.75,000ల చెక్కును అందజేశారు. కార్యక్రమం లో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, ఎడమ ప్రవీణ్,విక్కీ బాబు, దేవర వెంకటే శ్వర్లు,శేఖర్ పాల్గొన్నారు.

## నేర నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి



సంగం: మైక్‌లో ప్రచారం చేస్తున్న పోలీసులు

కావలి రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో నేర నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆటోలకు మైకులు పెట్టి ప్రచారం చేయించారు. ఇళ్లను వదిలి ఎవరైనా ఊర్లకు వెళ్తే బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. ఊర్లకు వెళితే పోలీసులకు తెలిపితే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. బంగారు ఆభరణాలకు మెరు గుపెడతామని కొత్త వ్యక్తులు వచ్చి అడిగితే పోలీసులకు సమాచారం తెలపాలన్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేసి మేము బ్యాంకు వాళ్లమని తెలిపి ఆధార్, ఏటీఎం నెంబర్లు అడిగనా చెప్పరాదన్నా రు. అలాగే అతి తక్కువ ధరకు ఏమైనా వస్తువులు అమ్మితే కొనరాదన్నారు. ఇళ్ల సమీపంలో ఏమైనా జూదం, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా 100నెంబరుకు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటి పరిసరాల్లో బయట దొంగలకు ఉపయోగ పడే గడ్డపారలు, రాడ్లు, కర్రలు ఉంచరాదన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామా ల్లో ప్రజలు క్రిస్మస్, సంక్రాంతిలకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సేవలను వినియోగించుకోవాలని గురువారం పోలీసులు ప్రచారం చేశారు. తీర్థ, విహార యాత్రలకు వెళ్లే వారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను అందచేస్తారని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

## దళిత సంఘాల నాయకుల నిరసన



కందుకూరులో నిరసన తెలుపుతున్న దళిత, బహుజన సంఘాల నేతలు




కావలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కందుకూరు: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కందుకూరుని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో వివిధ సంఘాల నేతలతో కలిసి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కళ్లగుంట మోహనరావు, గేరా చిరంజీవి, అబ్దుల్లా, వీరనారాయణ, గాండ్ల హరిప్రసాద్, రేణమాల అయ్యన్న, పాలేటి కోటేశ్వరరావు, బొట్లగుంట శ్రీను, గుంటక మల్లికార్జున ఉన్నారు.

● కావలి: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన వారు జాతికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సమితి నేతలు ఆలూరి బ్రహ్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, రమేష్, జనార్దన్, తిరుపతి పాల్గొన్నారు.

● అల్లూరు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను విమర్శిస్తూ బీజేపీ కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యసభలో మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధం అని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై కేంద్రం స్పందించి చర్యలు తీసువాలని డిమాండ్ చేశారు.

● ఉలవపాడు: కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి హోంమంత్రి పదవి నుంచి తొలగించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి ఆర్ మోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీజేపీ తన ఆర్‌ఎస్ఎస్, మనువాద సంస్కృతిని చాటుకుం దని వాపోయారు. ఇదే తరహాలో అంబేడ్కర్‌పై విషం కక్కితే దళిత, బడుగు, బలహీన వర్గాలు, ప్రజాసామ్య విప్లవశక్తులు ఏకమై మనువాద ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోటాయపల్లిలో గురువారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వీఆర్వో అంజాద్ పాల్గొన్నారు.

● దుత్తలూరులో: మండలంలోని లక్ష్మీపు రంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. సదస్సులో ప్రత్యేకాధికారి బాలాజీరావు, తహసీల్దారు వై.నాగరాజు ప్రజలు, రైతులన నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం: మర్రిపాడులో సదస్సులో డీటీ సంధ్య పాల్గొని అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజనారాయణ, వీఆర్వో గిరి, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: గ్రామ పంచాయతీలోని బీట్-1సచివాలయంలో గురువారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో ఖజామొద్దిన్, సర్పంచి భాగ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం: భీమవరప్పాడులో జరిగిన సదస్సుకు 4వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● గుడ్లూరు: స్థానిక పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో 29అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు స్వర్ణ తెలిపారు. అందులో ఇళ్లస్థలాల కేటాయింపుకు 21 అర్జీలు, వివిధ రకాల భూసమస్యలపై 8అర్జీలు ఉన్నట్లు చెప్పారు. కార్య క్రమంలో ఎండోమెంట్ ఈవో, వీర్వోలు చలమా రెడ్డి తిరుపాలు, సర్పంచ్ పాలకీర్తి శంకర్, గ్రామ నాయకులు ఉన్నం వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి మహేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు గంటి నపల్లి వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, పాలకీర్తి నాగేశ్వర రావు, అంజయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.



గుడ్లూరు: రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దారు స్వర్ణ

## పోలీసుల యోగాసనాలు

ఆత్మకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేషన్ ప్రాంగణంలో పోలీసులు గురువారం యోగాసనాలు నిర్వహించారు. సీఐ గంగాధర్ పోలీసులు, చిన్నారులు ఆసనాలు సాధన చేయించారు.

● సంగం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు యోగా చేశారు. యోగా గురు వు పెంచలయ్య వారితో పలు యోగాసనాలు సాధన చేయించా రు. కార్యక్రమంలో సంగం, చేజర్ల ఎస్‌ఐలు రాజేష్, సైదులు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు.



ఆత్మకూరు : యోగాసనాలు వేస్తున్న పోలీసులు, చిన్నారులు

## ప్రలోభాలతో మోసపోవద్దు : డీఎస్పీ

సంగం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రలోభాలతో గురై మోసపోవద్దని డీఎస్పీ వేణుగోపాల్ కోరారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని, అలాంటివి జరిగితే 1930కాల్ సెంటర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

## సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలే కీలకం



ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రమేష్

సంగం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సుస్థిరాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలే కీలకమని రాష్ట్ర పరిశీలకుడు రమేష్ పేర్కొన్నారు. గురువారం రెండో రోజు ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్లెసీమల సుస్థిరాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ఏపనికైనా ప్రణాళిక అవసరమన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో నారాయణ, ఎంపీడీవో షాలెట్, ఈవోఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

● అనంతసాగరం: 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. గురువారం ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. కార్యక్రమంలో ఏవో మస్తాన్ పాల్గొన్నారు.

## ఉత్తమ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కందుకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజరు కృష్ణశ్రీ తెలిపారు. గురువారం కందుకూరు సీటీఆర్‌ఐలో దక్షిణప్రాంత తేలికనేలలు, నల్లనేలల గురించి రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె పాల్గొన్నారు. సీటీఆర్‌ఐ హెడ్ అనూరాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు ఉన్నతాధికా రులు పాల్గొన్నారు. పొగాకు సాగును లాభదా యకంగా చేసుకునేందుకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధునాతన టెక్నాలజీతో రూపొందించిన ఆకు అల్లే యంత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు విస్తరణ మేనేజరు దామోదర్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ మేనేజరు శ్యాం ప్రసాద్, దక్షిణాది తేలికనేలల పరిధిలోని వేలం కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొడక్షన్ మేనేజరు కృష్ణశ్రీ

## ముసురుతో ఆందోళన

ఆత్మకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం నుంచి మళ్లీ ముసురు పట్టింది. గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. సాయంత్రం వరకు చల్లని గాలులు వీచాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా మళ్లీ వర్షాలు కురిసే అవకాశాలుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరినారు మళ్లు, మిరప, మినుము, పొగాకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ముసురుతో మెట్టలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు తెగుళ్ల ఉధృతి అధికమై దిడగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కండలేరు కాలువకు పరిష్కారం చూపండి

కందుకూరు, డిసెంబరు 19 (ఆన్‌లైన్): రాళ్లపాడు రిజర్వాయరు కుడికాలువ స్టాప్‌లాక్ షటర్ సమస్యను పరిష్కారించాలని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును కందుకూరు మాజీఎమ్మెల్యే దివి శివరాం కోరారు. గురువారం సాయంత్రం ఆయన అమరావతి సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సమస్య తీవ్రతను మంత్రికి వివరించారు. రాళ్లపాడు రిజర్వాయరు పరిధిలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా అందులో 22వేల ఎకరాలు కుడికాలువ కిందే సాగవుతుందని తెలిపారు. పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు చెప్పా రు. అనంతరం రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిసి కందుకూరు మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకు ఏ ర్పాటు ప్ర తిపాదన అమలు కాకుండా చూడాలని శివరాం విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారా యణరెడ్డిలను శివరాం మర్యాదపూర్వకంగా కలిశారు.

## చెత్త సేకరణ ట్రాక్టర్ కోసం నిరీక్షణ

కావలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెత్త తరలింపుకు సరిపడా వాహనాలు లేక ఇంటింటా సేకరించిన చెత్త రోడ్లపైనే దర్శనమిస్తోంది. గతంలో తోపుడు బండ్లతో సేకరించిన చెత్తను ఆ ప్రాంతంలో ఉన్న డంపర్‌బిన్‌లో వేసేవారు. అయితే డంపర్‌బిన్‌లు సకాలంలో తరలించకపోవటంతో దానిలో వేసిన చెత్త రోడ్లమీద పడి అపరిశుభ్రంగా దర్శనం ఇస్తుంది. తోపుడుబండ్లు రోడ్లపై పెట్టి కార్మికులు ట్రాక్టర్ వచ్చే వరకు అక్కడ నిరీక్షించలేక వెళ్లిపోతున్నారు. అందులో పందులు, ఇతర మూగజీవాలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త తరలింపుకు సరిపడా వాహనాలు సిద్ధం చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

● బిట్రగుంట: ఇబ్రహీంపేట మసీదు రోడ్డులో నిల్వ ఉన్న చెత్తను తొలగించాలని గురువారం స్థానిక మహిళలు కోరారు. కొన్నిరోజులుగా వేస్తున్న చెత్త, వ్యర్థపదార్థాలతో దుర్వాసన వస్తుందని వాపోయారు. పేరుకు మేజర్ పంచాయతీయే కాని పల్లెటూరు కన్నా అధ్వానంగా ఉందని చెబుతున్నారు. ఈ సమస్యతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రీసర్వే గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు కష్టాలు అధిగమిస్తాం

**● నాగరాజు, వ్యవసాయ సహాయసంచాలకుడు, కావలి**

**ఇంటర్వ్యూ...**



కావలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామాలలో ఈ- క్రాప్ నమోదు ఆలస్యమవుతోందని ఈ సమస్యను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. అలాగే కావలి సబ్ డివిజన్‌లో అత్యధికంగా 32వేల హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 80శాతం నాట్లు పూర్తి అయినట్లు చెప్పారు.

**? ఎన్ని హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు.**

! 32 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. దానిలో 80 శాతం వరకు ఇప్పటికే నాట్లు వేశారు. కొన్నిచోట్ల వరి నాట్లు వేస్తున్నారు.

**? ఎదురయ్యే సమస్యలు ఏమిటి**

! రీసర్వే జరిగిన గ్రామాలలో ఎల్‌పీ నంబరు వలన ఒక సర్వే నంబరులో ఉన్న మొత్తం విస్తీర్ణంలో పలువురు రైతులు ఉంటారు. ఆ నంబరులో ఉన్న ఒక రైతుకు సంబంధించిన పొలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తే అదే నంబరులో మిగతా రైతులకు ఈ-క్రాప్ నమోదుకు సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయి.

**? సిబ్బంది కొరత ఉందా.**

! సబ్‌డివిజన్‌లో 64 మంది గ్రామ వ్యవసా య సహాయకులు ఉండాల్సి ఉండగా 35మంది మాత్రమే ఉన్నారన్నారు.

**? ఈ-క్రాప్ నమోదులో జాప్యం ఎందుకు జరుగుతోంది.**

! ఈ-క్రాప్ నమోదుకు తగినంత మంది సిబ్బంది లేరు. అలాగే రీ సర్వే గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుకు సాంకేతిక సమస్యలు వస్తున్నందున ఆలస్యమవుతోంది. ఈ విష యాన్ని ఉన్నతాధికారులకు తెలిపాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.